అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 16-3-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 16 | Published from Karimnagar , Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

చైనా ఎన్నటికీ సోషలిజాన్ని వీడదు...

ప్రజలే మొదటి ప్రాధన్యతగా చైనా ఆధునీకరణ

- ప్రపంచ రాజకీయ పార్టీల సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
- సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా 530 పార్టీలు



న్యూఢిల్లీ : చైనా ఎన్నటికీ సోషలిస్టు విధానాన్ని విడనాడదని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్పష్టం చేశారు. బుధవారం చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) ఆధ్వర్యంలో "ప్రపంచ రాజకీయ పార్టీలు-ఆధునికీకరణ మార్గాలు" అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా 530 పార్టీలు పాల్గొనగా జీ జిన్‌పింగ్ ...5లో

ఈడీ కార్యాలయానికి ప్రతిపక్షాల ర్యాలీ

అడ్డుకున్న పోలీసులు

- పార్లమెంటులో మూడో రోజూ అదే తీరు
- అధికార, ప్రతిపక్షాల ఆందోళనతో ప్రతిష్టంభన



న్యూఢిల్లీ : అదానీ-హిండెన్‌బర్గ్ అంశంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ, అధికార బీజేపీ రాజకీయ లక్ష్యాల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ 18 ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయానికి ప్రదర్శన చేపట్టారు. ఈడీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించిన ఈ ర్యాలీని ఢిల్లీ పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు.

పార్లమెంట్ నుంచి బయటకు వచ్చిన నేతలను విజయ్ చౌక్ వద్ద భారీగా ఏర్పాటుచేసిన బారికేడ్లతో నిలువరించారు. 144వ సెక్షన్ అమలులో ఉందనీ, ఇక్కడ ఎలాంటి ఆందోళనలకు అనుమతి లేదనీ, ప్రదర్శన ముందుకు కదలడానికి వీలులేదంటూ అడ్డుకున్నారు. ఢిల్లీ పోలీసుల భారీస్థాయి బలగాల మోహరింపుతో ప్రతిపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ 'అదానీ అంశంపై ఈడీ డైరెక్టర్‌ను కలిసేందుకు మేం బయలుదేరాం. కానీ మేం వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించలేదు. ఇది చాలా పెద్ద కుంభకోణం. ఆ గ్రూప్‌లో ఎల్ఐసీ, ఎస్‌బీఐ, ఇతర బ్యాంకుల పెట్టుబడులున్నాయి. ప్రభుత్వ ఆస్తుల కొనుగోలుకు ప్రభుత్వమే ఒక వ్యక్తికి డబ్బు ఇస్తున్నది. గతంలో కొద్దిపాటి వ్యాపారాలు ఉన్న వ్యక్తి అనూహ్యంగా రూ.13 లక్షల కోట్లకు ఎలా ఎగబాకాడు? ఇది ఎలా సాధ్యం? ఎవరు డబ్బు ఇస్తున్నారు? మోడీకి, అదానీకి మధ్య ఉన్న సంబంధం ఏంటి? ఈ విషయాలు తెలుసుకోవడానికి ప్రయత్నించిన ప్రతిపక్ష నేతల గళాన్ని అణచివేస్తున్నారు' అని విమర్శలు గుప్పించారు. తాము 200 మంది ఎంపీలం ఉన్నామనీ, కానీ పోలీసులు 2,000 మంది ఉన్నారని విమర్శించారు. తమ గొంతును నొక్కేస్తున్నారనీ, మళ్లీ వారే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని ఆరోపించారు.

అలాగే కేంబ్రిడ్జిలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదని ఖర్గే స్పష్టం చేశారు. రాహుల్ నుంచి క్షమాపణ డిమాండ్ చేస్తున్నవారు, గతంలో ...5లో

ఏఈ పరీక్ష రద్దు

టీఎస్‌పీఎస్సీ నిర్ణయం

- ఇంకా ఎన్ని పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకయ్యాయో?
- అభ్యర్థుల్లో వీడని ఉత్కంఠ
- మూడోరోజూ టీఎస్‌పీఎస్సీ ముట్టడి ఉద్రిక్తం
- సమగ్ర విచారణ జరపాలి : సీపీఐ(ఎం)
- నిందితులను కఠినంగా శిక్షించాలి : ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ
- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : ఏబీవీపీ
- లీకేజీలో ఏ2 రాజశేఖర్‌రెడ్డి బీజేపీ కార్యకర్త
- ఆధారాలు బయటపెట్టిన బీఆర్ఎస్ నాయకులు

రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ శాఖలకు చెందిన విభాగాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పోస్టులకు ఈనెల ఐదో తేదీన నిర్వహించిన పరీక్షా ప్రశ్నాపత్రం లీకైనట్టు పోలీసుల విచారణలో తేలిందని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. దీంతో ఏఈ పరీక్షను రద్దు చేస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 14న ఏఈ పరీక్ష లీకైనట్టు సెంట్రల్ క్రైం స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైందని పేర్కొన్నారు. అన్ని వివరాలు పరిశీలించిన తర్వాత ఆ పరీక్షను రద్దు చేస్తున్నామనీ, పరీక్ష నిర్వహణ తేదీని త్వరలో ప్రకటిస్తామనీ వివరించారు. అయితే అభ్యర్థుల్లో ఉత్కంఠ వీడడం లేదు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఏఈతోపాటు ఇంకా ఎన్ని పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు లీకయ్యాయోనని ఆందోళనకు గురవుతున్నారు. ఇంకోవైపు టీఎస్‌పీఎస్సీలో ఉద్యోగం చేస్తూనే ఏ1గా ఉన్న ప్రవీణ్‌కు 103 మార్కులు ఎలా వచ్చాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లీకేజీకి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఏబీవీపీ ముట్టడించాయి. దీంతో మూడోరోజూ అక్కడ పరిస్థితి అట్టుడికింది. ఆందోళన చేపట్టిన వారిని పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. లీకేజీపై సమగ్ర విచారణ చేయాలంటూ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఇదిలావుండగా బుధవారం మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ప్రశ్నాపత్రం లీకేజీలో ఏ2గా ఉన్న అట్ల రాజశేఖర్‌రెడ్డి బీజేపీ కార్యకర్త అంటూ ఆధారాలతో సహా బీఆర్ఎస్ నాయకులు బయటపెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇది బీజేపీ కుట్ర అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రకటించింది. రిక్రూట్‌మెంట్‌ను ఆపడానికి బీజేపీ చేసిన కుట్ర అంటూ ...5లో

అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి : సీపీఐ(ఎం)



అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) ప్రశ్నాపత్రాల లీకేజీలో టీఎస్‌పీఎస్సీ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఆశతో ఎదురుచూస్తున్నారని ...5లో

సమగ్ర విచారణ జరపాలి : ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ



సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. బుధవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించాయి. టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించిన నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, ...5లో

రాజశేఖర్‌రెడ్డి బీజేపీ క్రియాశీల కార్యకర్త



ప్రశ్నాపత్రం లీకేజీలో ఏ2గా ఉన్న రాజశేఖర్‌రెడ్డి బీజేపీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఎన్నికల్లో బీజేపీ తరఫున అతడు ప్రచారం చేసినట్టు తెలుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు, బీజేపీకి రాజకీయంగా లాభం చేకూర్చేందుకే ప్రశ్నాపత్రం లీకేజీకి పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఈడీ నోటీసులు రద్దుచేయాలి

సుప్రీంకోర్టులో కవిత పిటిషన్

- దీనిపై 24న విచారణ
- థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తోంది : పిటిషన్‌లో కవిత

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కేసులో విచారణకు హాజరుకావాలని ఈడీ ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. ఈ నేపథ్యంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కానీ ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ నెల 24న విచారణ చేపడతామని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం ముందు కవిత తరఫున న్యాయవాది వందన సెహెగల్ బుధవారం ప్రస్తావించారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించాలని కోరారు. ఒక మహిళను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయానికి పిలవడం సరికాదని అన్నారు. ఇది పూర్తిగా ...5లో

అదానీపై విచారణ జరపాల్సిందే...

కాంగ్రెస్ చలో రాజ్‌భవన్

- గాంధీభవన్ నుంచి ప్రదర్శన
- అడ్డుకున్న పోలీసులు...వాగ్వాదం...
- ఖైరతాబాద్ చౌరస్తాలో నేతల అరెస్టు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అదానీ షేర్ల పతనంపై పార్లమెంటరీ కమిటీ వేయాలని, క్రోని క్యాపిటలిజానికి వ్యతిరేకంగా ఏఐసీసీ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని చేపట్టింది. గాంధీభవన్ నుంచి రాజ్‌భవన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఖైరతాబాద్ చౌరస్తాలో ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు రోడ్డుకు అడ్డంగా పెట్టారు. ఈ సందర్భంగా నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మోడీకి, అదానీకి వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలంటూ నినదించారు.ఎల్ఐసీని రక్షించుకుందామంటూ నాయకులు నినదించారు. ఈక్రమంలో నాయకులను అరెస్టు చేసి పంజాగుట్ట, గోషామహల్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవస్థలను ఏర్పాటు చేసి నవభారత నిర్మాణం చేసిందన్నారు. మాయమాటలు ...5లో

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు 23,198 మంది గైర్హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1కు 5,05,625 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో 4,82,427 (95.42 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 23,198 (4.58 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మొదటి రోజు సీ సెట్ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని తెలిపారు. నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇంటర్ బోర్డు పరిశీలకులు పర్యటించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారని పేర్కొన్నారు.

బీజేపీది మహిళా వ్యతిరేక పాలన



వివరాలు 2లో..

మోడీ మహానటనకు.. ఆస్కార్ వస్తుండే

ఆయన మాటలు కోటల్లో.. చేతలు పకోడీల్లో..

- దోస్తుతో కలిసి దేశాన్ని దోస్తుండు..
- మోడీ, ఈడీలకు భయపడబోం..ప్రజాకోర్టులోనే తేల్చుకుంటాం : కేటీఆర్



పిట్లం సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

"ఆర్ఆర్ఆర్ సినిమాలో నాటు-నాటు పాటకు ఆస్కార్ అవార్డు వచ్చింది. కానీ మనదేశంలో అద్భుతమైన మహానటుడు ఒకాయన ఉన్నాడు. ఆయన పేరును ప్రతిపాదిస్తే ఆ నటనకు తప్పకుండా అవార్డు వచ్చేది' అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోడీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ సెటైర్లు వేశారు. "ఆయనెవరో మీకు యాది ఉన్నాడా" అని కేటీఆర్ ప్రశ్నించగానే సభకు హాజరైన జనం నుంచి మోడీ అంటూ గట్టిగా వినిపించారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం జక్కాపూర్ గ్రామ శివారులో రూ.478 కోట్లతో నాగమడుగు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి కేటీఆర్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

'భాయి ఔర్ బహెనో.. జన్ ధన్ ఖాతా కోలో.. ధన్ ధన్ ఖాతమే పంద్రా (రూ.15లక్షలు) లాక్ అయ్యేగా' అని ప్రధాని మోడీ అన్నాడని, ఇక్కడున్న మీలో ఎవరి ఖాతాలోనైనా రూ. 15 లక్షలు పడ్డాయా అని ప్రశ్నించారు. లేదు లేదు అంటూ జనం చేతులు చూపారు. ఆ రూ. 15 లక్షలతో ...5లో



అచ్ఛేదిన్ కాదు.. చచ్చేదిన్...

ఎనిమిదిన్నరేండ్ల మోడీ పాలనలో ధరలు ఆకాశానికి



- ప్రజల ఆదాయాలు పాతాళానికి
- వంట గ్యాస్ ధర రూ.399 నుంచి రూ.1,150కి ఎగబాకిన వైనం
- లీటర్ పెట్రోల్ ధర రూ.71 నుంచి రూ.109కి...
- ఉప్పు, పప్పులతో సహా అన్ని రేట్లదీ అదే తీరు

బివిఎన్ పద్మరాజు

దేశానికి అచ్ఛేదిన్ (మంచి రోజులు) తీసుకొస్తామంటూ నమ్మబలికి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఏలుబడిలో పెరిగిన ధరలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అచ్ఛేదిన్ మాటేమోగానీ... ఇప్పుడు జనాలకు చచ్చేదిన్ దాపురించాయి. ఘనత వహించిన ప్రధాని మోడీ ఎనిమిదిన్నరేండ్ల పాలనలో కాదేదీ పెంపునకు అనర్హమన్నట్టు... ఉప్పు, పప్పులు, నూనెలు, ఇలా ఒకటేమిటి అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలను పెంచేసి ప్రజల నడ్డి విరిచారు. కరోనాతో ఉద్యోగాలు, ఉపాధి కోల్పోయి నడి రోడ్డులో నిలబడ్డ జనానికి... పెరిగిన ధరలు మరింత పెనుభారంగా మారాయి. వంట గ్యాస్‌తోపాటు పెట్రోల్, డీజిల్ ధరలు అంతకంతకూ పెరగటంతో వాటి ప్రభావం సరుకు రవాణాపై పడి, ఇటు కూరగాయలు, అటు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. వివరాలు 2లో..



78 సార్లు పెట్రోల్.. 76 సార్లు డీజిల్

మోడీ హయాంలో ధరా ఘాతం ఎంతగా ఉందనే దానికి పెట్రోల్, డీజిల్ రేట్లను ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఒక్క 2021లోనే 78 సార్లు పెట్రోల్ ధరలు, 76 సార్లు డీజిల్ ధరలు పెరిగాయి. ఆ ఒక్క ఏడాదే కాదు అంతకుముందు, ఆ తర్వాత కూడా ఇష్టారీతిన పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచుకుంటూ పోయారు. అంతర్జాతీయ చమురు మార్కెట్ రేట్లకు అనుగుణంగా ప్రతీరోజూ పెట్రోల్, డీజిల్ ధరలను మార్చుకునేందుకు వీలుగా 2017 నుంచి దేశంలో 'డైనమిక్ ప్రైసింగ్ పాలసీ'ని అమలు చేయటం వల్ల వాటి ధరలు విపరీతంగా పెరిగి జనం జేబులను గుల్ల చేస్తున్నాయి. ఇదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గిన సందర్భంలో సైతం దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా 'పెంచుడే తప్ప తగ్గించుడు లేదు...' అన్నట్టు కేంద్రం వ్యవహరిస్తుండటం గమనార్హం. అయితే వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన సందర్భాల్లో మాత్రం నామ్ కే వాస్తేగా ఏడెనిమిది సార్లు తగ్గించి... ఆ తర్వాత 70, 80 సార్లు పెంచుకుంటూ పోయారు. ఇదీ మోడీ సర్కార్ మేజిక్కు

తెలుగు కీర్తి విశ్వవ్యాప్తం...



వి. నాగయ్య
9441877695

'విశ్వ సినీయవనిక మీద ఒక తెలుగు సినిమా సత్తా చాటుతూ, ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డును గెలుచుకోవడం తెలుగువారిగా మనందరికీ గర్వకారణం... ఆస్కార్ అవార్డు పొందిన 'నాటు నాటు' పాటలో పొందుపరిచిన పదాలు... తెలంగాణ సంస్కృతికి, తెలుగు ప్రజల రుచి, అభిరుచికి, ప్రజా జీవన వైవిధ్యానికి అద్దం పట్టాయి... తెలుగు భాషలోని మట్టి వాసనలను, ఘాటును ఈ పాట ద్వారా గొప్పగా వెలుగులోకి తెచ్చిన రచయిత చంద్రబోస్ తెలంగాణ బిడ్డ కావడం... చిత్ర సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, దర్శకుడు రాజమౌళి, గాయకులు రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ, నటులు రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్, కొరియోగ్రాఫర్ ప్రేమ్‌రక్షిత్, సినిమా నిర్మాత డీవీవీ దానయ్య, ఇతర సాంకేతిక సిబ్బందికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు...' ఈ మాటలు అన్నది మరెవరో కాదు... తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్. ట్రిపుల్ ఆర్ మూవీ పాట 'నాటునాటు' బెస్ట్ ఒరిజినల్ సాంగ్‌గా ఆస్కార్ దక్కిన సందర్భంగా ఆయన ఈ మేరకు తన అభినందన సందేశాన్ని పంపారు. తెలుగు పాటకు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డు దక్కడంతో ప్రపంచ వ్యాప్తంగా నాటునాటు పాట అందరినోటా పలుకుతోంది. సంగీత సాగరంలో ప్రస్తుతం ఈ పాట ఉప్పొంగే కెరటాల్లా ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. ఇంతకూ ఈ పాట ఆస్కార్ అవార్డు దక్కించుకున్న ప్రధాన అంశాలేమిటి..? అంతగా ప్రభావితం చేసే అంశాలేంటి..? తెలంగాణ ప్రదేశంలో ఒక సాధారణ గిరిజన తెగకు చెందిన గోండు వీరుడికి చెందిన సంతతి జీవన నేపథ్యాన్ని వివరిస్తూ ట్రిపుల్ ఆర్ మూవీలో దర్శకుడు తీసుకున్న ఇతి వృత్తం ఎందుకంతలా సినివినీలాకాశంలో విహరిస్తోందన్న అంశానికి సంబంధించి చర్చించుకోవాల్సిన అవసరం ఉంది.

పాట కాదిది... ధిక్కార స్వరం...

అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌కు చెందిన ప్రఖ్యాత శిల్పి జార్జ్ స్టాన్లీ చేతుల్లో రూపుదిద్దుకున్న 13.5అంగుళాల పొడవుతో నగ్నంగా నిలుచున్న ఒక ధీరుని చేతిలో పదునెక్కిన ఖడ్గం... సుమారు నాలుగు కేజీల బరువున్న 24క్యారెట్ల బంగారు పూత పూసిన కళ్లు జిగేల్ మనిపించేలా కనిపించే ఆస్కార్ అవార్డును బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో న్యాయ నిర్ణేతలు ప్రకటించగానే ప్రపంచ వ్యాప్తంగా తెలుగు కీర్తి రెపరెపలాడింది. మరి ఇంతటి ఘనకీర్తి కలిగిన ఆస్కార్ అవార్డు దక్కించుకోవడానికి నాటు నాటు పాటకు ఉన్న ప్రత్యేకతలు ఒక సారి గుర్తుచేసుకుంటే... ఒక్క మాటలో చెప్పాలంటే అది పైకి పాటలా కనిపించినా అంతర్లీనంగా ఒక యుద్ధం దాగి ఉందని చెప్పక తప్పదు. లోతైన అర్థాన్ని పరిశీలిస్తే తమ సాంప్రదాయాలను, పద్ధతులను అగౌరవపరిచి, అవమానించి, హేళనగా చూసిన ఆంగ్లేయులకు తమ నృత్యం, పాట, సాహిత్యంతో తెలుగు వాడు ఎదురించి తన సత్తా చాటిన నేపథ్యాన్ని గుర్తించవచ్చు. ఈ పాటలోని సాహిత్యం, సంగీతం, నృత్య దర్శకత్వం, పాట లొకేషన్, వీడియో టేకింగ్, కొరియోగ్రఫీ, కాస్ట్యూమ్స్, కథ, కథనం, ఇలా అన్నింటా ఆ పాటలోని ఔన్నత్యం లోతుగా పరిశీలించిన వారికి స్పష్టంగా కనిపిస్తుంది. ఈ పాట సినిమాలో ప్రదర్శించిన నాటినుండే దేశ, విదేశాల్లో సైతం వివాహ వేదికపైన దంపతులు మొదలు, స్కూళ్లు కాలేజీలు, స్నేహితులు, సహోద్యోగులు అంతా ఎన్టీఆర్, రామ్‌చరణ్ వేసిన స్టెప్పులు వేసి సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. ఇక పాట చిత్రీకరణ విషయంలో దర్శకుడు రాజమౌళి స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న పరిస్థితులకు చక్కగా సరిపోయే విధంగా లొకేషన్ ఉండాలన్న ఆశయంతో ప్రపంచంలోని వివిధ దేశాల్లోని ప్రాంతాలను పరిశీలించి చివరికి ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంలోని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌ను ఎంపిక చేశాడు. బ్యాక్ డ్రాప్‌గా ఉంచి దిగ్గజ నటులుగా పేరున్న రామ్‌చరణ్, ఎన్టీఆర్‌తో పాటు భారీ సంఖ్యలో సైడ్ డ్యాన్సర్లను పెట్టి సరిగ్గా ఆనాటి రోజులు గుర్తుకు వచ్చేలా చేసిన కృషి అద్భుతమనే చెప్పాలి. ఇక్కడ మరో విషయం ఏమంటే కీవ్ నగరంలోని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్ కలర్‌కూడా సరిగ్గా సింక్ కావడం పాట చిత్రీకరణకు సరిపడా విశాలమైన గ్రౌండ్ ఉండటం పాటకు మరింత వన్నెలద్దింది. ఇంద్ర ధనస్సులోని ఏడు రంగులు, ప్రపంచంలోని ఏడు వింతల్లా ఈ పాటలోని ఏడు అంశాలు కూడా ప్రపంచ స్థాయికి చేర్చాయి. ఎన్టీఆర్, రామ్ చరణ్ ధరించిన క్యాస్ట్యూమ్స్, పాటలోని సాహిత్యం, సంగీతం, నాట్యం, లయ, శబ్దం, చిత్రంలోని కథ అన్నీ కూడా దర్శకుడు రాజమౌళి లాంటి దిగ్గజ దర్శకుడి చేతిలో అద్భుతంగా రూపుదిద్దుకుని చివరికి ప్రపంచ సినీ అవనికపై తెలుగు సినిమా కీర్తి రెపరెపలాడింది.



ఆస్కార్ దక్కించుకున్న తొలి తెలుగు చిత్రం ట్రిపుల్ ఆర్...

ప్రపంచ వేదికపై తెలుగు సినీ కీర్తి పతాకం రెపరెపలాడిరది. ఖండాంతరాలకు వ్యాపించిన తెలుగోడి ప్రతిభకు ఆస్కార్ పట్టం కట్టింది. తెలుగు ప్రేక్షకులు కండ్లు కాయలు కాచేలా ఎదురు చూసినట్టుగానే ఒరిజినల్ సాంగ్ కేటగిరిలో 'నాటు నాటు' పాటను ఆస్కార్ వరించింది. ఎమ్.ఎమ్ కీరవాణి, చంద్రబోస్ ఆస్కార్ అవార్డులు అందుకున్నారు. దర్శక దిగ్గజం రాజమౌళి తెరకెక్కించిన చిత్రం ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తుకు ఎదిగింది. ప్రపంచ వ్యాప్తంగా 81పాటలు ఆస్కార్‌కు ఎంట్రీ ఇవ్వగా... తుది జాబితాలో ఐదు పాటలు ఆస్కార్‌కు షార్ట్ లిస్ట్ అయ్యాయి. నాటు నాటుతో పాటు టెల్ ఇట్ లైక్ ఏ ఉమెన్ (అప్లాజ్), హెూల్డ్ మై హ్యాండ్ (టాప్‌గన్:మావెరిక్), లిఫ్ట్ మీ అప్ (బ్లాక్ పాంథర్), దిస్ ఈజ్ లైఫ్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్) పాటలు ఆస్కార్‌కు పోటీ పడగా... నాటు నాటు పాట ఆస్కార్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఇప్పటికే ఎన్నో ఇంటర్నేషనల్ అవార్డులు గెలుచుకున్న నాటు నాటు పాటకు ఇప్పుడు ఆస్కార్ రావడంతో భారతీయ సినీ ప్రేక్షకుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇటీవలే ఆస్కార్ తర్వాత అత్యంత ప్రతిష్టాత్మక అవార్డుగా భావించే గోల్డెన్ గ్లోబ్ అవార్డును నాటు నాటు పాట గెలుచుకుంది. ఆ అవార్డు గెలుచుకున్న తొలి ఆసియా పాట ఇదే. రిహాన్నా పాడిన లిఫ్ట్ మి అప్, టేలర్ స్విఫ్ట్ పాడిన కరోలినా, లేడీ గాగా పాడిన హెూల్డ్ మై హ్యాండ్ పాటలను వెనక్కి నెట్టి... బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో గోల్డెన్ గ్లోబ్ అవార్డును కైవసం చేసుకోవడం విశేషం. మరో ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ అవార్డు క్రిటిక్స్ చాయిస్‌ను కూడా నాటు నాటు దక్కించుకుంది. ఇందులో బెస్ట్ సాంగ్ అవార్డును నాటు నాటు సొంతం చేసుకోగా, ఉత్తమ విదేశీ భాషా చిత్రంగా ఆర్‌ఆర్‌ఆర్ నిలిచింది. ఉత్తమ పాట విభాగంలో హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డును నాటు నాటు సొంతం చేసుకున్నది. బెస్ట్ యాక్షన్ ఫిల్మ్, బెస్ట్ స్టంట్స్, ఉత్తమ అంతర్జాతీయ చిత్రం విభాగాల్లో ఆర్‌ఆర్‌ఆర్ సినిమా హెచ్‌సీఏ అవార్డులు దక్కించుకున్నది. బెస్ట్ సాంగ్ విభాగంలో హ్యూస్టన్ ఫిల్మ్ క్రికెట్ సొసైటీ అవార్డును కూడా నాటు నాటు కైవసం చేసుకున్నది. అదేవిధంగా ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆన్‌లైన్ ఫిల్మ్ క్రిటిక్స్ సొసైటీ (ఓఎఫ్‌సీఎస్) అవార్డును సైతం ఈ పాట సొంతం చేసుకోవడం గమనార్హం. ఎమ్.ఎమ్ కీరవాణి స్వరపరిచిన నాటు నాటు పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించాడు. కాలభైరవ, రాహుల్ సిప్లీగంజ్ ఆలపించారు. ప్రేమ్ రక్షిత్ నృత్య దర్శకత్వం వహించారు. ఈ పాటకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా రమా రాజమౌళి పనిచేశారు. ఇంతకుముందు సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందించిన స్లమ్‌డాగ్ మిలియనీర్ సినిమాలోని 'జయహెూ' పాటకు ఆస్కార్ వచ్చింది. దీంతో తెలుగుకు పట్టం కట్టడంతో దేశ ప్రధాని సహా వివిధ దేశాల ప్రధానులు, అధ్యక్షులు, భారతదేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, మాజీ ముఖ్యమంత్రులు, ట్రిపుల్ ఆర్ మూవీ చిత్ర యూనిట్‌కు, తెలుగు ప్రజలకు అభినందనలు తెలియజేస్తున్నారు. భవిష్యత్తులో తెలుగు సినిమా మరిన్ని అవార్డులు దక్కించుకోవాలని కోరుకుందాం. ■

కార్పొరేట్ కళాశాలల్లో బట్టీ చదువులు





తాటికొండ రవి

రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు వ్యాపారమే తమ లక్ష్యంగా లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఆకర్షించడానికి అనేక కొత్త రకమైన పేర్లు పెట్టుకుని మోసం చేస్తున్నారు. ప్రభుత్వం అనుమతి లేకండానే అడ్మిషన్లు డిసెంబరులోనే ప్రారంభించారు. ఇప్పటికే సగానికిపైగా పూర్తి చేసుకున్నారు. గతంలో రూ.2 లక్షల ఫీజులు ఉంటే, ఈ సంవత్సరం దాన్ని రెట్టింపు చేసి, విద్య పేద వారికి అందని ద్రాక్షగా మారుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్టు వ్యహరిస్తోంది. కార్పొరేట్ విద్యా సంస్థలో ఫీజుల నియ ంత్రణ చట్టం చేయాలని అనేక పోరాటాలు చేసినా పట్టించుకున్న నాథుడులేడు. వారు చేసే అక్రమాలు, అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ పెట్టకుండా నిర్లక్ష్యంగా ఉండటం సరైంది కాదు. ప్రధానంగా శ్రీ చైతన్య, నారాయణ లాంటి వాటి చాతుర్యానికి బలైపోతున్న ఎంతో మంది తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రెండేండ్ల పాటు హాస్టల్‌లో కొనసాగించేందుకు వారి వలలో పడి పోతున్నారు. ఫలితంగా ఎంతో మంది పల్లెల నుండి పట్నానికి వచ్చి కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు ఇక్కడి వాతావరణాన్ని త్వరగా ఆకలింపు చేసుకోలేకపోతున్నారు. ఇంటర్‌కు ముందు అంటే పదో తరగతి వరకు విద్యార్థిని, విద్యార్థులు తమ తల్లిదండ్రుల వద్ద స్వేచ్ఛా వాతావరణంలో పెరిగి ఉన్నఫలంగా ఒక్కసారిగా రెండేళ్ల 'ఖైదీ' అనుభవించలేక తమలో తాము సతమతమవుతూ విపరీతమైన మానసికవేదనకు గురవుతున్నారు. తల్లిదండ్రులు కాయా, కష్టం, అప్పు చేసి మరీ ఒక్కసారిగా లక్షల ఫీజులు చెల్లించి చదివిస్తుండటం తమ భవిష్యత్తు కోసమే అనే భావన వారిలో పెనవేసుకుని అత్యుత్తమంగా చదువలేక చతికిలపడిపోతున్నారు. కొండంత సెలబస్‌తో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఫలితంగా సెలబస్‌ను పూర్తిగా బట్టిపట్టే పక్రియలో విద్యార్థిని, విద్యార్థులు సమిధ లవుతున్నారు. ఈ క్రమంలో కార్పొరేట్ కళాశాలలు వెనుకపడ్డ విద్యార్థులకు స్పెషల్ క్లాసులంటూ మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాన్ని అధ్యాపకులు తూచా తప్పకుండా పాటిస్తున్నారు. కొంత మంది అధ్యాపకులు టార్గెట్ ఇస్తుండటంతో తమ బ్యాచ్‌లోని విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో వారిపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారు.

ఈ క్రమంలో మిడిల్‌క్లాస్ స్టూడెంట్స్ రోజుకోసారి, వారానికోసారి, ప్రత్యేకంగా జరిగే టెస్టుల్లో వెనుకబడి పోతున్నారు. ఇలాంటి వారిపై అధ్యాపకులు టార్గెట్ చేస్తున్నారు. ఉత్తమంగా చదవలేక, సెలబస్‌ను కంప్లీట్ చేయలేక బట్టీ చదువులకు అలవాటుపడుతున్నారు. ఈక్రమంలో తమలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభకు పూర్తిగా పుల్‌స్టాప్ పెడుతున్నారు. అధ్యాపకులూ ఏ మెథడ్‌లో చెబితే విద్యార్థులు గ్రహిస్తారు అనే అంశాన్ని మేనేజ్‌మెంట్ టార్గెట్స్‌తో ఏనాడో మర్చి పోయారు. ఎంత సేపటికి మేనేజ్‌మెంట్ పెట్టే టెస్టుల్లో ప్రతిభ చూపారా? లేదా అనే అంశాన్ని మాత్రమే ఇక్కడ కొలమాణంగా పరిగణిస్తున్నారు. వెనుకబడ్డ విద్యార్థులకు సింపుల్‌గా అర్థమయ్యే మెథడ్‌లో చెప్పేందుకు అధ్యాపకులకు సైతం టైం లేకపోవడం, వేలమంది ఒక్కో క్యాంపస్‌లో విద్యార్థులు ఉండటంతో ఇంట్రెస్టు ఉండి విద్యార్థులను గాడిలో పెడుతామనుకున్న అధ్యాపకులు సైతం ఎందుకొచ్చిందిలే గొడవ అంటూ సైడ్ అయిపోతున్నారు. ఈ క్రమంలో మిడిల్ క్లాస్ స్టూడెంట్స్ అలాగే ఉండిపోతున్నారు. బట్టి చదువులతో తాము ప్రతిభ చూపిస్తున్నామనుకుంటున్న వందలాది మంది విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థల లాంటి క్యాంపస్‌లు దాటాక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు.

ముఖ్యంగా కార్పొరేట్ విద్యాసంస్థలు తమ సంస్థకు ర్యాంకుల పంట పండాలని లెక్చరర్స్‌కు టార్గెట్స్ విధిస్తుండటంతో ఆ ఒత్తిడితో లెక్చరర్స్ తమ గ్రూప్‌లో పిల్లలు ఉత్తమంగా చదువాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో బట్టీ చదువులకు లెక్చరర్స్ జేజేలు పలుకుతున్నారు. ఆల్రెడీ ప్రీపేర్ చేసి ప్రింట్ తీసిన మెటీరియల్‌ను విద్యార్థులచే బట్టీ కొట్టిస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల్లో దాగి ఉన్న టాలెంట్ వెలికితీయకపోగా ఉన్నది కాస్త పోయే రీతిలో కార్పొరేట్ చదువులు కొనసాగుతున్నాయి. ఇక స్పెషల్ సెలబస్ అంటే ఐఐటీ, జేఈఈ, ఏఐఈఈఈ, నీట్ మొదలైన బ్యాచ్‌ల విద్యార్థుల ఒత్తిడి చెప్పజాలవు. ఉదయం నిద్రలేవగానే మొదలు రాత్రిళ్లు పొద్దు పోయే వరకు స్పెషల్ క్లాసులంటూ రుద్దుడే... రుద్దుడు. చదువు... చదువు తప్ప వేరే ధ్యాస లేకపోవడంతో మానసిక ప్రశాంతత కరువై, స్వేచ్ఛ కరువై వారిలో ఉన్న టాలెంట్‌కు పుల్‌స్టాప్ పడుతుంది. పదివరకు పదిలంగా తల్లిదండ్రుల వద్ద పెరిగిన ఎంతో మంది విద్యార్థిని, విద్యార్థులు కొత్త లక్ష్యాలతో మహానగరంలోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడుగుపెట్టి మనోధైర్యం కోల్పోతున్నారు. కొంత మంది ఇష్టంగా మరికొంత మంది అయిష్టంగానే అడ్మిషన్ తీసుకుంటున్నారు. మరి కొంత మంది తమ స్నేహితుల కోసం మరీ పట్టుబట్టి వారి తల్లిదండ్రుల మీద ప్రెషర్ పెట్టి మరీ కార్పొరేట్ విద్యాసంస్థల్లో జాయిన్ అవుతున్నారు. ఇలా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో విద్యనభ్యసించడానికి హాస్టళ్లలోని ఆయా క్యాంపస్‌లోకి ఎంటరైన విద్యార్థులు ఒక్క సారిగా మారిన వాతావరణాన్ని ఆకలింపు చేసుకోలేక పోతున్నారు. అంతకు క్రితం వరకు పాఠశాలల్లో చదువు పూర్తికాగానే ఇంటికి వెళ్లి తల్లిదండ్రుల వద్ద మెలిగిన వాతా వరణం ఒక్కసారిగా దూరమై కేవలం స్నేహితులు తోటి క్లాస్‌మెంట్స్ మాత్రమే తమ వాతావరణమైపోతుంది. ప్రథమ సంవత్సరంలో జాయిన్ అయిన తర్వాత ఒకటి రెండు వారాలు కొత్తగా ఉత్సాహంగా అనిపించినా రానురాను విద్యార్థుల్లో కొంత అలజడి మొదలైపోతుంది. తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడాలన్నా నిర్దీత టైంటేబుల్ ఉండటంతో ఆయా క్యాంపస్‌లో వేలాది స్టూడెంట్స్ మధ్య తమకెప్పుడు మాట్లాడే టైం వస్తుందోనని క్యాంపసుల్లో ఆశగా ఎదురు చూస్తుంటారు.

ఇక సెలవు దినాలు ముఖ్యంగా ఆదివారం వచ్చినా విద్యార్థులు పుస్తకాలతో మాత్రమే కుస్తీ పట్టాలి. కొంత సమయం విరామం ఇస్తే కిటికిల్లోంచి బయటి ప్రపంచాన్ని చూస్తూ ఆనందించే ఎంతో మంది విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ క్రమంలో చదువు అనే ఒత్తిడిని జయించలేక, అధ్యాపకుల ప్రెషర్‌ను తట్టు కోలేక, ర్యాంకుల వేటలో పరుగెత్తలేక, ఇంటి వద్ద తల్లి దండ్రుల పరిస్థితిని అర్థం చేసుకుని వారికే సమాధానం చెప్పాలో తెలియక వారిలో వారు మథన పడుతూ కృంగిపోతూ ఆత్మానూన్యతా భావంలో కొట్టు మిట్టాడుతూ సైకాల జీగా ఇబ్బంది పడుతున్నారు. చదువులో వెనకపడిపోయి రెండేండ్ల ఖైదీల జీవితాన్ని కేవలం నాలుగుగోడల మధ్య అనుభవించలేక, ఒత్తిడి తాళలేక ఆత్మహత్యలకు పూనుకుంటున్నారు. అందుకే తల్లిదండ్రుల్లారా కార్పొరేట్ విద్యా సంస్థల వలలో పడకుండా మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందివ్వండి. స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించండి.. వారిని సొంత నిర్ణయాలు తీసుకునే విధంగా ప్రేరేపించండి. వారిలో ఏ అంశం పై ఆసక్తి ఉందో గ్రహించండి. ఆ దిశగా వారికి ఎంకరేజ్ చేయండి. అప్పుడే మీ బిడ్డల భవిష్యత్తు ఉజ్వలంగా తీర్చిదిద్దబడుతుంది.

సెల్:9177302248

బీజేపీది మహిళా వ్యతిరేక పాలన

సమానత్వమున్న దేశాల్లో వేగంగా అభివృద్ధి

- స్త్రీలను వంటింటికి పరిమితం చేసే యత్నం
- హక్కుల కోసం ఐక్యపోరాటాలు చేయాలి
- మహిళా దినోత్సవ కార్యక్రమంలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పురుషులతో పాటు మహిళల్ని సమానంగా గౌరవించే దేశాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతున్నదని పలువురు వక్తలు అన్నారు. మన దేశంలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనీ, బీజేపీ ప్రభుత్వం మహిళా వ్యతిరేక పాలన చేస్తున్నదని చెప్పారు. మనుస్మృతిని తిరిగి అమల్లోకి తెచ్చి మహిళలను వంటింటికే పరిమితం చేసే దుర్మార్గపు ప్రయత్నాల్లో ఉందని విమర్శించారు. మహిళాభ్యున్నతి కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా, సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, టీఎస్‌యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్టు విధానం ద్వారా 12 గంటల పని చేయించుకుంటూ తీవ్ర శ్రమ దోపిడీకి పాల్పడుతున్న పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు పనిప్రదేశం నుంచి ఇంటికొచ్చాక రోజువారీ పనులు చేసుకోవడంతో తీవ్రంగా అలసిపోయి అనారోగ్యాల పాలవుతున్న తీరును వివరించారు. ఆడ, మగ అనే వివక్ష చూపకుండా పిల్లలను పెంచాలని కోరారు. భ్రూణ హత్యలు విపరీతంగా పెరిగిపోతుండటంతో వివాహం చేసుకోవడానికి అమ్మాయిలు దొరకని పరిస్థితి ఉందని చెప్పారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ..ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో మహిళల పాత్ర మరువలేనిదని కొనియాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యలో మతభావజాలాన్ని జొప్పించి మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూపే ప్రయత్నం చేస్తున్నదన్నారు. అన్ని పార్టీలూ మద్దతు తెలుపుతున్నప్పుడు లోక్‌సభలో మహిళా బిల్లును పెట్టడానికి ఏం అడ్డం వస్తున్నదని బీజేపీని ప్రశ్నించారు. ఒకవేళ ఆ బిల్లు ఆమోదం పొందితే చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరిగి ఆ పార్టీ భావజాల వ్యాప్తికి ఆటంకం అవుతుందనే బీజేపీ అడ్డుపడుతున్నదని విమర్శించారు. శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ రమ మాట్లాడుతూ..ఓటుహక్కు, సమానపనికి సమాన వేతనం, కనీసం మనుషులుగా గుర్తించండి అని మహిళలు రోడ్లెక్కి పోరాట స్ఫూర్తిని ప్రదర్శించిన రోజును గుర్తుచేసుకుంటూ మహిళా దినోత్సవాన్ని ఓ స్ఫూర్తి దినంగా జరుపుకుంటున్నామని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలంటే చిన్నచూపు చూసే పరిస్థితి ఉందన్నారు. అంతరాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా జరుగుతున్న పోరాటంలో అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ రైతాంగ పోరాట స్ఫూర్తితో లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాటం చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి మాట్లాడుతూ..30 శాతం కుటుంబాలను మహిళలే పోషిస్తున్నారనీ, మహిళల ఉపాధి కోసం ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఐదారువేల రూపాయలే జీతాలిస్తున్నారనీ, వాటితో ఎలా బతకాలో పాలకులు చెప్పాలని ప్రశ్నించారు. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన వారిని జైలు నుంచి స్వాగతిస్తూ ర్యాలీలు తీయటం బీజేపీ దుర్మార్గానికి పరాకాష్ట అని విమర్శించారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ బి.పద్మ మాట్లాడుతూ..మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి, ఆఫీసు పనులు చేసి సరైన తిండి తీసుకోకపోవడం వల్ల దేశంలోని 50 శాతానికి పైగా మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని వాపోయారు. నేడు అన్ని రంగాల్లో మగవాళ్లతో సమానంగా రాణిస్తున్న మహిళలను వంటింటికే పరిమితం చేసే విధానాలను బీజేపీ అమలు చేస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, ఐద్వా ఉపాధ్యక్షులు ఆశాలత, సీఐటీయూ నాయకులు ఆర్.వాణి, శ్రామిక మహిళా సెంట్రల్ సిటీ కన్వీనర్ మీనా, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అటవీ క్రీడోత్సవాల్లో తెలంగాణకు 16 పతకాలు

క్రీడాకారులను అభినందించిన సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హర్యానాలోని పంచకులలో జరిగిన జాతీయ అటవీ క్రీడోత్సవాల్లో తెలంగాణ అధికారులు, సిబ్బందికి 16 పతకాలు లభించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ తొమ్మిదో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన అటవీ శాఖ అధికారులను బుధవారం హైదరాబాద్‌లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి అభినందించారు. జాతీయ స్థాయి క్రీడలకు సంబంధించిన వివరాలను సీఎస్‌కు ఐఎఫ్ఎస్ అధికారి బాలాదేవి వివరించారు. తెలంగాణకు ఎనిమిది బంగారు, రెండు రజత, ఆరు కాంస్య పతకాలు దక్కాయని తెలిపారు. చత్తీస్‌గఢ్, కర్నాకట, కేరళ రాష్ట్రాలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయన్నారు.

బిలియడ్స్‌లో బాలాదేవి రెండు బంగారు పతకాలు సాధించారు. అథ్లెటిక్స్‌లో బి.ఖాజా, ఎం.సునీత, వి.సాంబయ్య, స్విమ్మింగ్‌లో జి.కిష్టాగౌడ్, బి.సత్రు, క్యారమ్స్‌లో ఫూజీ కమాలుద్దీన్‌లతో పాటు చెస్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో తెలంగాణ అటవీ శాఖ ఉద్యోగులు పతకాలు సాధించారు. క్రీడాపోటీలకు పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియల్ స్వయంగా హాజరై ఉద్యోగులను ఉత్సాహపరిచారు. పీసీసీఎఫ్ (ఎఫ్‌ఏసీ) ఎంసీ. పర్గెయిన్ తెలంగాణ అటవీశాఖ తరపున సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఐదురోజుల పాటు వర్షసూచన

- పలుప్రాంతాల్లో ఈదురు గాలులతో వడగండ్ల వాన పడే అవకాశం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న వెల్లడించారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. అదే సమయంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వాన పడే సూచనలు కనిపిస్తున్నాయి. నిజామాబాద్, కామారెడ్డి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, కొమ్రం భీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, జనగాం జిల్లాల్లో అక్కడక్కడా వడగండ్ల వాన పడే అవకాశముంది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ వరకు ద్రోణి కొనసాగుతున్నది. అది ఒరిస్సా వైపు కదులుతున్నది. రాష్ట్రం మీదుగా కిందిస్థాయిలో తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తున్నాయి. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జూలూరుపాడులో అత్యధికంగా 38.7, అశ్వాపురంలో 38.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డ య్యాయి. ఆదిలాబాద్ జిల్లా తాళ్ల మడుగులో 6.3 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది.

అచ్ఛేదిన్ కాదు..చచ్చేదిన్...

(మొదటిపేజీ తరువాయి)

వంటింట్లో మంటలు

నేడు పెరిగిన వంట గ్యాస్ ధర వంటింట్లో మంటలు పెడుతున్నది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు 2011లో రూ.399.26 ఉన్న గ్యాస్ (14.2 కిలోలు) ధర 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.414కు పెరిగింది. ఆ తర్వాత 2015లో దాని ధర రూ.452కు ఎగబాకింది. అప్పటి నుంచి ఇప్పటి దాకా బాదుడు మీద బాదుడు బాదటంతో ఇప్పుడు ఏకంగా రూ.1,150కి చేరింది.ఇది చాలదన్నట్టు ఇతరత్రా అనేక ఫీజులు, రుసుముల రూపంలో కూడా సర్కారు తాను వడ్డించదలుచుకున్న వాటిని యథేచ్ఛగా వడ్డిస్తూ పోతున్నది. ఉదాహరణకు రైల్వే టిక్కెట్లను రద్దు చేసుకున్న సందర్భంలో ప్రయాణీకుల నుంచి వసూలు చేసిన ఫీజు రూ.2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.352 కోట్లుగా నమోదైతే... 2021-22లో మరింత పెరిగి రూ.694 కోట్లుగా నమోదైంది. 2022-23లో ఆ రూపంలోనూ ఫీజు రూ.604 కోట్లుగా నమోదవటం గమనార్హం. ఈ రకంగా బాదుతుంటే..సామాన్యుడి జీవితం ఏంగానూ...?

2014 నుంచి ఇప్పటి వరకూ పెరిగిన ధరలు... (రూ.లలో)

వస్తువు	2014లో	ప్రస్తుతం ధర	పెరిగిన శాతంలో
వంటగ్యాస్	399	1,150	185
పెట్రోల్ (లీటర్)	71	109	53
డీజిల్ (లీటర్)	55	97	76
బియ్యం (కిలో)	27	55	103
వంటనూనె (కిలో)	83	165	98
ఉల్లిగడ్డలు (కిలో)	10	30	200
గోధుమపిండి (కిలో)	22	62	181
ఉప్పు (కిలో)	10	22	120
చక్కెర (కిలో)	24	42	75
పాలు (లీటర్)	38	64	68
ఆలుగడ్డలు (కిలో)	18	35	94
ఛాయ్‌పత్తా (కిలో)	194	320	65
చింతపండు (కిలో)	40	120	200
కందిపప్పు (కిలో)	50	118	136
మినపప్పు (కిలో)	32	106	231
శనగపప్పు (కిలో)	24	70	191
అరటిపండ్లు (డజను)	33	55	66
గుడ్లు (డజను)	38	75	98

అన్ని మెడికల్ కాలేజీల్లో స్కిల్ ల్యాబ్‌లు

- డీఎంఈ డాక్టర్ కె.రమేశ్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీల్లో స్కిల్ ల్యాబులను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డి తెలిపారు. బుధవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో రాష్ట్రంలోనే తొలి స్కిల్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్‌లో అన్ని రకాల అత్యవసర పరిస్థితుల్లో బాధితులను కాపాడేందుకు ప్రాథమికంగా చేయాల్సిన విషయాలను మూడు రోజుల పాటు నేర్పించనున్నట్టు చెప్పారు. తొలి దశలో డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఈ శిక్షణ ఉంటుందనీ, భవిష్యత్తులో ఇతర వత్తుల వారికి, సామాన్యులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళా రెడ్డి మాట్లాడుతూ స్కిల్ ల్యాబ్ రాకతో విద్యార్థులు మరింత సామర్థ్యంతో, నైపుణ్యంతో సర్జికల్, కార్డియాక్, ప్రసూతి అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించగలుగుతారని తెలిపారు. శిక్షణ పొందిన వారికి జాతీయ గుర్తింపు పొందిన సర్టిఫికేట్‌ను అందజేస్తామని తెలిపారు. మెడికల్ గ్రాడ్యుయేట్లకు ఈ సర్టిఫికేట్ పొందడం తప్పనిసరి అని వివరించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ మేడోజు, స్కిల్ ల్యాబ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పాండు నాయక్ పాల్గొన్నారు.

రెండో రోజు 50కి పైగా కరోనా కేసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కరోనా కేసులు గత కొన్ని రోజులుగా పెరుగుతున్నాయి. కొన్ని నెలల తర్వాత వరసగా రెండో రోజు 50కి పైగా కేసులు నమోదయ్యాయి. మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు 4,937 మందికి టెస్టులు చేయగా 54 (1.09 శాతం) మందికి పాజిటివ్ వచ్చింది. మరో 25 మంది కరోనా నుంచి కోలుకున్నట్టు వైద్యారోగ్యశాఖ బులెటిన్‌లో వెల్లడించింది.

ఖమ్మం అభివృద్ధికి కట్టుబడి ఉన్న సర్కార్

గోళ్లపాడు ఛానల్ అభివృద్ధే నిదర్శనం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

"ఖమ్మం జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. మురికికూపంగా ఉండే గోళ్లపాడు ఛానల్‌ను అభివృద్ధి చేసిన తీరే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఖమ్మం జిల్లా సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నారు" అని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొంది. గోళ్లపాడు ఛానల్‌ను ముఖ్యమంత్రి హామీ పథకం కింద రూ.70 కోట్లతో ఆధునీకరించి, ఉద్యానవన పార్కులు, క్రీడా ప్రాంగణాలుగా అభివద్ధి చేసినట్టు తెలిపారు. రోజువారీ రెండు కోట్ల లీటర్ల సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధి కేంద్రంతో దీనిని అనుసంధానం చేయడం వల్ల ఖమ్మం నగరంలోని 22 కాలనీలవాసులకు దుర్గంధం, వరద ముంపు నుంచి విముక్తి కలిగించినట్టు అయ్యిందన్నారు. గోళ్లపాడు ఛానల్ అభివృద్ధి పనుల్లో భాగంగా 10.60 కిలోమీటర్ల సీవరేజి పైపులైన్లు వేసి, మురుగునీటిని శ్రీనివాసనగర్ లో నెలకొల్పిన 20 ఎల్.ఎం.డి. సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు మళ్లించారు. అలాగే వరద ముంపు నివారణలో భాగంగా 6.50 కిలోమీటర్ల పొడవున స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు నిర్మించి వరద నీటిని మున్నేరు నదిలోకి వెళ్లే వెసులుబాటు కల్పించినట్టు వివరించారు. ఈ ఛానల్ ఆధునీకరణ కోసం 812 ఆక్రమణలను తొలగించి, అక్కడ నివసిస్తున్న కుటుంబాలకు"వెలుగుమట్ల లే అవుట్‌లో పునరావాసం కల్పించారు. రోడ్లు, విద్యుత్తు, వీధిదీపాలు, మరుగుదొడ్లు, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి, అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించినట్టు తెలిపారు. ప్రకాశ్ నగర్, సుందరయ్య నగర్, పంపింగ్ వెల్ రోడ్, రంగనాయకులగుట్ట, వనజీవి రామయ్య పార్క్, జూబ్లీ క్లబ్ తదితర ప్రాంతాల్లో విశాలమైన పార్కింగ్ స్థలాలు, అందమైన శిల్పాలు, పెయింట్ చేసిన గోడలతో ప్రవేశ ద్వారం తోరణాలు, ల్యాండ్‌స్కేపింగ్ రౌండ్ బెంచీలు, పచ్చదనం, పచ్చిక బయళ్లు, ఫౌంటైన్‌లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. అలాగే ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్ ప్లే ఎక్విప్‌మెంట్, చెస్ ప్లేయింగ్ టేబుళ్లు, మెగా చెస్ బోర్డ్, స్కేటింగ్ రింక్, బ్యాడ్మింటన్ కోర్టులు, ఖోఖో, వాలీబాల్ కోర్టులు, బాస్కెట్‌బాల్ కోర్ట్ వంటి క్రీడా సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు.

బాల వికాస సంస్థపై ఐటీదాడులు అమానుషం : మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 25, 30 ఏండ్ల నుంచి దేశ, విదేశాల నుంచి నిధులు సమకూరుస్తూ, నిస్వార్థ ప్రజా సేవ చేస్తున్న బాల వికాస సంస్థపై ఐటీ దాడులు చేయడం అమానుషమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాల వికాస క్రిస్టియన్ మిషనరీ సంస్థ అవడం వల్లే ఈ ఐటీ దాడులు జరిగాయని ఆరోపించారు. ఈ దాడులు కక్ష సాధింపు చర్యలో భాగమేనని పేర్కొన్నారు.

విభజన చట్టం బేఖాతర్

- గిరిజన విశ్వవిద్యాలయం.. ఏర్పాటులో తీవ్ర జాప్యం
- గిరిజనుల్లో తీవ్ర అసంతృప్తి



నవతెలంగాణ- వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ములుగు జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు ఎండమావిగా మారింది. ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయం సమీపంలో 335 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నేటికీ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. రూ.865 కోట్ల అంచనా వ్యయంతో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాల్సి ఉండగా, తాత్కాలికంగా జాకారంలోని ఐటీడీఏ యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో తరగతులు నిర్వహించాలని సైతం నిర్ణయించినా.. నేటికీ ప్రారంభించకపోవడం గమనార్హం. ఐదేండ్లలో 2,500-3,000 మంది విద్యార్థులు విద్యనభ్యసించే అవకాశముంది. 2017-18లో రూ.10 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం తర్వాత బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లేదు. 2018-19లో తరగతులు ప్రారంభమవుతాయని భావించినా నేటికీ ప్రారంభం కాలేదు. గతేడాది పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయం బిల్లు 2022 ప్రవేశపెట్టనున్నట్టు పార్లమెంటు బులెటిన్‌లో పేర్కొన్నా నేటికీ బిల్లు పెట్టకపోవడం పట్ల గిరిజనులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని గట్టమ్మ గుడి వద్ద 335 ఎకరాల భూమిని సేకరించి ఏటూర్‌నాగారం ఐటీడీఏకు స్వాధీనపరిచింది. 169 ఎకరాల ప్రభుత్వ భూమి, 115 ఎకరాల అసైన్డ్ భూమిని సమీకరించారు. ఇందుకుగాను రూ.15 కోట్ల మేరకు నష్టపరిహారం చెల్లించారు. కాగా, ఎనిమిదేండ్లుగా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహించిన కేంద్రం ఎట్టకేలకు 2017-18 బడ్జెట్‌లో మాత్రం రూ.10 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నది. నాటి నుంచి నేటి వరకు పైసా విదిల్చింది లేదు. పనులు ప్రారంభించింది లేదు. కేంద్ర ప్రభుత్వ వైఖరి పట్ల ఉమ్మడి వరంగల్ జిల్లా గిరిజనులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటైతే 5 ఏండ్లలో 2,500 నుంచి 3,000 మంది విద్యార్థులు విద్యనభ్యసించే అవకాశముంటుంది. బీసీఏ, బీఏ (హోటల్ మేనేజ్‌మెంట్), బీబీఏ (లాజిస్టిక్స్), పీజీ కోర్సులకు సంబంధించి ఎంసీఏ, మాస్టర్ ఇన్ ట్రైబల్ కల్చర్, ఎంబీఏ (మార్కెటింగ్) తదితర కోర్సుల్లో ప్రవేశాలుంటాయి. 2017-18లో రూ.10 కోట్లను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం నేటికీ ఎలాంటి పనులు ప్రారంభించలేదు. తాత్కాలికంగా తరగతులను ప్రారంభించడానికి జాకారంలోని ఐటీడీఏ యువత శిక్షణా కేంద్రం అందుబాటులో ఉన్నా నేటికీ ప్రారంభించకపోవడం గమనార్హం. ప్రతి కోర్సులో 30 సీట్లను భర్తీ చేసే అవకాశముంటుంది. ఈ మేరకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) సమగ్ర ప్రాజెక్టు నివేదికను కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి శాఖకు అందించినా, నేటికీ కేంద్రం స్పందించడం లేదు.

పార్లమెంటు బులెటిన్‌లో ప్రకటించి..

గతేడాది పార్లమెంటు వర్షాకాల సమావేశంలో పార్లమెంట్ బులెటిన్‌లో తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయం 2022 బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. బులెటిన్‌లో ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయం ఏర్పాటులో తీవ్ర తాత్సారం చేస్తుంది. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్. సుబ్రహ్మణ్యం ములుగు జిల్లాను డిసెంబర్ 2018లో సందర్శించారు. 2019-20లో తరగతులు ప్రారంభమవుతాయని భావించినా నేటికీ ప్రారంభం కాలేదు. దాంతో గిరిజన విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు నేడే

- రెండు రూమ్‌లు, 28టేబుళ్లు
- మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ

నవతెలంగాణ- సిటీబ్యూరో

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం గురువారం సాయంత్రం వరకు వెలువడే అవకాశముంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8గంటలకు ప్రారంభం కానుంది. 13న జరిగిన పోలింగ్‌లో 90.40శాతం ఓట్లు పోలైన విషయం తెలిసిందే. ఈనెల 16 ఓట్ల లెక్కింపు సందర్భంగా 8మంది అదనపు కలెక్టర్లు, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌ను కేటాయించారు. వీరిలో ఐదుగురు ఐఏఎస్ అధికారులు ఉన్నారు. వీరిలో వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్, జోగులాంబ గద్వాల్ జిల్లా అదనపు కలెక్టర్ అపూర్ చౌహాన్, నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ ఎం.మనుచౌదరీ, నారాయణపేట్ అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్(ఎన్నికలు) పంకజ, మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణగోపాల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏ.నర్సింహ్మారెడ్డి ఉన్నారు.

రూమ్‌కు 14 టేబుళ్లు

ఓట్ల లెక్కింపునకు రెండు రూమ్‌ల్లో ఏర్పాట్లు చేశారు. ఒక్కో రూమ్‌కు 14 టేబుళ్లను కేటాయించారు. అందుకోసం సిబ్బంది, సూపర్ వైజార్‌లు, అబ్జర్వర్లు ఉదయం 6.30 గంటలలోపు కౌంటింగ్ కేంద్రంలో ఉండాలని రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలా ఆదేశాలు జారీచేశారు. ఏజెంట్లు ఉదయం 7 గంటల వరకు కౌంటింగ్ కేంద్రానికి రావాల్సి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ కోసం 28 టేబుళ్లను ఏర్పాటు చేయగా ప్రతి టేబుల్‌కూ సూపర్‌వైజర్, ఇద్దరు సిబ్బంది, అబ్జర్వర్‌ను నియమించారు. ఒక్కో రూంకు ముగ్గురు ఏఆర్‌ఓలు, రిటర్నింగ్ ఆఫీసర్ వద్ద మరో ముగ్గురు ఏఆర్‌ఓలుగా అడిషనల్ కలెక్టర్‌లను నియమించారు. గత ఎన్నికల్లో మొదటి రౌండ్ లెక్కింపులోనే ఫలితం వచ్చింది. ఈ సారి కూడా మొదటి రౌండ్‌లోనే ఫలితం వచ్చే అవకాశముంది. ఒకవేళ ఫలితం రాకపోతే రెండో రౌండ్‌లోనూ ఓట్లను లెక్కించడానికి ఏర్పాట్లు చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

ఫలితాలపై ఉత్కంఠ

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థులు ఎవరికివారే గెలుపు మాదే అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాపన్నగారి మానిక్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఏవీఎన్‌రెడ్డి మధ్యనే తీవ్రమైన పోటీ ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు : వికాస్‌రాజ్

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. బుధవారం సరూర్‌నగర్ స్టేడియంలో కౌంటింగ్ సెంటర్‌ను వికాస్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపు కోసం అన్నీ సిద్ధం చేశారని, గత ఎన్నికలలో ఒకే రౌండ్‌లో లెక్కింపు పూర్తయిందని, ఈసారి ఒకే రౌండ్‌లో పూర్తికాకపోతే రెండో రౌండ్ లెక్కింపు చేయడానికి కూడా ఆర్‌ఓ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. తదనంతరం హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ డీఎస్.లోకేష్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వీరి వెంట రిటర్నింగ్ ఆఫీసర్ ప్రియాంక అలా, ఏఆర్‌ఓ పంకజ, ఎస్‌సీ అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

'బాలవికాస'లో ఐటీ దాడులు

నవతెలంగాణ-కాజీపేట

వరంగల్‌లో మరోసారి ఇన్‌కమ్ ట్యాక్స్ ఐటీ అధికారుల సోదాలు కలకలం రేపాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా బాలవికాస స్వచ్ఛంద సంస్థ, వాటి అనుబంధ సంస్థలకు సంబంధించిన రికార్డులను ఐటీ అధికారులు బుధవారం ఉదయం నుంచి తనిఖీ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 40 ప్రాంతాల్లోని మిషనరీ స్వచ్ఛంద సంస్థలపై ఐటీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ప్రముఖ సంస్థగా పేరుగాంచిన బాలవికాస స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యాలయమైన హన్మకొండ జిల్లా కాజీపేట ఫాతిమానగర్‌లోని కార్యాలయంలో ఐటీ అధికారులు దాడులు చేసి సోదాలు జరిపారు. బాలవికాస సంస్థకు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఫండ్స్‌తో పాటు దేశపరంగా అమెజాన్ ప్రముఖ కంపెనీలతో నిధులు వస్తున్నప్పటికీ సంస్థ పక్షాన ప్రభుత్వానికి ఇన్‌కమ్ టాక్స్ చెల్లించకపోవడంతో పూర్తిస్థాయిలో ఎగ్గొట్టడంతో ఇన్‌కమ్ టాక్స్ అధికారులు దాడులు నిర్వహించినట్టు సమాచారం. బాలవికాస సంస్థ వరంగల్ జిల్లా ప్రధాన కార్యాలయంలో విధులు సిబ్బంది ఇండ్లలోనూ తనిఖీలు జరిగాయి. 20 వాహనాల్లో సీఆర్పీ సిబ్బంది సహాయంతో ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు.

మిరప మెరుపు

- తేజా రకం ఖమ్మం మార్కెట్లో రూ.22,501, వరంగల్‌లో 23 వేలు..
- సింగల్ పట్టి క్వింటాల్ రూ. 63వేలు
- ఈ సీజన్‌లో ఇదే రికార్డు స్థాయి ధర



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/కాశిబుగ్గ

ఖమ్మం, వరంగల్ వ్యవసాయ మార్కెట్లో మిర్చి మెరిసింది. తేజా, సింగల్ పట్టి రకం మిర్చి ధరలు రికార్డు నమోదు చేస్తున్నాయి. సీజన్‌లోనే అత్యధికంగా బుధవారం వరంగల్ మార్కెట్‌లో క్వింటాల్ మిర్చి రూ23వేలు పలుకగా, ఖమ్మం మార్కెట్‌లో రూ.22,501 రేటు పలికింది. ఒక్కరోజులోనే మిర్చి ధర ఒక్కసారిగా క్వింటాకు దాదాపు రూ.వెయ్యికి పైగా పెరిగింది. చివరికి తాలు మిర్చి సైతం రూ.14వేలు పలికింది. నాణ్యతను బట్టి క్వింటాల్ రూ.18వేల నుంచి రూ.23వేల వరకు కొంటున్నారు. పంట విస్తీర్ణంతో పాటు చీడపీడల ప్రభావం కూడా అధికంగా ఉండటంతో దిగుబడి తగ్గింది. ఈ కారణంగా మిర్చి ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. ఆన్ సీజన్‌లో ఉండాల్సిన రేటు ఇప్పుడే పలుకుతుండటంతో రైతులు కూడా కోత కోసిన వెంటనే విక్రయిస్తున్నారు.

వరంగల్ మార్కెట్‌లో గరిష్టస్థాయి ధరలు..

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఎర్ర బంగారం ధరలు అమాంతం పెరుగుతున్నాయి. బుధవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు సుమారు 50 వేల బస్తాల మిర్చి వచ్చినట్టు అధికారులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బేరువాడ గ్రామానికి చెందిన బానాలు అనే రైతు తేజా రకం మిర్చి 50 బస్తాలు తీసుకురాగా నాగేంద్ర ట్రేడింగ్ కంపెనీ ఆర్తి ద్వారా లాలా ట్రేడింగ్ కంపెనీ రికార్డు స్థాయిలో రూ.23 వేలు ధర పెట్టి కొనుగోలు చేశారు. తేజ రకం మిర్చి 9వేల బస్తాలు రాగా, గరిష్ట ధర రూ.23వేలు పలుకగా కనిష్ట ధర రూ.17వేలు, మోడల్ ధర రూ.21వేలుగా ఉంది. వండర్ హాట్ 1000 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.38,200 కనిష్ట ధర రూ.31వేలు కాగా మోడల్ ధర రూ.35వేలు పలికింది. యూఎస్ 341 రకం మిర్చి 26,500 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.23,600, కనిష్ట ధర రూ.17 వేలు, మోడల్ ధర రూ.21,500కు కొనుగోలు చేశారు. సింగిల్ పట్టి 200 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.63 వేలు, కనిష్ట ధర రూ.45 వేలు, మోడల్ ధర రూ.59 వేలు పలికింది. 1048 రకం మిర్చి 1000 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.22,600, కనిష్ట ధర రూ.16 వేలు, మోడల్ ధర రూ.19 వేలుగా ఉంది. ఇందులో వండర్ హాట్, తేజ, సింగల్ పట్టి రకం మిర్చికి గతంలో ఎప్పుడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ధర పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

గల్లీలో ఎంఐఎం..ఢిల్లీలో బీజేపీ..



ఇదే కేసీఆర్ దోస్తానా

- కారు మీద కోపంతో బీజేపీకి ఓటువేయొద్దు
- ధర్మపురి కాదు అధర్మపురి
- నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయండి : టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ గడ్డపై ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని ప్రజలకు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కేసీఆర్ మీద కోపంతో బీజేపీకి ఓటు వేస్తే మన బతుకులు మరింత ఆగమైతాయని స్పష్టంచేశారు. ఎంఐఎం అధ్యక్షుని మాట విని ముస్లింలు కారుకు ఓటు వేస్తే ఆ ఓట్లతో గెలిచిన కేసీఆర్ గల్లీలో ఎంఐఎంతో ఢిల్లీలో బీజేపీతో దోస్తానా చేస్తున్నారని విమర్శించారు. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి అటకెక్కించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీనిచ్చారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రేవంత్‌రెడ్డి యాత్ర బుధవారం దుబ్బ ప్రాంతం నుంచి ప్రారంభమైంది. రాత్రి నెహ్రూ పార్క్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తారని బాండ్ పేపర్ రాసి ఇచ్చిన ఎంపీ ధర్మపురి అరవింద్ చేతల్లో అధర్మపురిగా మారారని ఆరోపించారు. మోడీ తన జేబులో ఉంటాడని చెప్పిన ధర్మపురి.. కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అరవింద్ వ్యవహారం 'నాకుంది గుండు.. నేను రాసిచ్చా బాండ్' అన్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ సాధించామని ప్రచారం చేసుకుంటూ రెండు సార్లు అధికారంలోకి వచ్చారని, కానీ ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. కాబట్టి ఈసారి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. నిజామాబాద్ జిల్లాలో తెలంగాణ యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ ఇవన్నీ కూడా కాంగ్రెస్ హయాంలో వచ్చినవేనని అన్నారు. అమరవీరుల స్థూపం, సచివాలయం నిర్మాణం, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అన్నింట్లో అవినీతి జరిగిందని, విచారణకు ఆదేశిస్తే ఆధారాలతో నిరూపిస్తానని మంత్రి ప్రశాంత్ రెడ్డికి సవాల్ విసిరితే ఇప్పటివరకు స్పందించడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే సిలిండర్ అందజేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీని ఇచ్చారు. బాయ్‌బాయ్ కేసీఆర్ అంటూ ప్రసంగం ముగించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రేవంత్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు కేశ వేణు, తాహెర్‌బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆర్థోపెడిక్ ఆపరేషన్ క్యాంపు..అభినందనీయం

- మోకాలు లిగమెంట్ ఆపరేషన్ నిర్వహించడం ఇదే మొదటిసారి
- ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పుల్లారావు
- పేదల కోసం మరిన్ని ఉచిత ఆపరేషన్లు చేస్తాం : డాక్టర్ మల్లు అరుణ్



నవతెలంగాణ-సూర్యాపేట

ఉచిత ఆర్థోపెడిక్ ఆపరేషన్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పుల్లారావు అన్నారు. మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఎంవీఎన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఐఎంఏ, లయన్స్ క్లబ్ సహకారంతో బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్థానిక భీమిడి రమేశ్‌రెడ్డి ఆర్థోపెటిక్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆర్థోపెటిక్ మోకాలు లిగమెంట్ ఉచిత ఆపరేషన్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఉచిత ఆర్థోపెడిక్ మెడికల్ క్యాంపు నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఇలాంటి క్యాంపులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎంవీఎన్ ట్రస్టు ద్వారా పేదవారికి ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్.. మల్లు వెంకట నర్సింహారెడ్డి- స్వరాజ్యం మనుమడు మల్లు అరుణ్ మాట్లాడుతూ.. ఎంవీఎన్ ట్రస్టు ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కరోనా కాలంలో నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉన్న ఎంవీఎన్ ట్రస్టుభవనాన్ని ఆస్పత్రిగా మార్చి రోగులకు చికిత్స అందించామని తెలిపారు. ఇప్పటికే ట్రస్టు ద్వారా గ్రూప్ వన్, గ్రూప్ టూ, వీఆర్వో అభ్యర్థులకు ఉచితంగా బోధన అందిస్తున్నామని తెలిపారు. చిన్నారులకు ఉచిత కరాటే శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. మోకాళ్ళ నొప్పులతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు నానమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఉచితంగా మోకాలి లిగమెంట్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ క్యాంపును ప్రతి ఏడాదీ కొనసాగిస్తామన్నారు. ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న నిరుపేద కుటుంబాలు ఈ ఉచిత క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మునగాల మండలం నేలమర్రి గ్రామానికి చెందిన బచ్చలకూర సిద్ధిక్, రమేష్‌రెడ్డికి ఆర్థోపెడిక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో మోకాలు లిగమెంట్ ఆపరేషన్ నిర్వహించారు. అంతకుముందు తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ పట్టణ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్ క్లబ్ బాధ్యులు డాక్టర్ రమేష్‌చంద్ర, ఆస్పత్రి ఎండి భీమిడి రమేశ్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులు, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు జె.నర్సింహారావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని 35 వేల ఓటర్ల తొలగింపు అక్రమం

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు కేటీఆర్ లేఖ


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని 35 వేల ఓటర్ల తొలగింపు అక్రమమని పురపాలకశాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు విమర్శించారు. ఈ చర్య ప్రజల రాజ్యాంగ హక్కులను హరించడమేనంటూ, దేశంలో ఎక్కడా లేని విధంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఐదు సంవత్సరాలలో ఓటర్ల సంఖ్య తగ్గిందని విమర్శించారు. ఓటర్ల జాబితాలో తొలగించిన వారిని తిరిగి చేర్చాలని కోరుతూ కేటీఆర్ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు బుధవారం లేఖ రాశారు. కంటోన్మెంట్ పరిధిలో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఉన్న భూమిలో అక్రమంగా నివసిస్తున్నారన్న అర్థం లేని కారణంతో, అర్హత కలిగిన వారిని కూడా ఓట్ల జాబితా నుంచి తొలగించారని వివరించారు.

భారత స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 75 సంవత్సరాలుగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలో శాశ్వతంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న కుటుంబాల హక్కులకు భంగం కలిగించేలా, అక్రమంగా, రాజ్యాంగ వ్యతిరేకంగా ఓట్ల తొలగింపు కార్యక్రమం జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. తొలగించిన ఓటర్లకు కానీ, వారి కుటుంబాలకు కానీ ఎలాంటి షోకాజ్ నోటీస్ ఇవ్వకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించారని పేర్కొన్నారు. భారతదేశ పౌరులుగా తెలంగాణ రాష్ట్రంలో శాశ్వతంగా నివాసముంటున్న వీరి ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా, వారికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును దూరం చేయడం అక్రమం అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ బోర్డుకు, విద్యుత్ శాఖకు, వాటర్ సప్లై డిపార్ట్‌మెంట్లకు బాధ్యత కలిగిన పౌరులుగా దశాబ్దాలుగా వీరు పన్నులు, బిల్లులను చెల్లిస్తున్నారన్నారని తెలిపారు. వీరు గతంలోనూ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో, శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లోను తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కంటోన్మెంట్ బోర్డు వీరి హక్కులను హరించేలా ఏకపక్షంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించిందని విమర్శించారు.

అక్రమంగా నివాసం ఉంటున్నారని కంటోన్మెంట్ బోర్డు చెప్పిన కారణం సహేతుకంగా లేదని కేటీఆర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలోని ఏ న్యాయస్థానం కానీ, స్వయంగా కంటోన్మెంట్ బోర్డు కానీ వీరు అక్రమంగా నివసిస్తున్నారని అధికారికంగా తేల్చలేదని స్పష్టం చేశారు. తొలగించిన ఓటర్లను అక్రమంగా నివాసం ఉంటున్నారని రుజువు చేయకుండానే, నేరుగా వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించడం అన్యాయమన్నారు. 2018లో 1,91,849 ఓటర్లు ఉంటే ఈరోజు వారి సంఖ్య 1,32,722 కు తగ్గడం దురదష్టకరమన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు చేస్తున్న ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలతో భారతదేశంలో ఎక్కడ లేని విధంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్లో గత ఐదు సంవత్సరాలుగా ఓటర్ల జాబితాలోని పౌరుల సంఖ్య పెరగకుండా తగ్గిందని గుర్తుచేశారు. ఇలాంటి అన్యాయమైన పరిస్థితులు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలో నెలకొన్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని 35 వేలమంది ఓటర్లకు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములయ్యే అవకాశాన్ని కల్పించాలని, వారిని తిరిగి ఓటర్ల జాబితాలోకి చేర్చాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

బుచ్చిరెడ్డికి పితృవియోగం



(ఫైల్)

నవతెలంగాణ- హైదరాబాద్

సుందరయ్య విజ్ఞానకేంద్రం(ఎస్‌వీకే) మేనేజింగ్ కమిటీ సభ్యులు జి.బుచ్చిరెడ్డి తండ్రి నారాయణరెడ్డి(92) బుధవారం మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన స్వగ్రామమైన చౌటుప్పల్ వద్దనున్న బొర్రెలగూడెం గ్రామంలో చనిపోయారు. ఆయనకు ముగ్గురు కుమారులు. అంత్యక్రియలు గురువారం స్వగ్రామంలో జరగనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. నారాయణరెడ్డి మృతికి సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్, ఎడిటర్ సుధాభాస్కర్, ఎస్‌వీకే సెక్రటరీ ఎస్.వినయకుమార్ సంతాపం తెలియజేశారు.

బీఆర్ఎస్ నిర్మిస్తే..బీజేపీ కూల్చుతోంది

- బీఆర్ఎస్ ప్రజలను నమ్మితే..బీజేపీ ఈడీని నమ్ముతోంది : వైద్యఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు



నవతెలంగాణ-జైపూర్

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నూతన నిర్మాణాలు చేపడితే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూల్చే ప్రయత్నాలు చేస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను నమ్మితే.. బీజేపీ ఈడీని నమ్ముతోందని ఎద్దేవా చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో బుధవారం మంత్రి పర్యటించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌తో కలిసి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చెన్నూరులో బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిందని, ఆ పార్టీ కనుమరుగైపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు దేశంలో ఎక్కడా కనిపించవన్నారు. త్వరలోనే గృహలక్ష్మీ పథకం అమల్లోకి వస్తుందని వివరించారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న సుమన్‌కు వచ్చే ఎన్నికల్లో రెట్టింపు మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఈతకు వెళ్లి 10వ తరగతి విద్యార్థి మృతి

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఈతకు వెళ్లి 10వ తరగతి విద్యార్థి దుర్మరణం చెందిన సంఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... చల్వాయికి గ్రామానికి చెందిన పైడాకుల మహేష్ స్రవంతి కుమారుడు పైడాకుల అక్షయ్(15) స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఒంటి పూట బడులు కావడంతో మధ్యాహ్నం తోటి మిత్రులతో కలిసి స్థానిక రాలమాటు వాగు ప్రాంతానికి ఈత నేర్చుకోవాలనే తాపత్రయంతో వెళ్లారు. గతంలో అక్కడ వాగు కోతకు గురైనందున లోతుగా ఉండటంతో గుర్తించని విద్యార్థులు నీటిలోకి దిగగా అక్షయ్ ఒక్క మాటున లోతు ప్రాంతానికి వెళ్లడంతో నీటిలో మునిగాడు. తోటి మిత్రులు ఇతరుల సహాయంతో ఒడ్డుకు తీసుకొచ్చినప్పటికీ అక్షయ్ మృతిచెందాడని స్థానికులు తెలిపారు.

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

- 27, 28న జంతర్ మంతర్ వద్ద ధర్నా
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-ఓయూ

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. హైదరాబాద్ పార్సిగుట్టలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతపై బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27, 28 తేదీల్లో మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. ఏప్రిల్ 3న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బీజేపీ తెలుగు రాష్ట్రాల కార్యాలయాల ముందు మహాధర్నా నిర్వహిస్తామని, ఏప్రిల్ 4న హైదరాబాద్, విజయవాడ నగరాలను, రహదారులను దిగ్బంధం చేస్తామన్నారు. అప్పుడు జరిగే పరిణామాలకు బీజేపీదే పూర్తి బాధ్యత అన్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టకుంటే బీజేపీ తమకు ప్రధాన శత్రువుగా భావిస్తామని హెచ్చరించారు. మాదిగ పల్లెల్లోకి అడుగుపెట్టే నైతిక హక్కు బీజేపీ నాయకులకు లేదన్నారు. వారిని గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి వీఎస్ రాజు, మంతిని సామ్యూల్, డప్పు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ మ్యాప్..రాంగ్ రూట్

- మ్యాప్‌ను నమ్ముకోవడంతో పరీక్షకు ఆలస్యం
- సకాలంలో కేంద్రానికి చేరక అనుమతి నిరాకరణ

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

గూగుల్ మ్యాప్‌ను నమ్ముకొని ఇంటర్ పరీక్షా కేంద్రానికి బయలుదేరిన ఓ విద్యార్థికి చేదు అనుభవం ఎదురైంది. తాను చేరుకోవాల్సిన సెంటర్ ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంప్‌లో ఉంటే.. ఎన్నెస్పీ కాల్వ ఉన్న టేకులపల్లి ప్రాంతానికి ఆ విద్యార్థిని తీసుకువెళ్లింది. తిరిగి పరీక్షా కేంద్రానికి చేరుకునే సరికి ఆ విద్యార్థికి 27 నిమిషాలు ఆలస్యమవడంతో నిమిషం నిబంధన కారణంగా అధికారులు అనుమతించలేదు. వివరాల్లోకి వెళ్తే... ఖమ్మం రూరల్ మండలం కొండాపురానికి చెందిన వినయ్‌కు ఖమ్మంలోని ఎన్నెస్పీ స్కూల్‌లో సెంటర్ కేటాయించారు. గూగుల్ మ్యాప్ పెట్టుకుని ఎగ్జామ్ కేంద్రానికి బయలుదేరాడు. కానీ అది ఎన్నెస్పీ కాల్వ వద్ద ఉన్న టేకులపల్లి కేంద్రానికి తీసుకెళ్లింది. తనకు కేటాయించిన కేంద్రం అది కాదని తెలుసుకొని వెనుదిరిగాడు. ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి 9 నుంచి 12 గంటల వరకు ఎగ్జామ్ నిర్వహిస్తారు.

కానీ వినయ్ పరీక్షాకేంద్రానికి చేరుకునే సరికి 9.20 గంటలకు పైగా అయింది. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరనే నిబంధన ఉండటంతో చేసేది లేక కన్నీరుమున్నీరవుతూ వెనుదిరిగాడు. ఈ పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా 124 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలలు సరిపోకపోవడంతో మూడు ప్రయివేటు పాఠశాలలు, ఒక ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నెస్పీ క్యాంప్‌లోని ఓ పాఠశాల పరీక్షా కేంద్రం రూట్‌ను గూగుల్ తప్పుగా చూపించడంతో వినయ్‌కు ఈ పరిస్థితి ఏర్పడింది. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు పనిచేసేలా రెండు సెల్‌ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచారు. సమస్య ఉన్న విద్యార్థులు 99489 04023, 77939 16207 నంబర్లకు సంప్రదించాలని సూచించినా సంబంధిత విద్యార్థి గూగుల్ మ్యాప్ కారణంగా అయోమయానికి గురవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని, ముందురోజే పరీక్ష కేంద్రాన్ని చూసుకొని ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని పరీక్ష నిర్వాహకులు అంటున్నారు.


సంపాదకీయం

సముద్రగర్భ పోరుకు తెరతీసిన అమెరికా!

ఆయుధ కంపెనీల లాభాలకు ఇప్పటి వరకు స్టార్‌వార్స్‌లో నిమగ్నమైన అమెరికా ఇప్పుడు సముద్ర గర్భాన్ని కూడా అల్లకల్లోలం చేసేందుకు పూనుకుంది. అది కూడా తమకు సుదూరంలో ఉన్న చోటును ఎంచుకుంది. తమ చేతికి మట్టి అంటకుండా ఇటీవల అనేక దేశాల్లో తమ సైనికులను పంపకుండా ఆయుధాలు ఇచ్చి ఇతరులు కొట్టుకు చచ్చేట్లు

> ఒక వైపు ఇరాన్ అణుకార్య క్రమాన్ని నిరోధించే పేరుతో ఆంక్షల కత్తి కట్టిన అమెరికా శుద్ధి చేసిన యురేనియంను తన మిత్రదేశానికి అందచేస్తున్నది. చాకును కూరగాయలు తరిగేందుకే అని విక్రేత నిబంధన చెప్పినా కుత్తుకలు ఉత్తరించకుండా కొన్నవారిని నిరోధించలేరు. ఇది కూడా అంతే. అందుకే ప్రపంచ శాంతిశక్తులు ఇలాంటి లావాదేవీలను తీవ్రంగా నిరసించాలి, ప్రతిఘటించాలి. ఇది తమను సముద్ర గర్భంలో చుట్టుముట్టే ఎత్తుగడలో భాగమని, దీన్ని ఎదుర్కొనేందుకు తాము కూడా పూనుకుంటామని చైనా చెప్పింది. అంటే మరోసారి ఆయుధపోటీకి అమెరికా తెరతీసినట్లే.

చూస్తున్నది. దాని కొనసాగింపే తాజా పరిణామం. అమెరికా, బ్రిటన్ దేశాల నుంచి ఆస్ట్రేలియా పదిహేను వేల కిలోమీటర్ల దూరంలో ఉంది.చైనా - ఆస్ట్రేలియా దూరం ఏడున్నరవేల కిలోమీటర్లు. రానున్న మూడుదశాబ్దాల కాలంలో అమెరికా, బ్రిటన్ దేశాలకు ఆస్ట్రేలియా 368 బిలియన్ డాలర్లు సమర్పించుకొని అణుశక్తితో నడిచే కొత్త, పాత జలాంతర్గాముల కొనుగోలు, కొత్తవాటి తయారీకి ఒప్పందం చేసుకుంది. ఎందుకటా? ఈ మూడు దేశాల మీద చైనా గనుక దాడికి దిగితే దాన్ని ఎదుర్కొనేందుకు అని కుంటిసాకులు చెబుతున్నాయి. వీటికి చైనాతో సరిహద్దు తగాదాలేదు. దేశాలను ఆక్రమించుకొనే పంచాయితీ అసలే లేదు. దక్షిణ చైనా సముద్రం మీద పూర్తి ఆధిపత్యం సాధించేందుకు చైనా చూస్తోంది. అదే జరిగితే అంతర్జాతీయ జలాల్లో ఏ దేశ నౌకలైనా తిరగటానికి స్వేచ్ఛ ఉండదు గనుక దాన్ని ఎదుర్కోవాలంటే ఆస్ట్రేలియా-బ్రిటన్-అమెరికా(అకుస్)లతో ఏర్పడిన కూటమి బలపడాలి, అందుకు పావుగా ఉన్న ఆస్ట్రేలియాకు జలాంతర్గా ములను అందించి చైనా మీద దాడి చేయించాలి, ఇదీ అమెరికా ఎత్తుగడ.



చైనాను బూచిగా చూపి ఆ ప్రాంత దేశాలకు ఎంతగా వీలైతే అన్ని ఆయుధాలను అమ్మి సొమ్ము చేసుకోవాలనే దురాశ తప్ప అసలది జరిగేదేనా?

అణుబాంబును కనిపెట్టటం, దాన్ని తొలిసారిగా జపాను మీద వేసి ప్రపంచాన్ని భయపెట్టిన రోజు నుంచి అమెరికా ఆయుధాల వ్యాపారం ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. జనానికి రోజువారీ అవసరమైన వినిమయ వస్తువులను చైనా, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొని అధిక లాభాలు వచ్చే హైటెక్, మారణాయుధాల మీదనే కేంద్రీకరిస్తోంది. ఎక్కడైనా శాంతి కనిపిస్తే దానికి నిదురబట్టటం లేదు, అందుకే కొత్త ఉద్రిక్తతల సృష్టికి చూస్తోంది. స్టాక్‌హోం అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ(సిప్రి) తాజాగా విడుదల చేసిన సమాచారం ప్రకారం ప్రపంచాన్ని కరోనా మహమ్మారి, ఆర్థిక వడిదుడుకులు దెబ్బతీసినా అమెరికా మారణా యుధాల వ్యాపారం మూడు పూవులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. 2013-22 కాలంలో ప్రపంచ స్థాయిలో ఆయుధాల లావాదేవీలు 5.1శాతం తగ్గాయి. ఆఫ్రికా దిగుమతులు 40, అమెరికా 21, ఆసియా-ఓషియానా 7.5, మధ్యప్రాచ్యం 8.8శాతాల చొప్పున తగ్గగా, తూర్పు ఆసియా మొత్తంగా 42శాతం, ఫిలిప్పైన్స్ 64, దక్షిణ కొరియా 61, జపాన్ 171, ఆస్ట్రేలియాకు 21శాతం పెరిగాయి. ఇతర ప్రాంతాల్లో కొన్ని దేశాల దిగుమతులు భారీగా పెరగ్గా ఐరోపా దేశాలవి 47శాతం పెరిగాయి. వాటిలో నాటో కూటమి 65శాతం పెరిగాయి. ఇవన్నీ అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ప్రపంచానికి శాంతి ప్రవచనాలు వల్లిస్తుండగా జరిగినవే. ప్రపంచ ఆయుధాల ఎగుమతుల్లో అమెరికా వాటా 33 నుంచి 40శాతానికి పెరగ్గా, రష్యా ఎగుమతులు 22 నుంచి 16శాతానికి తగ్గాయి. రష్యాను బూచిగా చూపి ఐరోపాకు ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున ఆయుధాలను అంటగట్టినట్లు స్పష్టం అవుతోంది. ఇతర ప్రాంతాల్లో కూడా అలాంటి ఎత్తుగడలతో లబ్ధిపొందాలన్నదే అమెరికా అసలు ఎత్తుగడ. చైనాను దుష్టశక్తిగా చూపి ఆసియా నాటో ఏర్పాటుకు పావులు కదుపుతోంది. క్వాడ్, అకుస్ దానికి ప్రాతిపదికలే. ప్రపంచంలో ఎక్కడ పచ్చగా కనిపిస్తే అక్కడ చిచ్చు పెట్టటం అమెరికా నిత్యకృత్యంగా ఉంది. ఈ ఒప్పందం ఆస్ట్రేలియా పాలక లేబర్ పార్టీలో ఉన్న విబేధాలను వెల్లడించింది. ఇది తెలివి తక్కువపని, దేశానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చదని మాజీ ప్రధాని పాల్ కీటింగ్ ధ్వజమెత్తటం గమనించాల్సిన అంశం. అమెరికాతో చేతులు కలుపుతూ చైనాతో స్వయంగా ఆస్ట్రేలియా సమస్యలను సృష్టించుకోవటం తప్ప వేరు కాదని, చైనాతో నిజానికి ఎలాంటి వైరం లేదని, అది ఎలాంటి దాడి తలపెట్టలదేని, ఈ ప్రాంతంలో అమెరికా పెత్తనాన్ని నిలిపేందుకు చేస్తున్న పని తప్ప మరొకటి కాదన్నాడు.

ఆస్ట్రేలియా ఇప్పటి వరకు అణ్వస్త్ర రహిత దేశంగా ఉంది. దానికి అణ్వాయుధాల తయారీకి అనువైన యురేనియంను భారీ మొత్తంలో జలాంతర్గాములతో పాటు అమెరికా అందచేస్తున్నది. ఇది అణ్వస్త్రవ్యాప్తి నిరోధ ఒప్పందానికి(ఎన్‌పిటి) పూర్తి విరుద్ధం. మరొక అణుశక్తిని తయారు చేసి ప్రపంచం మీదకు వదలటం తప్ప వేరు కాదు. ఒక వైపు ఇరాన్ అణుకార్య క్రమాన్ని నిరోధించే పేరుతో ఆంక్షల కత్తి కట్టిన అమెరికా శుద్ధి చేసిన యురేనియంను తన మిత్రదేశానికి అందచేస్తున్నది. చాకును కూరగాయలు తరిగేందుకే అని విక్రేత నిబంధన చెప్పినా కుత్తుకలు ఉత్తరించ కుండా కొన్నవారిని నిరోధించలేరు. ఇది కూడా అంతే. అందుకే ప్రపంచ శాంతిశక్తులు ఇలాంటి లావాదేవీలను తీవ్రంగా నిరసించాలి, ప్రతిఘటించాలి. ఇది తమను సముద్ర గర్భంలో చుట్టుముట్టే ఎత్తుగడలో భాగమని, దీన్ని ఎదుర్కొనేందుకు తాము కూడా పూనుకుంటామని చైనా చెప్పింది. అంటే మరోసారి ఆయుధపోటీకి అమెరికా తెరతీసినట్లే.

హయ్యర్ పెన్షన్‌పై సుప్రీం తీర్పును అమలు చేస్తారా?

> రాజ్యసభలో పెన్షన్‌పై ప్రధాని పలుకులు వింటే కార్మికుల, ఉద్యోగుల సంక్షేమం పట్ల వారి చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా కన్పిస్తున్నది. కేంద్ర ప్రభుత్వోద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో వచ్చే జీతంలో సగం పెన్షన్ పొందే పాతపెన్షన్ సౌకర్యాన్ని 2004 తర్వాత జాయినయిన వారికి వాజ్‌పేయి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వాన్ననుసరించి పాత పెన్షన్ విధానాన్ని అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తొలగించినా కేరళ, రాజస్తాన్ లాంటి కొన్ని ప్రభుత్వాలు కొనసాగించటం సరియైంది కాదని ప్రధాని హెచ్చరించటం గమనార్హం. అలాంటి వారి సారధ్యంలో కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ పరిధిలోని ఈపీఎఫ్ఓ ద్వారా సుప్రీం తీర్పును సక్రమంగా అమలు జరుపుతారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

ఈపీఎస్-95పై నవంబర్ 4, 2022న సుప్రీం కోర్టు తీర్పుతో దేశవ్యాపితంగా కార్మికులు, ఉద్యోగులలో (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వేతర ఉద్యోగులు) పెన్షన్ పెరుగుదలపై కోలాహాలం ప్రారంభమైంది. అనేక సంవత్సరాలుగా సుప్రీం కోర్టు తీర్పుకోసం ఎంతో అశతో ఎదురు చూస్తున్నారు. కార్మికులు, ఉద్యోగులు ఉద్యోగ విరమణానంతరం అసరాగా పెన్షన్ ఇవ్వాలని గత 3 దశాబ్దాలుగా అనేక ఆందోళనలు, పోరాటాలు జరిగాయి. 1995లో ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం ఈపీఎస్-95ను కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నాడే కార్మికలోకం సంఘటిత - అసంఘటిత రంగంలోని కార్మికులు, ఉద్యోగులకు కనీస పెన్షన్ గ్యారంటీ ఉండేలా, ధరల పెరుగుద లకు అనుగుణంగా పెన్షన్‌లో పెంపు దల ఉండాలని కోరారు. దానిపై కాలానుగుణంగా సమీక్ష చేస్తామని, కార్మికులకు ప్రయోజనకరంగా నిర్ణయాలు తీసుకుంటామన్న హామీతో ప్రభుత్వం ఈపీఎస్-95 చట్టాన్ని తీసుకొచ్చింది.

2022 నవంబరు 4న సుప్రీం కోర్టు తీర్పుతో కార్మికులు, ఉద్యోగులలో కొంతమందికి ఉపశమనంగా నిజవేతనంపై మేనేజ్ మెంట్ కాంట్రిబ్యూషన్‌లో 8.33శాతం రికవరీతో హయ్యర్ పెన్షన్ వస్తుందన్న ఆశతో ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది కనుక ఇక వచ్చేసినట్టేనని రిటైర్డ్, సర్వీసులో ఉన్నవారు ఆనందం వ్యక్తం చేశారు. అయితే సుప్రీం కోర్టు తీర్పు వెలువడినప్పటి నుండి అమలు చేయాల్సిన ఈపీఎఫ్ఓ, స్పందించని కేంద్రప్రభుత్వ కార్మికశాఖల చర్యలు అందుకు అనుగుణంగా లేవన్నది స్పష్టంగా కనిపిస్తున్నది.

కారణమేమంటే సుప్రీం తీర్పులో స్పష్టంగా రెండు విషయాలు పేర్కొన్నారు. నిజవేతనంపై 8.33శాతం ఈపీఎస్ రికవరీ దానికనుగుణంగా హయ్యర్ పెన్షన్ కోసం ఈపీఎఫ్ఓ తగిన ప్రొసీజర్ రూపొందించి రిటైర్డ్, సర్వీసులోని ఉద్యోగుల నుండి ఆప్షన్ తీసుకోవాలి. అంతేగాదు ఈ తీర్పు అమలు నాలుగు నెలల్లో అనగా మార్చి 3వ తేదీ కల్లా పూర్తి చేయాలని చెప్పింది. కాని సుప్రీం తీర్పుపై గడువు ముగిసే దశలో ఈపీఎఫ్ఓ స్పందించింది. నిజవేతనంపై రికవరీతో హయ్యర్ పెన్షన్ కోరుకునే వారు దరఖాస్తులు ఇవ్వాలన్న సర్క్యులర్ 2023 ఫిబ్రవరి 20న జారీ చేశారు. అదీ



ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని, అందుకై పోర్టల్‌ను 27 ఫిబ్రవరి 2023 తేదీ నుండి మాత్రమే అందుబాటులో ఉంచారు. సుప్రీం కోర్టు తీర్పు ముగిసే గడువు మార్చి 3వ తేదీకి కేవలం 4 రోజుల ముందు మాత్రమే ఈ సౌకర్యం కల్పించారు. ఆ 4 రోజుల్లోనూ పోర్టల్ ఓపెన్ కాక, స్తంభించడం వలన దరఖాస్తుదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఐటీయూ ఆలిండియా నాయకత్వం ఈపీఎఫ్ఓకు, కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖకు సమయం పెంపుదలకై రిప్రజెంటేషన్ ఇచ్చి ఒత్తిడి చేసింది. ఆ తరువాత రోజు మే 3 వరకు గడువు పొడిగించినట్లు పోర్టల్లో పెట్టారు. దేశవ్యాపితంగా హయ్యర్ పెన్షన్ కోసం 8 వేలు దరఖాస్తులు మాత్రమే వచ్చాయని మార్చి మొదటి వారంలో ఈపీఎఫ్ఓ ప్రకటించింది. ఇదీ సుప్రీం కోర్టు తీర్పును ఈపీఎఫ్ఓ అమలు చేస్తున్నతీరు.

ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఈపీఎస్ ప్రారంభమైన 1995 నుండి ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు వెలువడేవరకు ఈపీఎస్-95 స్కీం అమలు కేంద్ర ప్రభుత్వం, ఈపీఎఫ్ఓ పారదర్శకంగా, చిత్తశుద్ధితో అమలుకు ప్రయత్నించిన దాఖలాలు కనిపించవు. ఉదాహరణకు నేడు ఆప్షన్ ఇవ్వాల్సిన దరఖాస్తుదారులు, రిటైర్ అయిన వారు ఎన్ని లక్షలు జమ చేయాలో తెలియదు. సర్వీసులో ఉన్నవారు, ఎంత ఎమౌంట్ పీఎఫ్ అకౌంటు నుండి ఈపీఎస్‌కు బదలాయించాలో తెలియదు. డిపాజిట్ చేసిన అమౌంట్‌కు అనుగుణంగా తిరిగి పెన్షన్, బకాయిలు ఎంత వస్తాయో తెలియని స్థితిలో దరఖాస్తు దారులున్నారు. ఈ రకమైన సందేహాలు, అవేదనతో ఆప్షన్ ఇవ్వటానికై ఊగిసలాటలో దరఖాస్తుదారులు కొంద రున్నారు.

1995 నుండి 2001 జూన్ వరకు ఈపిఎఫ్ గరిష్ట వేతన పరిమితి రూ.5వేలు, 2001 జూన్ నుండి ఆగస్టు 2014 వరకు రూ.6500లు, 2014 సెప్టెంబరు తర్వాత నుండి రూ.15వేలు, గరిష్ట వేతన పరిమితిగా ఈపీఎస్-95 చట్టానికి సవరణలు చేశారు. ఈపీఎఫ్ గరిష్ట వేతన పరిమితిని మించి నిజవేతనం పొందుతున్న వారు, తమ నిజవేతనంపై రికవరీ చేయించుకుని తగిన హయ్యర్ పెన్షన్ పొందటానికి 1996 మార్చిలో ఈపీఎస్-95 చట్టానికి చేసిన సవరణతో, నిజవేతనంపై రికవరీకి అను గుణంగా హయ్యర్ పెన్షన్‌కు ఆప్షన్ ఇవ్వవచ్చని ఈపీఎఫ్ఓ సర్క్యులర్ జారీ చేసింది. 2004 ఏడాది చివరివరకు ఆప్షన్ క్లోజ్ చేశారు. 2014 సెప్టెంబరులో ఈపీఎస్ గరిష్ట పరిమితి రూ.6500లు నుండి రూ.15వేలు వరకు పెంచినప్పుడు, 2004లో నిజవేతనంపై రికవరీకై అప్షన్ ఇచ్చినవారు కూడా రూ.15వేలు గరిష్ట పరిమితికి మించి ఉన్న నిజవేతనంపై రికవరీకి మరల ఆప్షన్ ఇవ్వాలని సర్క్యులర్ ఇచ్చారు. నిజవేతనంపై ఈపీఎస్ రికవరీకి, దానిపై హయ్యర్ పెన్షన్‌కు ఆప్షన్‌కు అవకాశం ఇచ్చారన్న విషయం, అందుకు 2004 చివర వరకే కటాఫ్ తేదీ అన్నది తమకు తెలియదని ఈపీఎస్‌లో సభ్యులు అనేక మంది ఆందోళన చెందారు. ఆప్షన్‌కు కొందరు కోర్టులను ఆశ్రయించారు. అంతేగాదు ఈపీఎఫ్ గరిష్ట వేతన పరిమితి రూ.15వేలకు పెంచిన దానిపై ఆప్షన్ గురించి వివరాలు అడిగిన ప్రభుత్వ రంగ సంస్థలకు ఈపీఎఫ్ఓ నుండి క్లారిఫికేషన్ ఇవ్వలేదంటే ఈపీఎఫ్ఓ కమ్యూనికేషన్ వ్యవస్థ ఎంత లోపభుయిష్టంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అప్షన్‌కై సుప్రీం కోర్టుకు వెళ్ళిన ఆర్‌సీ గుప్తా కేసులో ఈపీఎస్ గరిష్ట పరిమితికి మించి ఉన్న నిజవేతనంపై రికవరి అయిన పీఎఫ్‌ను ఈపీఎఫ్‌లో జమచేసినపుడు, ఈపీఎస్‌కు బదలాయించటంలో అకౌంట్స్ అడ్జస్ట్ మెంటే గాని అదనంగా ఈపీఎఫ్ఓపై భారమేం ఉండదన్న వాస్తవాన్ని తెలుపుతూ, ఈపీఎఫ్ఓ ఆప్షన్ అవకాశం ఇవ్వాలని సుప్రీం తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు అమలులోనూ ఈపీఎఫ్ఓ మరొక మెలికను పెట్టింది. ఆర్‌సీ గుప్తా దరఖాస్తు దారుడు నాన్ ఎగ్జంప్టెడ్ ఎస్టబ్లిష్ మెంట్స్ సభ్యుడు కనుక ప్రభుత్వ రంగ సంస్థల ఎగ్జంప్టెడ్ ట్రస్ట్ సభ్యులకు ఆప్షన్ ఇచ్చే అవకాశం లేదు అని మరొక సవరణతో ఈపీఎఫ్ఓ సర్క్యులర్ జారీ చేసింది. 2016లో ఆర్‌సీ గుప్తా కేసు తీర్పులో నాటి నేపథ్యం, పూర్వాపరాలు పరిశీలించి, 2014 ముందు రిటైరైన ఉద్యోగులకు హయ్యర్ రికవరీ, హయ్యర్ పెన్షన్ పొందే అవకాశం కల్పించారు.

తాజా సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పులో 2014 ముందు రిటైరైన వారిలో, మిగిలిపోయిన వారికి ఇప్పుడు ఆప్షన్ ఇచ్చే అవకాశం ఉండదని చెప్పింది. ఈ తీర్పును ఈపీఎఫ్ఓ తనకనుగుణం గా అన్వయించుకొని 2014 ముందు రిటైరై, హయ్యర్ పెన్షన్ పొందుతున్న వారికి, తీసుకున్న పెన్షన్ వాపసు చేయమని మన రాష్ట్రంలోనే 53వేల మందికి నోటీసులిచ్చినట్లు పత్రికల్లో చూశాం.ఇస్తున్న హయ్యర్ పెన్షన్‌ను తగ్గించి పాతపద్ధతిలో తక్కువ పెన్షన్‌నే ఇస్తున్నారు. ఇది ఎంత అనైతికమో, అమానవీయమో ఆలోచించండి. అంతేగాదు 2014లో పెంచిన ఈపీఎస్ వేతన గరిష్ట పరిమితి రూ15వేలు మించి ఆదాయం వచ్చినవారు 2014 తర్వాత ఈపీఎఫ్‌లో సభ్యులైన ఉద్యోగులకు పెన్షన్‌కి అర్హత లేదని ఈపీఎఫ్ఓ వారు మరొక సర్క్యులర్ జారీ చేశారు. హయ్యర్ పెన్షన్ ఆప్షన్ కోసం ఈపీఎఫ్ఓ పెట్టిన నిబంధనలు చూస్తుంటే, పాముని చ్చైన ఆట కళ్ళముందు కదలాడుతున్నది. అన్ని ఆటంకాలను ఎదుర్కొని ఎవరైనా ఆప్షన్ కోసం వస్తే బ్రహ్మాస్త్రం లాంటి పీఎఫ్ యాక్ట్‌లోని 26(6) క్లాజును చూపుతున్నది. హయ్యర్ పెన్షన్‌కై ఆప్షన్ కోరుకునేవారు, హయ్యర్ పిఎఫ్ రికవరీ కోసం ఎంప్లాయి ప్లస్ ఎంప్లాయర్ జాయింట్ ఆప్షన్ గతంలోనే తీసుకుని ఉండాలని చెపుతున్నది. ప్రస్తుతం గరిష్ట పరిమితి కంటే మించి ఉన్న ఎంప్లాయిస్ నిజవేతనాలపై పీఎఫ్ రికవరి చేసి ఎగ్జామ్‌టెడ్ ట్రస్టులోను, నాన్ ఎగ్జంటెడ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లోనూ జమచేస్తూనే ఉన్నారు. దానిపై ఈపీఎఫ్ఓ నిరంతరం తనిఖీ చేస్తున్నా ఎన్నడూ అభ్యంతరాలు పెట్టిన సందర్భాలు లేవు. నేడు హయ్యర్ రికవరీతో హయ్యర్ పెన్షన్‌కై ఆప్షన్ అడిగే వారిని, హయ్యర్ పీఎఫ్ రికవరీకై గతంలో నే జాయింట్ ఆప్షన్ ఇచ్చివుండాలని చెప్పడమంటే, ఇంతకాలం నిజవేతనంపై పీఎఫ్ రికవరీ అవుతుంటే ఈపీఎఫ్ఓ ఏం చేస్తున్నట్టు? కళ్లు మూసు కున్నదా? దీన్ని బట్టి హయ్యర్ పీఎఫ్ రికవరీ తో హయ్యర్ పెన్షన్ ఆప్షన్ ఎవ్వరికీ అవకాశం లేకుండా చేసే అస్త్రాలుగా, కుట్రపూరిత నిబంధనలను ఈపీఎఫ్ఓ అమ్ముల పొదిలో పెట్టుకున్నట్లుగా స్పష్ట మవుతున్నది.

అంతేకాదు, ఈ సుప్రీం కోర్టు తీర్పుతోనూ 2014కు ముందు సర్వీస్‌లో ఉండి 2014 తర్వాత రిటైరైన, లేదా సర్వీసులో కొనసాగుతున్న వారు మాత్రమే హయ్యర్ పెన్షన్‌కు ఆప్షన్ పొందటానికి అర్హులు. 2014 ముందు రిటైరైన వారు, అప్పుడు ఆప్షన్ అడగనివారు నిజవేతనం పై ఈపీఎస్ రికవరీతో హయ్యర్ పెన్షన్ పొందలేరు. అంతేగాదు 2014 తర్వాత ఉద్యోగా ల్లో చేరిన వారిలో రూ.15వేలు మించి ఆదాయం ఉన్నవారికి ఈపీఎస్-95 పెన్షన్ వర్తిం చదు. ఈవిధంగా ఏక పక్షంగా చట్టసవరణలతో హయ్య ర్ పెన్షన్‌కు అవకాశం లేకుండా నిబంధనలను పెట్టి ఈపీఎఫ్ సభ్యుల హక్కులను కాల రాస్తున్నది.

విశ్వగురువుగా ప్రకటించుకుంటున్న కేంద్ర ప్రభుత్వ పాలకులకు కార్పొరేట్ల సంక్షేమమేగాని, వారికి సంపద కూడబెడుతున్న కార్మికులు, ఉద్యోగులకు తమ నిజవేతనాలపై ఈపీఎస్ రికవరీని- దానిపై పెన్షన్‌కు తగిన చర్యలు తీసుకోకపోవటం ఏమిటన్నది అనేక మందిలో మెదలవుతున్న ప్రశ్న. కోట్ల రూపాయల ఖర్చుతో ఐదేండ్ల కోసం పార్లమెంటుకు ఎన్నికైన పాలకులు, తమకు కనీస పెన్షన్ 50వేల రూపాయలు వచ్చేలా బిల్లు పాసు చేసుకున్నారు. 35సంవత్సరాల సర్వీసుతో రిటైరైన శ్రామికులకు పిఎఫ్ కాంట్రిబ్యూషన్‌తో వచ్చే పెన్షన్‌కై తగిన చర్యలు తీసుకోకపోవటమంటే ప్రజాపాలనకు వీరికి ఏం అర్హత ఉన్నట్టు? అంతేగాదు ఇటీవల పార్లమెంటు సెషన్ సందర్భంగా రాజ్యసభలో పెన్షన్‌పై ప్రధాని పలుకులు వింటే కార్మికుల, ఉద్యోగుల సంక్షేమం పట్ల వారి చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా కన్పిస్తున్నది. కేంద్ర ప్రభుత్వోద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో వచ్చే జీతంలో సగం పెన్షన్ పొందే పాతపెన్షన్ సౌకర్యాన్ని 2004 తర్వాత జాయినయిన వారికి వాజ్‌పేయి ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వాన్ననుసరించి పాత పెన్షన్ విధానాన్ని అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తొలగించినా కేరళ, రాజస్తాన్ లాంటి కొన్ని ప్రభుత్వాలు కొనసాగించటం సరియైంది కాదని ప్రధాని హెచ్చరించటం గమనార్హం. అలాంటి వారి సారధ్యంలో కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ పరిధిలోని ఈపీఎఫ్ఓ ద్వారా సుప్రీం తీర్పును సక్రమంగా అమలు జరుపుతారా అన్న అనుమానాలు కలుగు తున్నాయి. అందుకే కార్మికోద్యంతో సాధించు కున్న ఈపీఎస్ -95 చట్టాన్ని, అందు కనుగుణంగా ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పు అమలు జరగాలన్నా అంశంపై కార్మికులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి. దీని అమలు కోసం పోరాటాలు చేస్తూనే ఉండాలి.

సిహెచ్. కృష్ణారావు, 9490098586
జె. రాఘవరావు, 9989830251

కేంద్ర విధానాలతో విద్యుత్ భారాలు

విద్యుత్‌రంగంలో 1990వ దశకంలో సంస్కరణలు చేసినవారు ఏమి చెప్పినా, ఎన్ని చెప్పినా ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలు వివిధ రూపాలలో పెరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలు, ముఖ్యంగా విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కాములు), నష్టాల పాలవుతునేవున్నాయి. విద్యుత్ రంగంలోకి ప్రయివేట్ పెట్టుబడిదారులు పెద్దఎత్తున చొరబడటానికి, క్రమేణా విద్యుత్ రంగ ప్రయివేటీకరణకు ఈ విధానాలు దారి తీస్తున్నాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రధాన కారణం. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల నిర్వ హణలో లోపాలు, లోటుపాట్లను కాదనలేం. కానీ విద్యుత్ రంగ వ్యవహారాలను నియంత్రించేందుకు ఉద్దేశించిన నియంత్రణ కమిషన్లు ప్రభుత్వాల విధానాల పరిధికి లోబడే పనిచేస్తున్నాయి. అధికారంలో ఉన్నవారికి తోడు, నయా ఉదారవాద విధానాలకు, కార్పొరేట్ రంగ ప్రయోజనాలకు మద్దతుదారులుగా వ్యవహరిస్తున్న మేధావులు, నిపుణులు, పాలకవర్గ మీడియా ఏకపక్ష ప్రచారం చేస్తున్నది. కానీ విద్యుత్ చార్జీలను పెంచక తప్పదనేవారు, సామాన్య ప్రజానీకానికి ఇస్తున్న కొద్దిపాటి సబ్సిడీలను వ్యతిరేకించే వారు కొందరున్నారు. మరికొందరు ఈ చట్టాలను, నిర్ణయాలను, ఆచరణను ప్రశ్నిస్తున్నారు. వాటికి ప్రజానుకూల ప్రత్యామ్నాయాలను సూచిస్తున్నారు.

కాకులను కొట్టి గద్దలకు వేస్తున్న మోడీ సర్కార్!

మోడీ ప్రభుత్వం అనుసరిస్తూ, రాష్ట్రాలపై రుద్దుతున్న విధానాల సారాంశం 'కాకులను కొట్టి గద్దలకు' వేయడమే. ప్రజలపై విపరీత భారాలు మోపుతూ, కార్పొరేట్ సంస్థల పబ్బం గడపటం, తమ పబ్బం గడుపు కోవటం పాలకులకు నిత్యకృత్యంగా మారింది. ఫెడరల్ వ్యవస్థ స్ఫూర్తిని హరిస్తూ, రాష్ట్రాల హక్కులను, అధికారాలను కబళిస్తూ, మోడీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. ఇతర రంగాల్లోలాగే, విద్యుత్ రంగంలో కూడా రాష్ట్రాలపై రుద్దుతున్న సంస్కరణల అమలువల్ల తలెత్తుతున్న దుష్ఫలితాలకు, వాటిపై ప్రజల నుండి వచ్చే వ్యతిరేకతకు తనకేమీ బాధ్యత లేనట్లు మోడీ ప్రభుత్వం మోర పైకెత్తి చూస్తున్నది.

కేంద్ర ప్రభుత్వ విద్యుత్ విధానాలు, చట్టాలు, ఆదేశాల ప్రకారం ప్రయివేటు విద్యుత్ ప్రాజెక్టులకు అనుమతులనిచ్చి, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏ) చేసుకొంటున్న తీరు, అధిక పెట్టుబడి వ్యయం మోసాలు, లోపభూయిష్ట నిబంధనలు వినియోగదారులపై వేల కోట్ల రూపాయల భారాలను దీర్ఘకాలికంగా మోపుతున్నాయి. దేశంలోనూ, ఆ తరువాత ఉభయ తెలుగు రాష్ట్రాలలోను ఈ చేదు అనుభవాల పరంపర కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా, ఈ నష్టదాయక విధానాలు కొనసాగుతూనే ఉన్నాయి. రెగ్యులేటరీ కమిషన్ల ఉత్తర్వులు కూడా అనేక సందర్భాలలో అందుకు వీలు కల్పించేవిగా ఉంటున్నాయి. పార్టీలు, ప్రభుత్వాలు వేరైనా, కొనసాగుతున్న ఈ ధోరణి పాలక వర్గాల స్వభావం కొంత హెచ్చుతగ్గులతో ఒకటేనని నిర్ధారిస్తుంది. పాలకవర్గ పార్టీలు పరస్పరం తీవ్ర విమర్శలు, నిందారోపణలు చేసుకొంటున్నా, ప్రజానుకూల ప్రత్యామ్నాయాలు సూచించలేని వాటి దౌర్బల్యం వాటి వర్గ స్వభావం, స్వార్థ ప్రయోజనాల సారూప్యతను నిర్ధారిస్తుంది.

తడిసి మోపెడవుతున్న విద్యుత్ కొనుగోలు వ్యయం


డిస్కములు వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేందుకు అయ్యే మొత్తం ఖర్చులో దాదాపు 75 నుండి 80శాతం వరకు విద్యుత్ కొనుగోలు వ్యయమే. ఈ వ్యయం చార్జీల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రధానంగా కారణమవుతున్నాయి. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే ఇంధనాలకయ్యే వ్యయం గణనీయంగా ఉంటున్నది. ఈ వ్యయం పెరుగుదలని బట్టి అస్థిర చార్జీలు ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయి. బొగ్గు, సహజ వాయువు వంటి ఇంధనాల ధరలను వాటి ఉత్పత్తి వ్యయం, న్యాయమైన లాభం ఆధారంగా నిర్ణయించాలి. కానీ కేంద్ర అర్థంలేని విధానాల వల్ల వాటి ధరలు చాలా అధికంగా ఉంటున్నాయి. ఈ ఇంధనాలను ఉత్పత్తి చేసి, విక్రయిస్తున్న సంస్థలకు వస్తున్న అధిక లాభాలు, ప్రభుత్వ రంగ సంస్థలు కేంద్రానికి చెల్లిస్తున్న డివిడెండ్ల భారీ మొత్తాలు దీనిని నిర్ధారిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పిన నాలుగు గ్యాస్ ఆధారిత ప్రయివేట్ విద్యుత్ ప్రాజెక్టులకు రిలయన్స్ సంస్థ కేజీ బేసిన్ నుండి సహజ వాయువు సరఫరా నిలిపివేసింది. దీంతో అవి 2013 మార్చి నుండి మూతపడ్డాయి. విద్యుత్ ఉత్పత్తి చేయకపోయినా డిస్కాములు ఈ ప్రాజెక్టులకు స్థిర చార్జీలను చెల్లించాలన్న వివాదాలు అనేక సంవత్సరాలుగా కొనసాగుతూ చివరకు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులలో ఉభయ తెలుగు రాష్ట్రాల డిస్కాములకు పీపీఎల ప్రకారం వాటాలున్నాయి. రిలయన్స్ సంస్థ కేజీ బేసిన్‌లో సహజ వాయువు ఉత్పత్తిని ప్రారంభించిన, కేంద్రం చేసిన కేటాయింపుల మేరకు ఈ ప్రాజెక్టులకు దానిని సరఫరా చేయాలని రిలయన్స్‌ను ఆదేశించకుండా, స్వేచ్ఛా మార్కెట్‌లో వేలం ద్వారా విక్రయించు కొనేందుకు మోడీ ప్రభుత్వం రిలయన్స్ సంస్థకు వీలు కల్పించింది. అంటే చట్టబద్ధమైన నల్ల బజారు వ్యాపారానికి, విపరీత లాభార్జనకు ద్వారాలు తీసింది. ఆ పద్ధతిలో సహజ వాయువును కొని విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి, విద్యుత్ కొనుగోలుకు విపరీతమైన అధిక ధరలను చెల్లించాల్సి వస్తున్నది. కేజీ బేసిన్లో ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ గ్యాస్ ఉత్పత్తి పెంచడానికి కేంద్రం అనుమతించని పరిస్థితి ఒక పక్క కొనసాగుతుండగా, ఓఎన్‌జీసీ బావుల నుండి రిలయన్స్ దాదాపు రూ.30వేల కోట్ల విలువైన గ్యాస్‌ను అక్రమంగా తీసుకొన్నట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ (డీజీహెచ్) నిర్ధారించింది.

బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ వ్యయం విపరీతంగా పెరగడానికి కేంద్రం విధిస్తున్న రకరకాల పన్నులు మరో కారణం. బొగ్గు మూల ధరపై రాయల్టీ, జీఎస్టీ, గ్రీన్ ఎనర్జీ సెస్, జాతీయ మైనింగ్ ఎక్స్‌ప్లొరేషన్ పన్ను రాయల్టీ, జిల్లా మినరల్ ఫౌండేషన్ ఛార్జ్ రాయల్టీపై పర్యావరణ, వికాస్ ఉపకార లెవీ వంటివి ఉన్నాయి. బొగ్గు రవాణాకు రైల్వేలు వసూలు చేస్తున్న మొత్తం కూడా బొగ్గు ధరలో 25శాతంగా ఉంది. రోడ్డు రవాణా చార్జీలు 11శాతంగా ఉన్నాయి. డివిడెండ్లు, పన్నులు, సుంకాల రూపంలో కేంద్రం విపరీతంగా ఆదాయం పొందుతున్నా, వినియోగదారులకు విద్యుత్ చార్జీల భారాలను తగ్గించేందుకు ఎటువంటి సబ్సిడీని ఇవ్వటం లేదు.


వినియోగదారులపై అనవసర భారాలు

ఆశ్రిత పెట్టుబడిదారుల, ప్రయివేటు వ్యాపారుల పబ్బం గడిపేందుకు కేంద్రం అనుసరిస్తున్న విధానాలు, విద్యుత్ వినియోగదారులపై అన్యాయంగా విపరీత భారాలను మోపుతున్నాయి. దేశంలో బొగ్గుగనుల సంస్థలకు సమృద్ధిగా నిధులు, యంత్రాలు, కార్మిక శక్తి, బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ, దేశంలో బొగ్గుకు కృత్రిమంగా కొరత సృష్టిస్తున్నారు. దీనితో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు కేంద్రం చేసిన కేటాయింపుల మేరకు బొగ్గు సరఫరా జరగక, విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయి, విద్యుత్ కొరత ఏర్పడుతున్నది. విద్యుత్ ఉత్పత్తికి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని దేశంలో బొగ్గు కొరతను కృత్రిమంగా సృష్టించిన కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల, ప్రయివేటు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులపై ఒత్తిడి తెస్తూ ఆదేశాలను జారీ చేస్తున్నది. ఇక్కడ అదానీ, టాటాల వంటి గుత్తపెట్టుబడిదారీ సంస్థల థర్మల్ ప్రాజెక్టులకు ఈ ఆదేశాలను వర్తింపచేయటం లేదు. మోడీ ప్రభుత్వం కోల్ ఇండియా లిమిటెడ్ ద్వారా ఆస్ట్రేలియాలోని బొగ్గు గనుల నుండి స్వదేశీ బొగ్గు ధరల కన్నా అనేక రెట్లు అధిక ధరలకు బొగ్గును దిగుమతి చేయించి థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అంటగట్టింది. దీంతో, విదేశీ బొగ్గుతో ఉత్పత్తి చేసే ప్రాజెక్టుల విద్యుత్ వ్యయం విపరీతంగా పెరిగింది. మరోపక్క, విద్యుత్ కొరతతో, డిస్కాములు డిమాండ్ తీర్చేందుకు విద్యుత్ ఎక్స్ఛేంజీల



> దేశంలో బొగ్గుగనుల సంస్థలకు సమృద్ధిగా నిధులు, యంత్రాలు, కార్మిక శక్తి, బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ, దేశంలో బొగ్గుకు కృత్రిమంగా కొరత సృష్టిస్తున్నారు. దీనితో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు కేంద్రం చేసిన కేటాయింపుల మేరకు బొగ్గు సరఫరా జరగక, విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయి, విద్యుత్ కొరత ఏర్పడుతున్నది. విద్యుత్ ఉత్పత్తికి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని దేశంలో బొగ్గు కొరతను కృత్రిమంగా సృష్టించిన కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల, ప్రయివేటు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులపై ఒత్తిడి తెస్తూ ఆదేశాలను జారీ చేస్తున్నది. ఇక్కడ అదానీ, టాటాల వంటి గుత్తపెట్టుబడిదారీ సంస్థల థర్మల్ ప్రాజెక్టులకు ఈ ఆదేశాలను వర్తింపచేయటం లేదు.

ద్వారా చాలా అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయి. ఆ విధంగా ఒక పక్క ఆశ్రిత పెట్టుబడిదారుల, ప్రయివేటు విద్యుత్ వ్యాపారుల పబ్బంగడుపుతూ, వినియోగదారులపై విపరీత భారాలు మోపడానికి మోడీ ప్రభుత్వ విధానాలు దారితీస్తున్నాయి. ఉదాహరణకు, తెలంగాణ డిస్కములు ఎస్ఈఎంబీ కార్ప్ రెండవ యూనిట్ నుండి కొంటున్న విద్యుత్‌కు అస్థిర చార్జీలు 2021-22 నుండి 2023-24కు 49.03శాతానికి పెరుగుతున్నట్లు, 2023-24లో ఆ ప్రాజెక్ట్ నుండి కొనే విద్యుత్‌కు యూనిట్‌కు రూ.8.33 చొప్పున చెల్లించాలని వెల్లడించాయి. డిస్కములు 2020-21 సంవత్సరానికి రూ.8790 కోట్ల మేరకు ట్రూ అప్ కింద వినియోగదారుల నుండి వసూలు చేసుకునేందుకు అనుమతించాలని కోరాయి. 2022-23లో రూ.6078.73 కోట్ల మేరకు విద్యుత్ ఛార్జీలను పెంచాక కూడా ఆ సంవత్సరానికి రూ.901 కోట్ల ట్రూ అప్‌ను అనుమతిచ్చాలని టీఎస్ఈఆర్‌సీని కోరాయి.


ఎం. వేణుగోపాలరావు

సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నుండి కొనుగోలు చేసే విద్యుత్‌కు 2023-24లో యూనిట్‌కు రూ.6.92 చొప్పున చెల్లించాలని డిస్కాములు చూపాయి. ఈ ప్రాజెక్ట్‌కు సింగరేణి బొగ్గుగనుల నుండి బొగ్గును కేటాయించాలని అనేక సంవత్సరాలుగా కోరుతున్నా మోడీ ప్రభుత్వం ఇంతవరకు సానుకూలంగా ప్రతిస్పందించలేదు. ఇతరులకు కేటాయించిన బొగ్గు సరఫరా చేసాక కూడా తమ బొగ్గు గనులనుండి తమ విద్యుత్ ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గు సరఫరా చేయగలమని సింగరేణి కేంద్రానికి తెలిపినా కూడా స్పందన లేదు. ఒడిశాలోని నాయిని బొగ్గు బ్లాక్ నుండి కేంద్రం ఈ ప్రాజెక్టుకు బొగ్గు కేటాయించింది. మోడీ ప్రభుత్వ మొండివైఖరి వల్ల, బ్రిడ్జి లింకేజీ కింద బొగ్గు సరఫరాకు సింగరేణి మార్కెట్ ధరల ప్రకారం చాలా అధిక ధరలను ఆ సంస్థ థర్మల్ ప్రాజెక్ట్ చెల్లిస్తున్న పరిస్థితి కొనసాగుతున్నది. దీనివల్ల సింగరేణి టి.టి.సి. అధికంగా అస్థిర ఛార్జీలను చెల్లించాల్సి వస్తున్నది. పోటీ ఉంటుందని, విద్యుత్ ఛార్జీలు తగ్గుతాయని సంస్కరణల మద్దతుదారులు చేసిన వాదనలు డొల్ల అని కూడా రుజువయింది. విద్యుత్ ఎక్స్ఛేంజీలు ద్వారా వివిధ విద్యుత్ వ్యాపారులు పోటీపడి తక్కువ ధరకు విద్యుత్‌ను విక్రయించే పరిస్థితి లేకుండా పోయింది. విద్యుత్ వ్యాపారులంతా రింగ్‌గా ఏర్పడి, కొనుగోలు దారులైన డిస్కాములు ఎంత ఎక్కువ రేట్ ఇవ్వడానికి అంగీకరిస్తాయో వాటికి విద్యుత్ సరఫరా చేసే విధానం అమలు జరుగుతున్నది. ఆ విధంగా విద్యుత్ ఎక్స్ఛేంజీలు చట్టబద్ధ నల్ల బజారు వ్యాపారానికి అడ్డాలుగా మారడానికి, కొరత పరిస్థితుల సాకుతో ధరలను విపరీతంగా పెంచడానికి మోడీ ప్రభుత్వం వీలుకల్పిస్తున్నది.

(మిగతా రేపటి సంచికలో)


వలస శవం

ఊహించని కష్టమేదో...
ఊరు దాటేలా ఉసిగొల్పిందో...
భరించలేని బాధేదో, బతుకును ముల్లెగట్టి,
బంధాలకు దూరంగా విసిరేసిందో...

ఏం జరిగిందో కానీ అతడు,
మట్టి దోసిట్లో కంటి ముత్యాల్ని రాల్చి,
కన్న నేలను కన్నార్పకుండా చూస్తూ
వెళ్ళిపోయాడు...

గుండెను ఇంటికి ఝూమర్ లా వేలాడదీసి,
ఆత్మను ఊరి పొలిమేరల్లో ప్రతిష్టించి,
దేహమై దేశ సరిహద్దుతో పాటు,
అశ్రువై కంటి కంచెల్నీ ఒకేసారి దాటేశాడు...

సహ కార్మికులతో బాధల్ని పంచుకుంటూ...
గతాన్ని కన్నీళ్లలో నంజుకుంటూ...



పగటి కత్తికి తెగిపడ్డ కలల్ని పోగేసి...
రాత్రి రంగునద్ది అతికిస్తుండేవాడు....
యజమానుల తిట్లు తిని,
కన్నీళ్ళు తాగి కడుపు నింపుకునేవాడు...
అందుకేనేమో ఎప్పుడడిగినా ఆకలి లేదనేవాడు...

ఆడి, ఆడి అలసిపోయాడో,
ఓడే ఆటను ఆడననుకున్నాడో,
ఆటనాపేశాడు....

చివరికి... లోహ విహంగమై ఎగిరినవాడు,
ఇనుప పెట్టెలో ఇంటిముందు వాలాడు...

పార్థీవ దేహాన్ని తప్ప,
వలస శవాన్ని ఏనాడూ దర్శించని
పగటి వేషగాళ్ళు హఠాత్తుగా ప్రత్యక్షమై
కపట నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు...

"జాతరొస్తున్నట్లుంది"
విన్యాసాలెన్నో చేస్తున్నారు కానీ,
అదేంటో మరి..?!
"వాళ్ళ చొక్కాకున్న తెలుపులో,
కొంచెమైనా మనసుకంటడం లేదు."

- జాబేర్ పాషా
00968 78531638

నగరం నుండి మొదటి మహిళ

సయ్యద్ సాల్వా ఫాతిమా... భారతదేశంలో కమర్షియల్ పైలట్ లైసెన్స్ పొందిన కొద్దిమంది ముస్లిం మహిళల్లో ఒకరు. ఆమె శిక్షణ సమయంలో ఎల్లప్పుడూ హిజాబ్ ధరించే ఉండేది. ఒక ముస్లిం మహిళా ఇలాంటి వృత్తిని చేపట్టడంతో మన భారతదేశంలోనే కాదు విదేశాలలో కూడా ఎన్నో ప్రశంసలు అందుకుంది.

హైదరాబాద్ పాతబస్తీకి చెందిన ఫాతిమా 34 ఏండ్ల మొదటి మహిళా వాణిజ్య పైలట్. ఆమె రెండు సీట్ల సెస్నాలో ఆకాశానికి ఎగిరింది. అయినప్పటికీ ఆమె ఎయిర్ బస్ 320లో గ్లోబల్ ఎయిర్ ట్రాఫిక్‌ను నావిగేట్ చేస్తుంది. 550 గంటలు ఎగురుతూ తన గమ్యాన్ని చేరుకుంది. ఫాతిమా బేకరీ ఉద్యోగి సయ్యద్ అష్ఫాక్ అహ్మద్ కుమార్తె. ఫాతిమా పాతబస్తీలోని మొఘల్‌పురాలోని నిరుపేద కుటుంబంలో పుట్టింది. ఈమెకు నలుగురు తోబుట్టువులు ఉన్నారు.



ఆర్థిక సమస్యల కారణంగా మలక్‌పేటలోని నియో స్కూల్ ఐజ్జాలో చదువుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ అలీఫియా హుస్సేన్ ఆమె చదువు కోసం రెండేండ్ల పాటు స్పాన్సర్ చేశారు. తర్వాత ఆమె సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, మెహదీపట్నం నుండి ఇంటర్మీడియట్ కోర్సును పూర్తి చేసింది.

ఐదేండ్ల కఠిన శిక్షణ...

ఫాతిమా విజయానికి పేదరికం అడ్డుకట్ట వేయలేదు. తనకు చిన్నప్పటి నుంచి పైలట్ కావాలనే కోరిక బలంగా ఉండేది. 12వ తరగతి ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఇంజనీరింగ్‌లో చేరింది. అక్కడే ఆమె కల గురించి అడిగారు. వెంటనే పైలట్ కావాలన్నది తన కల అని చెప్పింది. ఫాతిమా 2007లో ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ అకాడమీలో అడ్మిషన్ పొందింది. ఐదేండ్ల కఠిన శిక్షణ తర్వాత కమర్షియల్ పైలట్, ప్రైవేట్ పైలట్ ఌ ఫ్లైట్ రేడియో టెలిఫోన్ ఆపరేటర్ లైసెన్స్ పొందింది. శిక్షణ మొత్తంలో ఫాతిమా తన 123 గంటల సోలో ఫ్లైట్‌తో సహా సెస్నా 152, 172లో 200 గంటలు ప్రయాణించింది. కానీ ఆమె కల నెరవేరడానికి ఇది సరిపోలేదు. ఆమె ఇప్పుడు బోయింగ్ లేదా ఎయిర్‌బస్ వంటి పెద్ద విమానాలలో శిక్షణ పొందవలసి ఉంది. ఈ శిక్షణ కోసం ఆమెకు 30-35 లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది.

ప్రభుత్వ సాయంతో...

ఫాతిమా నైపుణ్యాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం సాయం చేసేందుకు ముందుకు వచ్చింది. న్యూజిలాండ్‌లో ఆమె శిక్షణ కోసం ప్రభుత్వం రూ.36 లక్షలు మంజూరు చేసింది. న్యూజిలాండ్‌లో తన శిక్షణ సమయంలో ఫాతిమా 5 గంటల పాటు బహుళ-ఇంజిన్ విమానాన్ని నడిపింది. అలాగే 10 గంటలపాటు సిమ్యులేటర్‌పై శిక్షణ పొందింది. బహ్రెయిన్‌లోని గల్ఫ్ ఏవియేషన్ అకాడమీలో ఎయిర్‌బస్‌లో టైప్ - రేటింగ్‌కు అర్హత సాధించింది.

ప్రతి అమ్మాయికి స్ఫూర్తి..

ప్రస్తుతం ఫాతిమా ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో పనిచేస్తుంది. తాను కచ్చితంగా పైలట్ కావాలని కలలు కన్నానని, అయితే ఈ కల నెరవేరుతుందని ఎప్పుడూ అనుకోలేదని ఉప్పొంగిన ఫాతిమా చెప్పింది. అయితే ఆమె తన కల నెరవేర్చుకోవడానికి ఎన్నో సమస్యలను, అసమానతలను ధైర్యంగా ఎదుర్కొంది. అందుకే ఫాతిమా జీవితం కేవలం ముస్లిం సమాజానికే కాకుండా జీవితంలో సమస్యలను ఎదుర్కొనే ప్రతి భారతీయ అమ్మాయికి కూడా స్ఫూర్తిగా నిలుస్తుంది.

ప్రోటీన్లు చాలా అవసరం

శరీరంలోని జీవక్రియలు సక్రమంగా జరగాలన్నా, కండరాలు బలోపేతం కావాలన్నా ప్రోటీన్లు ఎంతో అవసరం. ప్రత్యేకించి ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు... ఊపిరి సలపని పనులతో నిత్యం బిజీగా ఉండే వారు అలసట కలగకుండా ఉండాలంటే ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీర కండర వ్యవస్థ దృఢమవుతుంది. దీంతో ఎలాంటి ఒత్తిడి, అలసట లేకుండా సునాయాసంగా అన్ని పనులు చేసుకోవచ్చు. అలాగే ప్రోటీన్లు గుండె బలంగా ఉండేందుకు, రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకూ దోహదం చేస్తాయి. తగినన్ని ప్రోటీన్లు లభించే ఆహారం తీసుకుంటే తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండిన భావన కూడా కలుగుతుంది.




సాధారణంగా చేపలు, చికెన్, మటన్ లాంటి మాంసాహార పదార్థాల్లో ప్రోటీన్లు అధికంగా దొరుకుతాయి. అయితే మాంసాహారం అధికంగా తీసుకోవడం వల్ల కొందరిలో కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నమవుతుంటాయి. దీంతో చాలామంది మాంసాహారం మానేసి శాకాహారానికే ప్రాధాన్యమిస్తుంటారు. ఇదే సమయంలో శాకాహారం తీసుకునే వారిలో చాలామంది ప్రోటీన్ల లోపంతో బాధపడుతున్నట్లు ఓ అధ్యయనంలో తేలింది. అయితే ప్రోటీన్లు అధికంగా ఉండే కొన్ని శాకాహార పదార్థాలను ఆహారంలో భాగం చేసుకుంటే ఈ సమస్య నుంచి సులభంగా బయటపడవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. పైగా కూరగాయలు, పండ్ల నుంచి లభించే ప్రోటీన్లతో అమైనో యాసిడ్లు నేరుగా శరీరానికే అందుతాయని, ఇవి కండరాలను బలోపేతం చేస్తాయంటున్నారు. మరి ప్రోటీన్లు పుష్కలంగా దొరికే కొన్ని శాకా హార పదార్థాలు ఉన్నాయి.

పప్పుధాన్యాలు



కందులు, పెసలు, మినుములు మొదలైన వాటిలో ఉండే పోషకాలతో పలు ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. పప్పు ధాన్యాల్లో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలోని పీచు పదార్థాలు కూడా శరీర బరువును పెరగకుండా చేస్తాయి. అదే విధంగా వీటిలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్ లాంటి దీర్ఘ కాలిక వ్యాధుల నుంచి రక్షణ కలిగిస్తాయి.

చిక్కుళ్లు



కిడ్నీ బీన్స్ (రాజ్మా), బ్లాక్ బీన్స్ వంటి చిక్కుడు జాతికి చెందిన పదార్థాల్లో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే ప్రోటీన్లతో పాటు బి-విటమిన్, ఫైబర్ శరీరానికి పుష్కలంగా అందుతాయి. అంతే గాకుండా వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి వ్యాధుల నుంచి రక్షణ కలిగిస్తాయి.

పచ్చి బఠాణీలు




ఒక కప్పు పచ్చి బఠాణీల్లో 8 గ్రాముల వరకు ప్రోటీన్ ఉంటుంది. వీటిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గిస్తాయి. తద్వారా క్యాన్సర్, డయాబెటిస్ లాంటి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి దూరంగా ఉండచ్చు. ఇవేకాక వీటిలో ఏ, కె, సి విటమిన్లు, ఫైబర్ వంటి పోషకాలు కూడా సమృద్ధిగా ఉంటాయి.

నట్స్



ప్రోటీన్లతో నిండి ఉండే బాదం పప్పు, పిస్తా, అక్రోట్ వంటి గింజలను ప్రతిరోజూ తీసుకుంటే గుండెకు ఎంతో మేలు చేస్తాయి. వీటితో పాటు కొన్ని రకాల విటమిన్లు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగా తీసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

సోయాబీన్స్



సోయాబీన్స్‌లో మాంసాహారంతో సమానంగా ప్రోటీన్లు ఉంటాయి. ఇందులోని బి, డి, ఇ-విటమిన్లు, క్యాల్షియం, ఐరన్, జింక్, అన్‌శ్యాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి రక్తపోటు సమస్యను నివారిస్తాయి. సోయా లో ఉండే యాంటీఆక్సిడెంట్స్ సమ్మేళనం మహిళల్లో మెనోపాజ్ సమస్యలను నివారించడంతో పాటు రొమ్ము క్యాన్సర్ నుంచి కూడా రక్షణ కలిగిస్తుంది.

నైపుణ్యాలు ఉండాలి

విద్యార్థి దశ నుంచి ఒక్కసారే పోటీ ప్రపంచంలోకి అడుగుపెట్టడమంటే కొంత ఒడుదొడుకులెదురవుతాయి. ముఖ్యంగా కార్పొరేట్ సంస్థలో బాధ్యతలు చేపట్టాలంటే కొన్నిరకాల నైపుణ్యాలు తెలిసుండాలి. వీటినే కార్పొరేట్ సర్వైవల్ స్కిల్స్ అంటున్నారు నిపుణులు. ఆ నైపుణ్యాలేంటో మనమూ తెలుసుకుందాం...

- కెరియర్‌లోకి అడుగుపెట్టేటప్పుడు తెలియని వారు, గతంలో పరిచయం లేరంటూ ఎదుటపడిన వ్యక్తులను దాటి ముందుకెళ్లకూడదు. గతంలో ముఖ పరిచయం లేని వ్యక్తులతో కూడా మాట కలపడం నేర్చు కోవాలి. ఓ పలకరింపు అవతలివారి గురించి తెలుసుకో వడానికి మార్గం అవుతుంది. తెలియనివారితోనూ సునాయసంగా మాటకలపడం కొత్త సామర్థ్యమే. ప్రాజెక్ట్‌కు సంబంధించి తెలియని వ్యక్తులతో ఏర్పాటు చేసే సమావేశాల్లో ఈ నైపుణ్యం ఉపయోగపడుతుంది. కార్పొరేట్ కార్యాలయంలో విధులు నిర్వహించాలంటే చేపట్టాల్సిన బాధ్యతలపై అవగాహన ఉంటే సరిపోదు. సహోద్యోగులతో మెలగడం, ఉన్నతాధికారితో మాట్లాడే విధానంలో మెలకువలు తెలిసుండాలి.
- ఆఫీస్‌లో సహబృందంతో పరస్పర అనుబంధం ప్రాజెక్ట్ వివరించడం లాంటివి తేలిక చేస్తుంది. ఒకరి నొకరికి పరిచయం చేయడానికి ముందుగా బృందంలో ప్రతి ఒక్కరూ తెలుసుండాలి. ఇలా జరగాలంటే వారితో విడివిడిగా మాట్లాడటానికి ప్రయత్నించాలి. దీంతో ముందుగానే అందరి గురించి వివరాలు తెలుస్తాయి. ఆ తర్వాత బృంద నేతృత్వంలో అందరి మధ్య అనుబంధాన్ని ఏర్పరిచి విజయవంతంగా ప్రాజెక్ట్ పూర్తిచేయించొచ్చు.
- ఎదుటివారు చెప్పేది పూర్తిగా వినడానికి ప్రయత్నించాలి. అవసరమైతే చర్చించడానికి ఆసక్తి చూపించాలి. స్థాయి ఏదైనా... విజయం చిన్నదైనా.. పెద్దదైనా.. దానికి కారణమైనవారిని గుర్తించి ప్రశంసించాలి. అవతలివారు అపజయంతో నిరుత్సాహంగా ఉన్నప్పుడు.. మరోసారి ప్రయత్నించమంటూ ప్రోత్సహించాలి. అవసరమైతే సలహా ఇవ్వాలి. అంతే కాదు, ప్రాజెక్ట్ సొంతదైనా.. అనుకున్న సమయా నికి పూర్తి చేయలేకపోయినా, దానిపై సరైన అవగా హన లేకపోయినా సహాయం అడగడానికి వెనకాడొద్దు.



ఏఈ పరీక్ష రద్దు

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. 48 గంటల్లో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేయకుంటే ఆమరణ దీక్ష చేస్తానంటూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. చివరికి లీకేజీ వ్యవహారం రాజకీయ అంశంగా మారిందన్న అభిప్రాయం వినిపిస్తున్నది. బుధవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో సిట్ దర్యాప్తు చేపట్టింది. అధికారులు, సిబ్బందిని అడిగి పలు విషయాలను అధికారులు తెలుసుకున్నారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి : సీపీఐ(ఎం)

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. హాస్టళ్లలో ఉంటూ, కోచింగ్‌లకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ నానా ఇబ్బందులు పడ్డ నిరుద్యోగులకు ఈ ఘటన తీవ్ర నష్టదాయకమని ఆందోళన వ్యక్తం చేశారు. అందరికీ మనస్థాపాన్ని కలిగించిందని పేర్కొన్నారు. విచారణ కోసం ఏర్పాటు చేయబడ్డ సిట్ ఎనిమిది మంది నిందితులను రిమాండ్‌కు పంపడంతోనే సరిపెట్టకుండా, నియామకాల విషయంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీఎస్‌పీఎస్‌సీ చైర్మెన్, కార్యదర్శి, మొత్తం సభ్యుల పాత్రపై విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లీకేజీ అయిన పేపర్ల పరీక్షలను రద్దు చేసి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని కోరారు. పేపర్ లీకేజీలో టీఎస్‌పీఎస్సీ ఇంత నిర్లక్ష్యంగా వ్యహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. డిపార్టుమెంట్ వ్యవహారాలు, పరీక్ష పేపర్లు, కీలకమైన పాస్‌వర్డ్ కమిషన్ లేదా చైర్మెన్, సెక్రటరీలకు మాత్రమే తెలుస్తాయని వివరించారు. కానీ సెక్షన్ ఆఫీసర్ ఇంత కీలకమైన పేపర్లను ఫొటో తీసుకున్నాడంటే అక్కడ వాటికి భద్రత కల్పించడంలో బాధ్యులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో అర్థమవుతుందని తెలిపారు. ఇప్పటికే గ్రూప్-1 పరీక్షా పేపర్లు కూడా లీకైనట్టుగా వస్తున్న వార్తలపై టీఎస్‌పీఎస్సీ పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలకు పాల్పడ్డ నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

సమగ్ర విచారణ జరపాలి : ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ

(మొదటిపేజీ తరువాయి)

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ మాట్లాడుతూ ప్రశ్నాపత్రం లీకేజీపై టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యులు, కార్యదర్శి బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రహస్య విభాగంలోకి ఇతర సెక్షన్ల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎలా ప్రవేశించారో చెప్పాలని డిమాండ్ చేశారు. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు వారి చేతికి ఎలా వచ్చాయని ప్రశ్నించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సంతోష్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, నాయకులు కిరణ్, నాగేంద్ర, డీవైఎఫ్ఐ నగర నాయకులు హస్మీబాబు తదితరులు పాల్గొన్నారు. లీకేజీ కుంభకోణం తెరవెనుక ఉన్న తెరవెనుక ఉన్న ప్రభుత్వ పెద్దలను అరెస్టు చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది.

ఆచార్య ఎస్వీ సత్యనారాయణకు డి.లిట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణకు మద్రాస్ విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ లిటరేషన్(డి.లిట్) పట్టాను ప్రకటించింది. బుధవారం ఈ మేరకు మద్రాస్ వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆధునిక తెలుగు సాహిత్య ధోరణులు అనే అంశంపై ఆయన సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డి.లిట్ పట్టా ఇచ్చామని తెలిపారు. ఎస్వీ సత్యనారాయణ 28 గ్రంథాలను వెలువరించారు. మరో 34 గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. రష్యా ఆస్ట్రేలియా, అమెరికా, న్యూజిలాండ్, సింగపూర్, నేపాల్, ఈజిప్టు, మలేషియా, మారిషస్, తదితర దేశాల వేదికలపై తెలుగు సాహిత్యంపై ప్రసంగించారు.

ఈడీ నోటీసులు రద్దుచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. మనీ లాండరింగ్ కేసులో కవితను ఈడీ అధికారులు ఈ నెల 11న గంటల తరబడి ప్రశ్నించారని గుర్తు చేశారు. కవిత నివాసానికి బదులుగా ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించడంలో అర్థంలేదని పేర్కొన్నారు. తమ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించడం క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకమని వాదించారు. క్రిమినల్ ప్రొసీజర్‌లోని సెక్షన్ 160కి సంబంధించిన ప్రొవిజన్‌ను ఉల్లంఘించినట్టయిందని అన్నారు. ఎఫ్ఐఆర్‌లో కవిత పేరు లేకపోయినప్పటికీ, కేంద్రంలో అధికారంలో ఉన్న అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఢిల్లీ ఎక్సైజ్ పాలసీని అడ్డుగా పెట్టుకుని ఆమెపై రాజకీయ కారణాలతో ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఇది రాజకీయ కుట్రలో భాగమని పేర్కొన్నారు. అయితే ఇప్పటికిప్పుడు ఈడీ విచారణను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేయడానికి ధర్మాసనం అంగీకరించలేదు. ఈ విషయంలో కవిత చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

వీడియో కాన్ఫరెన్స్‌లో విచారణ జరపాలి

ఈడీ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నదని కవిత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అధికార పార్టీ ఆదేశాలతో ఈడీ తనను వేధిస్తున్నదని, తన విషయంలో ఈడీ చట్ట విరుద్ధంగా వ్యవహరించిందని తెలిపారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్‌లో తన పేరు ఎక్కడా లేదనీ, కొంతమంది వాంగ్మూలం ఆధారంగా ఈ కేసులో తనను ఇరికించారని పేర్కొన్నారు. తనకు వ్యతిరేకంగా ఇచ్చిన స్టేట్‌మెంట్లకు విశ్వసనీయత లేదని తెలిపారు. 'ఈడీ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నది. శరత్ చంద్రా రెడ్డి అనే సాక్షిని కొట్టడమే దీనికి నిదర్శనం. అరుణ్ రామచంద్ర పిళ్లైను బెదిరించి వాంగ్మూలం తీసుకున్నారు. ఆయన తన వాంగ్మూలాన్ని వెనక్కి తీసుకున్నారు. ఈడీ అధికారులు నా సెల్‌ఫోన్‌ను బలవంతంగా తీసుకున్నారు. చట్ట విరుద్ధంగా నా ఫోన్ సీజ్ చేశారు. నా ఫోన్ సీజ్ చేసిన సమయంలో నా వివరణ తీసుకోలేదు. నా నివాసంలో, వీడియో కాన్ఫరెన్స్‌లో విచారణ జరపాలి' అని పేర్కొన్నారు. అలాగే, ఈ కేసులో తనకు ఈడి ఇచ్చిన సమన్లు రద్దు చేయాలని కోరారు. తనపై ఎలాంటి బలవంతపు(అరెస్ట్ వంటి) చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ఈడీ ముందుకు కవిత

ఢిల్లీ మద్యం కుంభకోణంలో నేడు (గురువారం) ఈడీ ముందు ఎమ్మెల్సీ కె.కవిత హాజరుకానున్నారు. ఈ నెల 11న కవితను దాదాపు తొమ్మిది గంటల పాటు విచారించిన ఈడీ అధికారులు ఆమె ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. నేడు మళ్లీ ఈడీ విచారించనుంది. కవిత విచారణకు అరుణ్ పిళ్లై, బుచ్చిబాబు వాంగ్మూలాలు కీలకం కానున్నాయి.

మోడీ మహానటనకు.. ఆస్కార్ వస్తుండే

(మొదటిపేజీ తరువాయి)

పాటు దేశం మొత్తం సంపదను దోచి ఆయన దోస్తు అదానీ ఖాతాలు లక్షల కోట్లతో నింపుతుండని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి అదే దోస్తు నుంచి ఫండ్ తీసుకుని ప్రతిపక్షాల ఎమ్మెల్యేలను కొంటూ దేశాన్ని ఆగం చేస్తుండని విమర్శించారు. ప్రతేడాది రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని, చివరకు పకోడీలు వేసుకోవడం కూడా ఉద్యోగమని కొత్త నిర్వచనం ఇచ్చాడని దుయ్యబట్టారు. 'మోడీ మాటలు కోట్లల్లో.. చేతలు పకోడీల్లో' అంటూ వ్యాఖ్యానించారు. రైతుల ఆదాయం రెండింతలు చేస్తామని, నల్లధనం వెనక్కు తెస్తామని హామీలు గుప్పించి అమలు చేయడం లేదని విమర్శించారు. మన్మోహన్‌సింగ్ హయాంలో వంట గ్యాస్ సిలెండర్ ధర రూ.400 ఉంటే సన్నాసి, దద్దమ్మ అని విమర్శించిన మోడీ... మరి తన హయాంలో రూ.1200 ధర అయ్యిందని, మరి నిన్ను ఏమనాలంటూ ప్రశ్నించారు. తెలంగాణపై మోడీ కక్ష కట్టిండని, విభజన హామీలు అమలు చేయట్లేదన్నారు. గాలి గత్తరకేసులతో ఆగమాగం చేస్తుండని, మోడీ, ఈడీలకు భయపడబోమని, ఏం చేసుకుంటారో చేసుకోండని సవాల్ విసిరారు.

ఏదైనా ప్రజాకోర్టులోనే తేల్చుకుంటామన్నారు. ఎవరు నీతిమంతులో, ఎవరు అవినీతిపరులో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. 2023 ఎన్నికల్లో బీజేపీకి డిపాజిట్ కూడా రానియ్యకుండా ప్రజలే తీర్పు చెబుతారని అన్నారు. మళ్లీ ఒక్క ఛాన్స్ ఇవ్వాలంటూ కాంగ్రెస్ వాళ్లు గొంతుచిం చుకుంటున్నారని, 55 యేండ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. కరెంటు, నీళ్లు, విద్య ఇచ్చే తెలివిలేనోళ్లు మళ్లీ ఏం చేస్తారని విమర్శించారు. మళ్లీ టీఆర్ఎస్‌ను గెలిపించి రాష్ట్రంలో కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, జాజుల సరేందర్, బిగాల గణేష్‌గుప్తా, ఎమ్మెల్సీ రాజేశ్వర్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదర్ శోభరాజు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

చైనా ఎన్నటికీ సోషలిజాన్ని వీడదు...

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభ ఉపన్యాసం చేస్తూ ప్రజలకు మొదటి ప్రాధన్యత ఇచ్చే ఆధునీకరణ విధానాన్ని మాత్రమే చైనా అనుసరిస్తుందని అన్నారు. సోషలిస్టు విధానాన్ని తాము ఎన్నటికీ విడనాడమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం పేరుతో ప్రజల మధ్య చిచ్చు రేపేందుకు కుట్రలు చేయడం ప్రజాస్వామ్యమే కాదని స్పష్టం చేశారు. వలసవాదాన్ని, అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ఆధిపత్య విధానాన్ని చైనా ఎప్పటికీ అనుసరించదని పేర్కొన్నారు. చైనా తన చేతనైనంత వరకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను చూపుతోందని, అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందని దేశాల (ఉత్తర, దక్షిణ దేశాలు) మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తుందని స్పష్టం చేశారు. ఈ దిశగా చైనా ప్రపంచ నాగరికతల పట్ల సరికొత్త చొరవ తీసుకుంటుందని జిన్‌పింగ్ ప్రకటించారు.



ఏ దేశానికి ఆదేశంలో ప్రత్యేక పరిస్థితులు ఉంటాయని, ఆ ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆధునీకరణ విధానాన్ని అవలంభించాలని సూచించారు. అంతేతప్ప ప్రపంచమంతా ఒకే విధంగా ఆధునీకరించబడాలనే విధానాలను రుద్దే ప్రయత్నాలు సరైనవి కావన్నారు. ఆధునీకరణ అంటే ఒక దేశం మరొక దేశాన్ని దోచుకోవడం కాదని, అన్ని దేశాలు కలిసి అభివృద్ధి చెందడమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వెనుజుల అధ్యక్షుడు నికోలస్ మదురో, సౌత్ ఆఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, నికరాగ్వా అధ్యక్షుడు డేనియల్ ఒర్టెగా, బోలీవియా మాజీ అధ్యక్షుడు ఈవో మోరేల్స్, సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ తదితరులు మాట్లాడారు. అనేక దేశాధినేతలు, వివిధ దేశాలకు చెందిన అధికార, ప్రతిపక్షనేతలు పాల్గొన్నారు. దక్షిణాఫ్రియా, పోర్చుగీస్, వియత్నాం, బ్రెజిల్, ఉత్తరకొరియా తదితర దేశాల కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలు కూడా పాల్గొన్నాయి. సీపీఐ(ఎం) తరపున ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఏ బేబి, కేంద్ర కమిటీ సభ్యుడు ఆర్.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈడీ కార్యాలయానికి ప్రతిపక్షాల ర్యాలీ

(మొదటిపేజీ తరువాయి)

విదేశీ గడ్డపై దేశ ప్రజల గురించి మోడీ చేసిన అవమానకర వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలన్నారు.

'అదానీ అంశం'పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ దర్యాప్తును ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని కాంగ్రెస్ లోక్‌సభ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి అన్నారు. అయితే బీజేపీకి జేపీసీ అక్కర్లేదని, ఎందుకంటే బీజేపీ అవినీతి బయటపడుతుందని పేర్కొన్నారు. అలాగే బీజేపీ అసలు రూపం కూడా ప్రజలకు తెలుస్తుందనీ, ప్రతిపక్షంలో ఉన్నంత వరకు జేపీసీ కావాలని డిమాండ్ చేశారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు భయపడుతున్నారని పేర్కొన్నారు.

ప్రతిష్టంభన

పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో వరుసగా మూడో రోజూ కూడా అదే తీరు కొనసాగింది. అధికార బీజేపీ, ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించాయి. అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంపై ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేయగా, రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని అధికార బీజేపీ ఎంపీలు.. అధికార, ప్రతిపక్షాల పోటాపోటీ ఆందోళనలతో పార్లమెంట్ ఉభయసభల్లో వాయిదాల పర్వం కొనసాగింది. బుధవారం లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు ప్లకార్డులు చేబూని ఆందోళనకు దిగారు. అదానీ అంశంపై విచారణకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా నినాదాలు హోరెత్తించారు. దానికి పోటీగా అధికార బీజేపీ ఎంపీలు ఎదురుదాడికి దిగారు. నినాదాలతో గందరగోళం సృష్టించారు. లండన్‌లో దేశం పరువుతీసే వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ.. సభకు క్షమాపణలు చెప్పాలని పట్టుబట్టారు. సభ సజావుగా సాగేందుకు సభ్యులు సహకరించాలని లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా కోరారు. అయినప్పటికీ అధికార పక్ష ఎంపీలు వెనక్కి తగ్గలేదు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు కూడా తమ ఆందోళనను కొనసాగించారు. వెంటనే సభను స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో కూడా పరిస్థితిలో ఎటువంటి మార్పు రాకపోవడంతో సభను గురువారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే తీరు కొనసాగింది.

అదానీపై విచారణ చేయాల్సిందే...

(మొదటిపేజీ తరువాయి)

చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం... కాంగ్రెస్ సృష్టించిన ప్రభుత్వ సంపదను క్రోని క్యాపిటలిస్టులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధాని మోడీ నిర్వీర్యం చేస్తూ వ్యవస్థలను దిగజార్చుతున్నారని విమర్శించారు. 130 కోట్ల ప్రజలకు చెందిన సంపదను కార్పొరేట్లకు పంచి పెడుతూ ప్రజలను పేదలుగా మార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ఆస్తులు ఒక్కరిద్దరికి కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశ సంపద ప్రజలకు చెందాలన్నారు. కాంగ్రెస్ ప్రజల కోసం పని చేసిందని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మన దేశం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పాదయాత్ర చేశారని చెప్పారు. హిండెన్‌బర్గ్‌లో వచ్చిన కథనం ప్రపంచాన్ని షేక్ చేసిందని గుర్తు చేశారు. ఈ దేశం నుంచి మోడీని వదిలించుకోవాలని పిలుపునిచ్చారు. అదానీపై మోడీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తమ పోరాటం ప్రజల కోసం, ఈ దేశ సంపద రక్షణ కోసమని చెప్పారు. అరెస్టు అయిన వారిలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే సీతక్క, కార్యనిర్వాహక అధ్యక్షులు అంజన్‌కుమార్ యాదవ్, మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావిద్, రోహిత్ చౌదరి, జి చిన్నారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లు రవి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, నాయకులు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, దీపక్‌జాన్, సామ రామ్మోహన్‌రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, వెంకట్, శివసేనారెడ్డి, డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల చైర్మెన్లతోపాటు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి ఆడబిడ్డలకు వరం
- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ-గంగాధర : ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరంగా మారిందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పలువురు లబ్దిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం ద్వారా అందే రూ.100116 లు పేదింటి ఆడబిడ్డ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. పేదలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ప్రతి ఆడబిడ్డను ఆదుకునే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు ప్రతి ఇంటా పెన్షన్లను అందిస్తూ అన్ని వర్గాలకు ఆసరాగా ప్రభుత్వం నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కంకణాల రాజగోపాల్ రెడ్డి, సర్పంచులు మేచినేని నవీన్ రావు, మడ్లపల్లి గంగాధర్, కంకణాల విజేందర్ రెడ్డి, వేముల దామోదర్, చంద్రయ్య, నాయకులు వేముల అంజి, రేండు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత సమస్యలను అధ్యయనం చేయాలి
మైత్రి ఛానల్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డి పిలుపు


మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న మైత్రీ ఛానల్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డి

నవతెలంగాణ-గంగాధర: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల స్థితిగతులు, పల్లెల సమస్యలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని మైత్రి ఛానల్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డి పిలుపు నిచ్చారు. గంగాధర మండలం గట్టుభూత్కూరు గ్రామంలో నిర్వహిస్తున్న వికాస్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరంలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలని, విద్యార్థి దశ నుండే గ్రామాల్లో సమస్యలను అధ్యయనం చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థులకు ఎప్పుడు ఏ సహకారం కావాలన్నా ముందుంటానని, జాతీయ సేవా పథకం కార్యక్రమానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప గుడిని ఆయన సందర్శించారు. జిల్లాలోనే సుందరమైన బీరప్ప స్వామి గుడి నిర్మాణాన్ని చేపట్టారని సర్పంచ్ కంకణాల విజేందర్ రెడ్డిని అభినందించారు. గ్రామాల్లో ఇటువంటి ఆలయాల నిర్మాణం, ఒగ్గు కళాకారులకు చేయూతనిస్తూ సంస్కృతిని కాపాడాలని సూచించారు. బీరప్ప గుడి నిర్మాణానికి రూ.50116లు విరాళంగా ఇచ్చి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. గ్రామంలో ఇటీవల మరణించిన కాసారపు బుచ్చి రాములు కుటుంబాన్ని పరామర్శించి ఆయన కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంకణాల విజేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, వివిధ కుల సంఘాల పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి
మండల వైద్యాధికారి డాక్టర్ రమేష్


కంటి పరీక్ష చేసుకుంటున్న సర్పంచ కోల రమేష్

నవతెలంగాణ-రామడుగు: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి రమేష్ అన్నారు. మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలో సర్పంచు కోల రమేష్ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసి వంచ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దృష్టి లోపాల నివారణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కంటి వెలుగు శిబిరాన్ని గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాడుగుల రత్నాకర్ రెడ్డి, ఎమ్వో ప్రత్యూష, కంటి వెలుగు సూపర్వైజర్ జక్కుల జగన్, హెల్త్ సూపర్ వైజర్ సీహెచ్ ఆనందం, అప్తమాట్రిస్ట్ అనూష, ఏఎన్ఎమ్ అరుణ కుమారి, విష్ణుప్రియ, ఆశాలు సునీత, లత పాల్గొన్నారు.

వర్షపు నీటిని వృధా చేయొద్దు
- ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న బత్తుల లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-చొప్పదండి: వర్షపు నీటిని వృధా చేయకుండా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని గుమ్లాపూర్ ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో బుధవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో క్యాచ్ ది రైన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వాటర్ ట్యాంకులు నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పిడి సౌజన్య, పంచాయతీ కార్యదర్శి రాజు, నవతరం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అను, కారిసాయి కృష్ణ, బొడిగె శ్రావణ్, గంగు సంపత్ పాల్గొన్నారు.

మహిళా పొదుపు సంఘం
24వ వార్షిక మహాసభ



నవతెలంగాణ-శంకరపట్నం: మండల కేంద్రంలోని కేశవపట్నం గ్రామంలో బుధవారం మహిళా సంఘం అధ్యక్షురాలు గోదారి ఉమ ఆధ్వర్యంలో శ్రీ కేశవ మహిళా పొదుపు సంఘం 24వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ మహాసభ కి ముఖ్య అతిథిగా మహిళా సంఘాల పొదుపు సమితి మండల అధ్యక్షురాలు బక్కి సునీత హాజరయ్యారు. కార్యక్రమంలో పొదుపు సంఘం పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు ఘన సన్మానం
- బావుసింగ్‌కు వీడ్కోలు
- అనంతరెడ్డికి స్వాగతం


తహసీల్దార్ వి.అనంతరెడ్డి

నవతెలంగాణ-గన్నేరువరం: బదిలీపై సైదాపూర్ మండలానికి వెళుతున్న తహసీల్దార్ ఇస్లావత్ బావు సింగ్‌ను, గంగాధర మండలం నుండి గన్నేరువరం బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన నూతన తహసీల్దార్ వి.అనంతరెడ్డిని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుడాల శ్రీనివాస్, జిల్లా ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు పాశం ఎల్లయ్యల ఆధ్వర్యంలో మండల ప్రెస్ క్లబ్ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. బావు సింగ్‌కు వీడ్కోలు పలికి, నూతన తహసీల్దార్ అనంతరెడ్డికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు బూర తిరుపతి, ఓరగంటి సంపత్, విభూతి వీరకుమార్, జాలి నరేష్ రెడ్డి, ఒడ్నాల తిరుపతి, భీమనాతి వెంకటేశం, గుడాల సాయి చందు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7400

నవతెలంగాణ-జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం కాటన్ విడి పత్తి 1293 క్వింటాళ్లు 93 వాహనాలను రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ట ధర రూ.7400, మోడల్ ధర రూ.7200, కనిష్ట ధర రూ.6600 పలికింది. అలాగే కాటన్ బ్యాగ్స్‌లలో 26 క్వింటాళ్లు 15 మంది రైతులు విక్రయానికి తీసుకు రాగా గరిష్ట ధర రూ.7000, మోడల్ ధర రూ.6700, కనిష్ట ధర రూ.6000 పలికిందని మార్కెట్ సెక్రటరీ గుగులోతు రెడ్డి తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీతో ఫ్లిప్కార్ట్ అవగాహన ఒప్పందం

ఫ్లిప్కార్ట్ ఇండియా ఇప్పుడు ఓ అవగాహన ఒప్పందాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీతో చేసుకుంది. ఫ్లిప్కార్ట్ సమర్థ కృషి కార్యక్రమంలో భాగంగా ఈ ఒప్పందం చేసుకున్నారు. ఈ అవగాహన ఒప్పందాన్ని విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 వద్ద గౌరవనీయ వ్యవసాయ మరియు సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామాత్యులు శ్రీ కాకాణి గోవర్ధన్ రెడ్డిబీ మార్కెటింగ్ మరియు సహకార శాఖల ముఖ్య కార్యదర్శి చిరంజీవ్ చౌదరి, ఐఎఫ్ఎస్ మరియు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎల్ శ్రీధర్ రెడ్డి సమక్షంలో చేసుకున్నారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా, ఫ్లిప్కార్ట్ ఇండియా మరింతగా రైతులతో వర్చువల్ మరియు ఈ వాస్తవ శిక్షణా కార్యక్రమాలు అందించడం ద్వారా అనుసంధానించబడటంతో పాటుగా నాణ్యత, ధర పట్ల అవగాహన, ఎఫీపీఓ వ్యవస్థలో భాగం అయ్యేందుకు అవసరమైన లైసెన్సింగ్ గురించి సైతం తెలుపుతుంది. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమైన, స్థానిక రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం ద్వారా వ్యవసాయ రంగాన్ని మెరుగుపరచడానికి అనుగుణంగా ఉంటుంది.

సొంత జాగాలో ఇంటి నిర్మాణం

- గృహలక్ష్మి పథకంతో నెరవేరనున్న సొంతింటి కల
- వందల కొద్ది దరఖాస్తులు
- నియోజక వర్గంలో మూడువేల మంది నిరుపేదలకు లబ్ధి



నవతెలంగాణ-రామడుగు: సొంత జాగా ఉన్న నిరుపేదల ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం మూడు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేసి నిరుపేదల సొంతింటి నిర్మాణం కల నెరవేర్చేందుకు సీఎం కేసీఆర్ కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోన్న ఈ ప్రతిష్టాత్మక పథకానికి గృహలక్ష్మి అని నామకరణం చేశారు. ఈ పథకాన్ని గతేడాదే ప్రకటించినా అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు ఎన్నికలకు ముందు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇండ్లు లేని నిరుపేద కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే గ్రామాల్లో ఇండ్లు లేని, సొంత జాగా ఉన్న నిరుపేద కుటుంబాలు ఆధార్, రేషన్ తదితర ధృవీకరణ పత్రాలను స్థానిక ప్రజా ప్రతినిధులకు అంద జేస్తున్నారు. అదే విధంగా సొంత జాగా ఉండి ఇండ్లు లేని వారికి మొదటి ప్రాధాన్యమిస్తూ, సొంత జాగాలో పెంకుటిల్లు, శిథిలావస్తలో ఉన్న నిరుపేదలకు మొదటి విడతలో ఇచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకైతే ఎలాంటి దిశా నిర్దేశాలు రాకున్నా ధృవీకరణ పత్రాలు తీసుకోవడంతో నిరుపేద కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఇందిరమ్మ పథకంలో భాగంగా లబ్ధి పొందిన వారి కుటుంబాలకు మూడు లక్షల పథకం వర్తించబోదనే నియమ నిబంధనలున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ గ్రామాల్లో వందల కొద్ది దరఖాస్తులు రావడంతో లబ్ధిదారుల ఎంపికను ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అర్హులైన నిరుపేదలకే లబ్దిచేకూరేలా ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

పేదల సొంతింటి కల నరవేరుతోంది

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

2014 తర్వాత ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వంలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాం. చొప్పదండి నియోజక వర్గం ప్రగతిపథంలో ముందుంది. నేడు నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సొంత జాగాలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం మూడు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తుంది. దీంతో నియోజక వర్గంలో మూడు వేల మంది నిరుపేదలకు లబ్ధి చేకూరనుంది. అర్హులైన నిరుపేదలను ఎంపిక చేసి పథకం అందేలా చర్యలు తీసుకుంటాం. మా నియోజకవర్గ ప్రజల తరుపున సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

రంజాన్ శాంతియుతంగా జరుపుకోవాలి

మంత్రి గంగుల కమలాకర్


మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ-కరీంనగర్ : ఈనెల 23వ తేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని బీసీ సంక్షేమ పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రంజాన్ సందర్భంగా ఏర్పాట్లపై పోలీసులు, ముస్లిం మత పెద్దలు, విశ్వ హిందూ పరిషత్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రంజాన్‌ను శాంతియుతంగా పండగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల సమయంలో మసీదుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ పనులు చేయాలని, తాగునీరు ఉండేలా చూడాలని, నల్లా నీరు సమయానుసారం సరఫరా చేయాలని, వీధి దీపాలు వెలిగేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని, కరెంటు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. హరీస్ స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు సహకారం అందజేయాలని ఆదేశించారు. రంజాన్ పండుగను పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ముస్లిం మత పెద్దలను కోరారు. సీపీ సుబ్బ రాయుడు మాట్లాడుతూ..ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీస్ శాఖ దృష్టికి తీసుకరావాలని ముస్లిం మత పెద్దలకు సూచించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్లు గరిమ అగర్వాల్ శ్యామ్ ప్రసాద్ లాల్, మున్సిపల్ కమిషనర్ సేవ ఇస్లావత్, పోలీస్, రెవెన్యూ మున్సిపల్ అధికారులు, ఎంఐఎం పార్టీ నాయకులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

ఉన్నది ఒకటే జిందగీ..!

- మారుతున్న ప్రజల జీవన విధానం
- హ్యాపీ లివింగ్‌కి ప్రాధాన్యత
- ఆనందంగా వీకెండ్, హాలిడే ట్రిప్స్



హ్యాపీగా, జాలీగా ఎంజాయ్ చేస్తున్న దశ్యాలు

నవతెలంగాణ-కరీంనగర్ రూరల్: పూట గడిస్తే చాలు అనుకునే వారు కొందరు ఉంటే విలాసవంతమైన జీవితం గడపాలని ఇంకొందరు భావిస్తుంటారు. అయితే కోవిడ్ తర్వాత ప్రజల జీవన విధానంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. పేద మధ్యతరగతి తేడా లేకుండా అందరి ఆలోచన తీరులోనూ జీవన విధానంలోనూ మార్పు వచ్చింది. గతంలో కష్టపడి డబ్బులు సంపాదించి పొదుపు చేసుకుని సంతోషాలను చంపుకొని బతికేవారు. కానీ ఇప్పుడు ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియక ఉన్నన్ని రోజులు సంతోషంగా గడపాలని స్నేహితులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్‌తో వీకెండ్ హాలీడే ట్రిప్స్ ప్లాన్ చేస్తూ సంతోషంగా జీవనం కొనసాగిస్తున్నారు. ఉన్నన్ని రోజులు పిల్లలు, బంధువులు, ఫ్రెండ్స్‌తో సంతోషంగా గడపాలనే ధోరణికి వచ్చారు.

బంధాలు బలపడుతూ.. ఒత్తిడిని దూరం చేస్తూ..

కరీంనగర్ మెడికల్ ఎడ్యుకేషన్ హబ్‌గా పేరు పొందింది. వ్యాపార రంగంలోనూ నెంబర్ వన్ స్థానంలో ఉంది. వేగవంతమైన జీవన విధానంలో చాలామంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. వివిధ ఆందోళనలతో కుంగుబాటుకు గురవుతున్నారు. అప్పటివరకు అందరితో సరదాగా ఉండి ఒక్క క్షణంలో ఏం జరుగుతుందో తెలియక అయోమయానికి గురవుతున్నారు. వీకెండ్స్ కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడుపుతూ పలువురు మానసిక ప్రశాంతతను పొందుతున్నారు. పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతున్నారు. వారితో ఆడుతూ పాడుతూ వారి సంతోషంలో భాగమవుతున్నారు. ఒక టూరు వెళ్లి వచ్చిన తర్వాత మాటలు అనుబంధాల్లో చాలా మార్పులు ఉంటున్నాయి. మళ్లీ ఎప్పుడెప్పుడు బయటికి వెళ్లాలా, ఎక్కడికి వెళ్లాలా అని ప్లాన్ చేసుకుంటున్నారు.

మారిన జీవనశైలి..

కరోనా తర్వాత ప్రజల జీవన విధానంలో చాలా మార్పులు ఏర్పడ్డాయి. ఎంజాయ్ చేద్దాం.. ఆ తర్వాత దాచుకుందాం అనే ధోరణికి వచ్చారు. సామన్య, మధ్యతరగతి ప్రజలు వారంలో ఒక్కసారైనా స్నేహితులతో కలిసి బయటికి వెళ్తూ ఎంజాయ్ చేస్తున్నారు. మంచి ఆహారం, దుస్తులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏడాదిలో ఒక్కసారైనా ఫ్యామిలీ టూరుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ఇవన్నీ ప్రజల జీవన విధానంలో మార్పులు సూచిస్తున్నాయి.

లైఫ్‌ను హ్యాపీగా గడపాలి

- అనుమండ్ల రామస్వామి: కరీంనగర్



కోవిడ్ తర్వాత మా ఆలోచన మారింది. లైఫ్ చాలా చిన్నదని తెలిసింది. ఇప్పటి లైఫ్ స్టైల్‌లో ఒత్తిడితో ఎప్పుడు ఉంటామో, లేదో తెలియదు. అందుకే ఉన్న లైఫ్‌ను హ్యాపీగా గడపాలి. ఫ్రెండ్స్‌తో ట్రిప్‌కు వెళ్తున్నాం. బయటికి వెళ్లడం వల్ల ఫ్యామిలీ రిలేషన్స్, ఫ్రెండ్షిప్ మరింత బలపడతాయి.

టూర్లకు వెళ్తున్నాం..

- వేముల శివ: కరీంనగర్



గతంలో డబ్బులు ఖర్చు చేయకుండా దాచుకోవాలనిపించేది. ఇప్పుడు హ్యాపీగా ఉండేందుకు ఖర్చు చేసి మిగిలింది దాచుకోవాలనే ధోరణికి వచ్చాం. ప్రతి వీకెండ్ పిల్లలతో బయటకు వెళ్లి ఎంజాయ్ చేస్తున్నాం. ఫ్రెండ్స్‌తో, ఫ్యామిలీ రిలేషన్స్‌తో బయట ప్రదేశాలకు వెళ్తున్నాం.

మానసిక ప్రశాంతత దొరుకుతుంది

- ముత్తు కుమార్: కరీంనగర్



ఉరుకుల పరుగుల జీవితంలో ఫ్యామిలీస్‌తో, ఫ్రెండ్స్‌తో టూర్లకు వెళ్లడం వల్ల మానసిక ప్రశాంతత దొరుకుతుంది. అందరం కలిసి ఒకే చోట ఆనందంగా గడపడం ద్వారా ఒత్తిడి దూరమవుతుంది. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఒత్తిడిని దూరం చేసుకుని మానసికంగా ప్రశాంతంగా ఉండటం చాలా అవసరం.

సీపీఆర్ విధానంపై శిక్షణలు


మాట్లాడుతున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు

నవతెలంగాణ-కరీంనగర్ క్రైం: ఆకస్మిక గుండెపోట్లతో ఈ మధ్య సంభవిస్తున్న మరణాలను తగ్గించేందుకు సీపీఆర్ (హృదయ శ్వాసకోశ పునర్జీవన చర్య) శిక్షణలు దోహదపడుతాయని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు అన్నారు. ఆకస్మిక గుండెపోట్ల నుండి ప్రజలను రక్షించేందుకు అన్ని స్థాయిలకు చెందిన పోలీసులకు శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో మెడికవర్ ఆసుపత్రి వారి సహకారంతో బుధవారం ట్రాఫిక్ పోలీసులకు సీపీఆర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు అక్షయ్, హర్షితలు సీపీఆర్ విధానంపై పోలీసులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం వైద్యులు కమిషనర్ తో పాటు ఉన్నతాధికారులు, అన్ని స్థాయిలకు చెందిన పోలీసులతో సీపీఆర్ విధానాన్ని చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆకస్మిక గుండెపోట్లు సంభవించిన సందర్భాల్లో సీపీఆర్ విధానం ద్వారా గుండెకు రక్తప్రసరణ అందడం, నోటి ద్వారా ఆక్సిజన్ అందించడం వల్ల గుండె పని చేయడం ప్రారంభించి ప్రమాదానికి గురైన వారిని రక్షించవచ్చని తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉండే పోలీసులకు ఆకస్మిక గుండెపోట్లు సంభవించిన వ్యక్తులు తారసపడే అవకాశం ఉన్నందున, అన్ని స్థాయిలకు చెందిన పోలీసులు పూర్తిస్థాయిలో శిక్షణ పొందినట్లయితే అలాంటి వ్యక్తుల ప్రాణాలను రక్షించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు ఎస్.శ్రీనివాస్ (శాంతిభద్రతలు), జి.చంద్రమోహన్ (పరిపాలన), ఏసీపీలు బి.విజయ్ కుమార్, సి.ప్రతాప్, మెడికవర్ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి గుర్రం కిరణ్, అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు తిరుమల్, నాగార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిచ్చే వాహనాల యజమానులపై కేసులు నమోదు: మైనర్లు వాహనాలు నడిపి ఏవైనా ప్రమాదాలకు పాల్పడినట్లయితే సదరు వాహనాల యజమానులు, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు అన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలను పాటించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలకు అన్ని వర్గాలకు చెందిన ప్రజలు సహకారం అందిస్తూ రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగస్వాములు కావాలని కోరారు.

క్రీడలతో ఆరోగ్యవంతమైన జీవితం
బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు


మాట్లాడుతున్న సంపత్ రావు

నవతెలంగాణ-జమ్మికుంట: ఖేలో కరీంనగర్ జీతో కరీంనగర్ పేరిట కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జరుగుతున్న క్రీడోత్సవాల్లో భాగంగా హుజురాబాద్ నియోజకవర్గంలో క్రికెట్ పోటీలు బుధవారం ఫైనల్ మ్యాచ్‌తో ముగిసాయి. ఫైనల్‌లో తలపడిన ఇల్లందకుంట జట్టుపైన వీణవంక జట్టు 15 పరుగులతో విజయం సాధించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరికి అవసరమని, ముఖ్యంగా యువత క్రీడల్లో పాల్గొని శారీరక మానసిక ధృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన వీణవంక జట్టును సంపత్ రావు ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో జిల్లా స్థాయిలో రాణించి హుజురాబాద్ నియోజకవర్గానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఓడిన ఇల్లంతకుంట జట్టు కూడా మంచి ప్రతిభ కనబరిచిందని, ఓటమితో కుంగిపోకుండా పట్టుదలతో రాబోయే రోజుల్లో గెలవడం కోసం మరింత శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హుజురాబాద్ నియోజకవర్గం కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్, ఇల్లందకుంట మండల అధ్యక్షులు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, బోగంపాడు సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎండీ షఫీ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి విరాళం



నవతెలంగాణ-జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి గుడి నిర్మాణానికి మద్రిపల్లి రాజయ్య రూ.25,051, పర్లపల్లి బొందయ్య రూ.15,016, వీర్ల రాజేష్ రూ.10,016 లు విరాళం అందించారు. ఈ సందర్భంగా పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బొజ్జం తిరుపతి రెడ్డి, వేల్పుల శ్రీకాంత్, పర్లపల్లి రమేశ్, పర్లపల్లి నాగరాజు, ఉమ్మడి సుదర్శన్, అప్పని రాజు, పోతరాజు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

యోగాలో మెరిసిన సెయింట్ జార్జ్ విద్యార్థులు

నవతెలంగాణ-కొత్తపల్లి: వర్షిని యోగ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ స్పోర్ట్స్ ట్రస్ట్ వారు ఈ నెల శుక్రవారం నిర్వహించిన ఆన్‌లైన్ యోగా కాంపిటీషన్లో సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల సీబీఎస్ విద్యార్థులు పాల్గొని అండర్-10 విభాగంలో అద్వికానాత్ 4వ స్థానం, అండర్-15 విభాగంలో ధృతి 1వ స్థానం, స్మృతిజ 2వ స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్యారడైజ్, సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను వాళ్లకి సహకరించిన తల్లిదండ్రులను, యోగా కోచ్ ప్రదీప్‌ను అభినందించారు.

కాసింపేట గ్రామాన్ని చూసి చాలా నేర్చుకున్నాం
పంచాయతీ కార్యదర్శులు


గామ చర్చలో ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-గన్నేరువరం: స్వచ్ఛభారత్ మిషన్ కింద చేసిన పారిశుధ్య కార్యక్రమంపై కాసింపేట గ్రామాన్ని చూసి చాలా నేర్చుకున్నామని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. పల్లె ప్రగతి, స్వచ్ఛభారత్ మిషన్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు కాసింపేట గ్రామాన్ని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ వీవోఏలు, మండల అధికారులు బుధవారం సందర్శించారు. 8 టీములుగా ఏర్పడి ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేపట్టారు. సర్వే లో మరుగుదొడ్ల వినియోగం, పరిశుభ్రత, ఇంకుడు గుంతలు, శానిటేషన్ ప్యాడ్స్‌కు ప్రత్యేక నిర్మాణం, ప్రతి ఇంటి ఆవరణలో పూల మొక్కలు, కూరగాయల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలందరూ అవగాహన కలిగిఉండడంతో పాటు ఆచరించడం బాగా నచ్చిందన్నారు. అనంతరం అధికారులతో చర్చలో పాల్గొని వివిధ అంశాలపై తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంప మల్లేశ్వరి వెంకన్న, యూనిసెఫ్ జిల్లా సమన్వయకర్త కిషన్ స్వామి, ఎంపీడీవో నరసింహా రెడ్డి, ఉప సర్పంచ్ బద్ధం సంపత్ రెడ్డి, యూనిసెఫ్ జిల్లా అధికారులు సతీష్, రమేష్, ఐకేపీ ఏపీఎం లావణ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇశ్రాత్, సుల్తానియా, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలు, అంగన్వాడీ టీచర్లు, సీఏలు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వాలి
ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి


కార్డ్స్ రిలీజ్ చేస్తున్న అధ్యక్షుడు పున్నం రవి

నవతెలంగాణ-కరీంనగర్: లారీ డ్రైవర్లకు కనీస వేతనం రూ.26,000లు ఇవ్వాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్ పట్టణ లారీ డ్రైవర్స్ యూనియన్ కార్డ్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో లారీ యజమానుల వద్ద దాదాపు 10-20 సంవత్సరాల నుంచి లారీ డ్రైవర్లు పనిచేస్తున్నా అతి తక్కువ జీతాలు చెల్లిస్తూ వారి శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం నియమ నిబంధనలు పాటించాలని, అందరూ సంఘంలో చేరి యూనియన్ కార్డ్స్ తీసుకోవాలని, టెంపరరీ డ్రైవర్లకు 1000-1200 చెల్లించాలని కోరారు. రాబోయే రోజుల్లో డ్రైవర్ల హక్కుల కోసం అన్ని రకాల డ్రైవర్లను ఏకతాటికి పైకి తెచ్చి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కనీస వేతనం జీవో 25ను గెజిట్ చేసి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎంకే ఆరిఫ్, ఎండీ హబీబ్, ఎండీ అఫ్జల్, ఎండీ కాసిం, కే.నర్సిరెడ్డి, ఎస్‌కే గౌస్, జి.సంపత్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **PALLE SHRAVAN KUMAR,** (Old Name), S/o. Rajaiah, R/o. H.No. 9-80, Upparapalli Village, Odela Mandal, Peddapalli Dist., Telangana State. Have changed my name as **PALLE SHRAVAN (New Name),** here after my name known as **PALLE SHRAVAN (New Name),** S/o. Rajaiah.

Date : 15-03-2023 Place : PEDDAPALLI

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT ADILABAD

ARB No. 142 / 2020.

Between:-
M/s. Shriram chits Pvt Ltd., Branch: Nirmal.
..... DISPUTANT

Thoviti Krishna Chaitanya & Others
.....OPPONENTS

OP.NO.1 Thoviti Krishna Chaitanya, S/o Shankaraiah, Occ: Business, R/o H.No. 6-1-98, Ashoknagar, Karimnagar, Dist: karimnagar.
OP.NO.3 Ceegiri Anil Kumar, S/o Narayana, Office of United India insurance Co. Ltd., Jagityal, R/o. H.No. 10-04-6991, Subhashnagar, Karimnagar.
OP.NO.5 Thoviti Shanthi, W/o Krishna Chaitanya, Occ: Business, R/o H.No. 6-1-98, Ashoknagar, Karimnagar, Dist: Karimnagar.

NOTICE

WHEREAS the Disputant M/s. Shriram chits Pvt Ltd Company, in the above dispute has instituted the above dispute for recovery of money of **Rs.13,09,918/-** and the same is posted for your appearance in the above said Tribunal on **01/04/2023** at 11:00 A.M If you failed to attend the said Tribunal on the said date the matter will be heard and decided ex-parte.

// By Order of the Deputy Registrar of Chits, Adilabad //
M/s. Shriram chits Pvt. Ltd., Branch : Nirmal.
Rep by its: Foreman.

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE :: AT KARIMNAGAR
O.S. No. 220 OF 2023

BETWEEN:
1] Jangapelli Pedda Laxmi
2] Jangapelli Ashok
2] Jangapelli Janardhan
...Plaintiffs

AND

1] Kaligeti @Jangapelli Kavitha
2] The Tahsildar, Kothapally (H) Mandal, Karimnagar district
2] To whom so ever it may concern
... Defendants

To
D-1] Kaligeti @ Jangapelli Kavitha, W/o Laxman, D/o late Jangapelli Mallaiah, R/o Koratapally village of Ramadugu mandal, Karimnagar district
D-2] The Tahsildar, Kothapally (H) Mandal, Karimnagar district
D-3] To whom so ever it may concern

WHEREAS the above named Plaintiffs have filed the **suit for Declaration of Legal heirs of late Jangapelli Mallaiah, S/o Ashaiah who died on 31-5-2017**

If you or anybody having any objection regarding said Declaration they may directed to appear and file written statement, if any? You are directed to appear in person or through pleader before the aforementioned court on **03-04-2023 at 10:30 a.m.** In case of making default the matter will be heard and determined according to law.

// By order of the Court //
Sd/-
T.RAGHUVEER
Advocate for Plaintiffs
H.No: 7-2-902 Mankammathota, KARIMNAGAR Cell: 9849353138.

పేపర్ లీకేజీ ప్రభుత్వ వైఫల్యం

- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- వేములవాడ కాంగ్రెస్ పార్టీ

ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్


మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

నవతెలంగాణ-కథలాపూర్

టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నాపత్రం లీకు కారణం ప్రభుత్వ వైఫల్యమే అని వేములవాడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. లక్షలాది మంది యువకుల జీవితాల తో ముడిపడి ఉన్న ఈ అంశాన్ని కేసీఆర్ తెలిసి కొట్టి పారేయడం సిగ్గు చేటని విమర్శించారు. కింది స్థాయి ఉద్యోగులను మాత్రమే బాధ్యులను చేసి చేతులు దులుపుకుంటున్నారని, ఈ లీకేజీ వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. ప్రశ్న పత్రాలు నోటిఫికేషన్లు లీకేజీతో కాలయాపన చేస్తూ నిరుద్యోగుల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. ఈ వ్యవహారంలో అధికార ప్రభుత్వం పాత్ర ఉందనే అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు ఎండీ అజీమ్ పీసీసీ సభ్యులు తొట్ల అంజయ్య, ఎంపీటీసీ పులి శిరీష హరిప్రసాద్, చందుర్తి మండల మాజీ జెడ్పీటీసీ లింగారెడ్డి, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షులు ఆకుల సంతోష్, పాల నవీన్, రెళ్ళుల తిరుపతిరెడ్డి, పురు కటుపు తిరుపతిరెడ్డి, శిరిరెడ్డి అనంతరెడ్డి, మాడిసెట్టి అభి లాష్ తదితరులు పాల్గొన్నారు.


పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఎన్నారైలు

భోగ శ్రావణిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్నారై సెల్ గల్ఫ్ మిడిల్ ఈస్ట్ కన్వీనర్

నవతెలంగాణ-జగిత్యాల

బీజేపీ ఎన్నారై సెల్ గల్ఫ్ మిడిల్ ఈస్ట్ కన్వీనర్ డాక్టర్ నరేంద్ర పన్నీరు బుధవారం జగిత్యాల మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ డాక్టర్ భోగ శ్రావణిని మర్యాద పూర్వకంగా ఆమె స్వగృహంలో కలిశారు. ఈ కార్యక్రమంలో బీర్పూర్ మండల ఓబీసీ మోర్చ అధ్యక్షులు బసవరాజుల సంతోష్, చందుర్తి మండల బీజేపీ ఉపాధ్యక్షుడు వంకాయల కార్తీక్, చందుర్తి మండల బీజేవైఎం అధ్యక్షుడు అంబల శ్రీకాంత్, బీజేపీ కార్యకర్తలు రాజన్న, విఎస్ఎస్ శ్రీను పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ



నవతెలంగాణ - కోరుట్ల

పట్టణంలోని కేరళ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చరణ్ ఇటీవల వేములవాడలో జరిగిన కరాటే పోటీల్లో కటాస్‌లో గోల్డ్ మెడల్, ఫైటింగ్‌లో బ్రౌంజ్ మెడల్ సాధించాడు. విద్యార్థి దశ నుంచి ఆటలలో నైపుణ్యం సంపాదిస్తూ శారీరక వ్యాయామం చేయాలని ప్రిన్సిపాల్ సూచించారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలి

- డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు

నవతెలంగాణ-కరీంనగర్:

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శులు తిరుపతి, రజనీకాంత్ డిమాండ్ చేశారు. నిందితులపై చర్యలు తీసుకొని నిర్లక్ష్యంగా వ్యవహరించిన చైర్మన్, కార్య దర్శిని తక్షణమే విధుల నుంచి తొలగించాలన్నారు. నగరంలోని స్థానిక తెలంగాణ చౌక్‌లో ఉద్యోగ నియామకాల్లో వెబ్‌సైట్ హ్యాకింగ్ మాస్ కాపీయింగ్‌కు నిరసనగా టీఎస్‌పీఎస్సీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి దిష్టిబొమ్మలు దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహిస్తూ బాధ్యులపై కఠిన మైన చర్యలు తీసుకో వాలని, నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమా లకు పాల్పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకో వాలని ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.నరేష్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షుడు జి.లక్ష్మి నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరవింద్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, శివ, అనిల్, రాజేష్, రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పరీక్షా కేంద్రం తనిఖీ


పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్ భాష

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇంటర్ బోర్డు ఎగ్జామ్‌లో భాగంగా ఎస్‌కెఎన్ఆర్, శ్రీచైతన్య కాలేజీ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాధురి, ఇంటర్ బోర్డు జిల్లా అధికారి, తహసీల్దార్ పాల్గొన్నారు.

వరి పంటను సందర్శించిన శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-కోరుట్ల


పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మండలంలోని అయిలాపూర్ గ్రామంలో పొలాన్ని, రుద్రూర్ కృష్ణ విజ్ఞాన కేంద్రం, నిజామాబాద్ శాస్త్ర వేత్తలు, కోరుట్ల వ్యవసాయ అధికా రులు వరి పొలాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవ సాయాధికారి నాగరాజు మాట్లా డుతూ.. వరి పంటపూత దశలో సల్ఫేట్ దుష్ప్రభావానికి గురైనట్లు గమనించి దానిని నివారణ మొక్క వేర్లకు గాలి తగిలే విధంగా మురుగు నీటిని తీసి, కొత్తగా నీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాధ సందయ్య, శాస్త్రవేత్తలు డాక్టర్ బి. శ్రీనివాస్, డాక్టర్ ఎస్ బలరాం, డాక్టర్ ఎమ్. సురేష్, కోరుట్ల మండల వ్యవసాయ అధికారి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పని దినాలు పెంచాలి

కవ్వంపల్లి అజయ్

నవతెలంగాణ-కరీంనగర్:

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు రోజు కూలీ రూ.600లు ఇవ్వాలని, పని దినాలు పెంచాలని జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్ పట్టణంలోని స్థానిక ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తోందని, దీన్ని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000లు, పేద మధ్య తరగతి రైతులకు కేంద్ర ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను, విద్యుత్ సవరణ (2022) బిల్లును రద్దు చేయాలని, అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, జాతీయ ఉపాధి హామీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా దేశంలో అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలను, రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలని అఖిల భారత సంఘాల పిలుపు లో భాగంగా రాష్ట్రంలో సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న జరిగే 'చలో ఢిల్లీ'కి ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాల ని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి శంకర్, జిల్లా కమిటీ సభ్యులు జిట్టవేని మల్లయ్య, కొమ్మగుల బాబు, కవిరే పవన్ కుమార్, గజ్జెల శ్రీహరి, ఆరెల్లి చెంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కవ్వంపల్లి అజయ్

బోనమెత్తిన మున్సిపల్ చైర్ పర్సన్


బోనం ఎత్తుకుని వెళ్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య

నవతెలంగాణ-కోరుట్ల :

పట్టణంలోని రేణుక ఎల్లమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అనిల్ బోనం ఎత్తికొని మొక్కు తీర్చుకున్నారు. అమ్మవారికి ముగ్గులు వేసి బోనాలు తీశారు. గీత కార్మికులు తాటి చెట్టు చెక్కి విన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్, ప్రభాకర్, గౌడప్ప, గంగాధర్ గీత కార్మికులు కుటుంబాలు పాల్గొన్నారు.

పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలి


కార్మికులతో సమావేశమైన కమిషనర్

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బుధవారం పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. పనుల పట్ల నిర్లక్ష్యం వీడాలని పారిశుధ్యపనుల ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని వారికి సూచించారు. పారిశుధ్య సిబ్బంది వారికి కేటాయించిన వార్డుల్లో మురుగు కాల్వలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లు ఎప్పటికప్పుడు గృహ యజమానుల ద్వారా చెత్త సేకరించి డంపింగ్ తరలించాలన్నారు. ప్రజల నుంచి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి తీసుకోవాలని, విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ గుర్రం రత్నాకర్, ముజీబ్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగు పరీక్షలకు ప్రజల మొబిలైజేషన్‌లో నిర్లక్ష్యం వద్దు

- ఏ ఒక్కరూ మిస్ కావొద్దు
- అర్హులందరికీ కంటి పరీక్షలు నిర్వహించాలి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

కంటి వెలుగు పరీక్షలను ప్రజలందరూ చేసుకునేలా వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని హెచ్చరి ంచారు. జగిత్యాల పట్టణంలో ఎంపీడీవో కార్యా లయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో కంటి వెలుగు శిబిరంలో పరీక్షల కోసం ఒకే ఒక్కరూ మాత్రమే ఉండడంతో అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దృష్టి సమస్యలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టా త్మకంగా కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తుంటే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం వహించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని అర్హులు అందరూ కంటి వెలుగు శిబిరాల్లో కంటి పరీక్షలు చేసుకునేలా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చూపాలన్నారు.


మాట్లాడుతున్న జగిత్యాల కలెక్టర్

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు సన్మానం


పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ బృందం

నవతెలంగాణ-కరీంనగర్

నూతనంగా నియమితులైన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిట రింగ్ కమిటీ సభ్యులను బుధవారం కరీంనగర్ పట్టణంలో మాదిగ రాజకీయ పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మేడి మహేష్, దీకొండ కుల్దీప్ వర్మ, ఎలుక ఆంజనేయులు, లకావత్ రవి నాయక్‌లను మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మాతంగి రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాలిపెల్లి శ్రీనివాస్ మాదిగ, సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం పుష్ప గుచ్ఛం అందజేశారు. పీడిత వర్గాలకు జరుగు తున్న అన్యాయాలపై, బాధి తులకు న్యాయం చేసేలా పని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నరేందర్, రాజు, మహేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇచ్చిన మాట తప్పిన ఎమ్మెల్యే

ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఆకుల సంతోష్


మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు సంతోష్

నవతెలంగాణ-కథలాపూర్

ఎన్నికల ముందు మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలకు వెళ్లే దారిలో సీసీ రోడ్డు వేస్తామని మాట ఇచ్చిన ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ మాట తప్పారని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఆకుల సంతోష్ అన్నారు. కానీ ఇంత వరకు పనులు పూర్తి కాలేదని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని ఎమ్మెల్యే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవ్వాజి చరణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ముదాం శేఖర్, సోషల్ మీడియా పాల నవీన్, జాప మధు, నరేష్, ఎజీబీ వినయ్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ఆశీర్వాదం ఆయుష్మాన్ భారత్

బీజేపీ రాష్ట్ర నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

పేదల ఆరోగ్యానికి ఆశీర్వాదం ఆయుష్మాన్ భారత్ అని బీజేపీ రాష్ట్ర నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్‌తో దేశంలోనే ప్రతి పేద కుటుంబానికి భరోసా ఉంటుందని అన్నారు. జగిత్యాల పట్టణంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆయుష్మాన్ భారత్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ఆయుష్మాన్ భరత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకంగా గుర్తింపు పొంది ందని, ప్రతి పేదవాడి కుటుంబాన్ని అనారోగ్యం నుండి రక్షించాలన్నదే నరేంద్రమోడి సంకల్పం దేశ పేద ప్రజలకు ఆరోగ్య బీమాలో భాగంగా ఆయుష్మాన్ భారత్‌ను ప్రవేశ పెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఏసీఎస్ రాజు, బీటి చంద్రశేఖరరావు, మడిశెట్టి మల్లేశం, నారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, బడే శంకర్, కసరపు, శ్రీనివాస్, కురుమాచలం సతీష్, విట్టు పులి శ్రీధర్, పురళ్ళ ప్రశాంత్, ఎడ్ల సురేష్, పిల్లి బాబు, ప్రసాద్, మారుతి,చుక్క అశోక్, కమలాకర్, రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముదుగంటి రవీందర్‌రెడ్డి

పౌష్టికాహారం పంపిణీ



మాట్లాడుతున్న వైద్యాధికారులు

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని ఐఎంఏ ఆధ్వర్యంలో 50 మంది క్షయ రోగులకు పౌష్టి కాహారం అందజేశారు. ముఖ్యఅతిథులుగా జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్, జిల్లా క్షయ నివారణ అధికారి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. క్షయ వ్యాధి గ్రస్తులకు పట్టణ ఐఎంఏ డాక్టర్ల అసోసియేషన్ పంపిణీ చేయడం అభినం దనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ అనూప్‌రావు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రేగొండ రవీందర్, డాక్టర్లు అనిల్, జగదీష్, ఒడ్డాల నరేష్, రవికిరణ్, అన్వేష్, ఇంద్రలీల్, టీబీ కో ఆర్డినేటర్ హరీష్, సూపర్‌వైజర్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన భోగ శ్రావణి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల నియోజకవర్గం కిష్టంపేట గ్రామంలో కట్టెకోల తేజశ్రీ రాజు వివాహ వేడుకకు బీజేపీ నాయకురాలు డాక్టర్. భోగ శ్రావణిప్రవీణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఆమె వెంట రాయికల్ మండల బీజేవైఎం ప్రధాన కార్యదర్శి గాజంగి విష్ణువర్ధన్, గ్రామ బూత్ అధ్యక్షులు ఆడెపు సురేష్, బూత్ అధ్యక్షులు ఆవుల రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షిరాం జయంతి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

బీఎస్పీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షిరామ్ జయంతిని ఇబ్రహీంపట్నం మండలంలోని స్థానిక గాంధీ చౌరస్తా వద్ద బీఎస్పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. హుజురాబాద్ నియోజక వర్గం బీఎస్పీ ఇన్‌చార్జి మారేపల్లి మొగిలయ్య, జిల్లా కన్వీనర్ కవ్వం పల్లి లలిత ఆధ్వర్యంలో కాన్షిరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో హక్కులకు గుర్తింపునకు, జీవన ప్రమాణాలకు దూరంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు న్యాయం జరగాలంటే బహుజన అధికారం వలనే సాధ్యమని చెప్పిన అంబే ద్కర్ సూత్రాన్ని పాటిస్తూ మహనీయుల స్ఫూర్తితో బహుజన రాజ్యాధికారం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహా మనిషి కాన్షిరాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ ప్రధాన కార్య దర్శి రఘుపతి మండల అధ్యక్షుడు మహేందర్ బీఎస్పీ సీని యర్ నాయకుడు మిడిదొడ్డి శ్రీనివాస్, సారథ్రప్వామి, నరసయ్య పలువురు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి:మెట్ పల్లి పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలోని కాన్షిరాం 89వ జయంతి ఘనంగా నిర్వహించారు.బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఆయన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎలా పాటు పడ్డారో గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జ్ కోల రాములు,పట్టణ అధ్యక్షుడు గుగు మంద్రాల ప్రభాకర్, నాయకులు కళ్యాణ్,కిషోర్, అమర్, బద్రి, శ్రీనివాస్,నరేష్, తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటానికి పూలమాలు వేస్తున్న నాయకులు

నూత వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మదన్‌మోహన్

నవతెలంగాణ-జగిత్యాల

సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపెల్లికి చెందిన బీజేపీ నాయకుడు అనిల్ వివాహం పైడిమడుగులో జరుగగా బుధవారం ఆ వివాహానికి బీజేపీ జగిత్యాల అసెంబ్లీ కన్వీనర్ చిలుకమర్రి మదన్‌మోహన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల పట్టణ దళిత మోర్చ అధ్యక్షులు నక్క జీవన్, రాజనర్సయ్య, మజార్ పాల్గొన్నారు.



జిల్లాలో కేంద్రంలో ఇంటర్ పరీక్ష రాసిన వికలాంగుడు

నవతెలంగాణ-జగిత్యాల



జిల్లా కేంద్రంలో జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు రాయికల్ మండలం రాయికల్ పేట్ గ్రామానికి చెందిన మధు అనే వికలాంగుడు హాజరై పరీక్ష రాశాడు. పట్టణంలోని ఆల్ఫోర్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి దివ్యాంగుడు రాగా వికలాంగుడిపై ప్రత్యేక చొరవ తీసుకొని పరీక్ష రాయడానికి కళాశాల సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

నవతెలంగాణ-కోరుట్ల


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న మేనేజర్

ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మి ప్రసన్న ఆధ్వర్యంలో కండక్టర్లకు మజ్జిగ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నం దున ఆర్టీసీ ఉద్యోగులకు ఆరోగ్య పుష్టి శరీర ఉపశ మనం కోసం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరి ంటెండ్ వెంకటేశం, రమేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుమారుడి జ్ఞాపకార్థం దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-మల్యాల

ఆయన జ్ఞాపకార్థం తండ్రి రాములు బుధవారం క్రికెట్ మల్యాల మండలం లోని నూకపల్లి గ్రామానికి చెందిన చెలుమల్ల రాములు కుమా రుడు గత సంవత్సరం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బీఎస్పీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-మెట్‌పల్లి

టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకేజ్ అంశంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఎస్పీ ఆధ్వర్యంలో మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. నిరసించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ.. నిరుద్యోగులు ఎంతో కాలంగా ఉద్యోగాల కోసం అన్ని వదులుకొని నిస్సహాయ అవుతుందే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ లీకేజ్ వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని, దీనిపై ప్రభుత్వం హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరీక్షలన్నీ రద్దు చేయాలని లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలన్నారు. మరోమారు ఉద్యోగ నియామక ప్రక్రియలో అవకతవకలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు కళ్యాణ్, అమర్, కిషోర్,రాములు, ప్రభాకర్, శ్రీనివాస్, నరేష్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందాలను అమలు చేయకుండా ఎన్నికలా?

- ఇది కార్మికులను మరోసారి మోసం చేయడమే
- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల



నవతెలంగాణ-గోదావరిఖని : ఒప్పందాలను అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహించడం కార్మికులను మరోసారి మోసం చేయడమేనని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి అన్నారు. సింగరేణి ఆర్జీ 1 పరిధిలోని జిడికె 1, 3వ ఇంక్లయిన్ ఫిట్ కార్యదర్శి దాసరి సురేష్ అధ్యక్షతన బుధవారం గేట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న మారుపేర్ల మార్పు, మైనింగ్ స్టాఫ్, టెక్నికల్ స్టాఫ్, ఆపరేటర్స్ మెడికల్ అన్ ఫిట్ అయితే సూటబుల్ జాబు ఇవ్వాలని, తదితర సమస్యలపై, ఐదు జాతీయ సంఘాలు గుర్తింపు సంఘంతో జరిగిన ఒప్పందాలను అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహించడం అంటే కార్మికులను మరోసారి మోసం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడ్డదని తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా అన్ని కార్మిక సంఘాలకు కార్మికుల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే యజమాన్యంతో జరిగిన ఒప్పందాలను అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్ళమని తేల్చి చెప్పాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. నిరంతరం కార్మికుల సమస్యలపై పోరాడుతున్న సీఐటీయూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ కార్మిక వ్యతిరేకమైన కోడ్ అఫ్ డిస్ప్లేన్ మార్చాలని, రెండు సంవత్సరాలకే ఎన్నికలు నిర్వహించాలని, రెండు ఓట్ల విధానం కావాలని, గతంలో కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలను తక్షణం అమలు చేయాలని, లేబర్ కమిషన్ ముందు పెట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆరెపల్లి రాజమౌళి, ఎస్‌కె.గౌస్, తోట నరహరి దాసరి సురేష్, సాయికష్ణ, కటు రమేష్, రాంనరసయ్య, సందీప్, కనకయ్య రాయమల్లు, శంకర్, ఇప్పలపల్లి సతీష్ కుమార్ తదితరులున్నారు.

సభ్యత నమోదుతో యూనియన్ బలోపేతం

- పవర్లు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్
- నేటి నుండి సీఐటీయూ ఆధ్వర్యంలో పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ సభ్యత నమోదు ప్రారంభం



మాట్లాడుతున్న మూషం రమేష్

నవతెలంగాణ - సిరిసిల్ల : నేటి నుంచి పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని పవర్లూమ్ వర్కర్స్ అందరూ సీఐటీయూ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యత్వం తీసుకొని బలోపేతానికి కృషి చేయాలని పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ చట్టబద్ధంగా ఉండాలంటే ప్రతి కార్మికుడు యూనియన్‌లో సంఘ సభ్యుడిగా తప్పనిసరిగా చేరాలని అన్నారు. ఈ విషయాన్ని ప్రతి పవర్ లూమ్ కార్మికుడు తమ బాధ్యతగా గుర్తించి తప్పకుండా యూనియన్ల సభ్యత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పవర్ లూమ్ కార్మికుల హక్కుల కోసం, కూలీ పెంపు కోసం, ప్రభుత్వం నుంచి రావాల్సిన యారన్ సబ్సిడీ గురించి ప్రధానంగా పవన్ కార్మికుల ఆత్మ గౌరవంగా బతకాలని కార్మికులను యజమానిగా మార్చాలని పోరాడి వర్కర్ టూ ఓనర్ పథకాల కోసం సీఐటీయూ అనేక పోరాటాలను నిర్వహించి సాధించిందని గుర్తుచేశారు. పవర్లూమ్ కార్మికుల కోసం నిస్వార్థంగా పోరాడుతున్న పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాబోయే కాలంలో కార్మిక హక్కుల కోసం మరింత బలంగా ఉద్యమించేందుకు ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకొని యూనియన్‌కు అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నక్క దేవదాస్, శ్రీపతి మని, కంది మల్లేశం, గడ్డం రాజశేఖర్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలు త్వరగా ప్రారంభించాలి

అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట మండలంలోని హరిదాస్‌నగర్, పదిర గ్రామాలలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలు చేపట్టనున్న స్థలాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్ పరిశీలించారు. డబుల్ బెడ్‌రూం ఇల్ల నిర్మాణాలను త్వరలో ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. ఇండ్ల నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ సరఫరా పూర్తి స్థాయిలో జరిగేలా చూడాలని తహసీల్దార్‌ను, స్థానిక ప్రజాప్రతినిధులను ఆదేశించారు. డబుల్ బెడ్‌రూం లబ్దిదారుల ఎంపికపై గ్రామ సభలు నిర్వహించాలని, గ్రామ సభలో ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు మంజూరు చేసే ప్రక్రియలో గ్రామస్తులతో, లబ్దిదారులకు సమావేశం ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు, మాజీ సెస్ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, తహశీల్దార్ జయంత్ కుమార్, ఆర్‌డిఈ, ఏఈలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

డీపీఆర్‌వో మామిండ్ల దశరథం



సాంస్కృతిక కళాకారులతో డీపీఆర్‌వో

నవతెలంగాణ - సిరిసిల్ల : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్ర స్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులను ఆదేశించారు. బుధవారం సిరిసిల్ల ఐడీఓసీలోని జిల్లా ప్రజా సంబంధాల అధికారి కార్యాలయంలో జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో డీపీఆర్‌ఓ సమావేశం నిర్వహించారు. పేదల ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడాలేని విధంగా పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, దళితబంధు, డబుల్ బెడ్ రూం ఇండ్లు, మిషన్ భగీరథ, మన ఊరు-మనబడి కార్యక్రమం, సాగునీటి ప్రాజెక్టులు, హరితహారం, కేసిఆర్ కిట్, రైతుబంధు, రైతు భీమా కళ్యాణలక్ష్మి, ఆసరా, కంటి వెలుగు వంటి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. పథకాల సమాచారం ప్రజలకు చేరేలా చూడాలన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు నిర్దేశిత షెడ్యూల్‌కు అనుగుణంగా ప్రచారం కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. రోజువారీగా క్షేత్ర స్థాయిలో కళాకారుల చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి గ్రామ పంచాయితీ కార్యాలయం ధ్రువీకరించిన పత్రాలు, ఫోటోలు హైదరాబాద్‌లోని హెడ్ ఆఫీస్ తెలంగాణ సాంస్కృతిక సారథి హెడ్ ఆఫీస్ కార్యాలయానికి, అలాగే జిల్లా ప్రజా సంబంధాల అధికారి కార్యాలయానికి పంపించాలన్నారు.

మంత్రులకు ఘన స్వాగతం



నవతెలంగాణ-గోదావరిఖని: చెన్నూరు నియోజకవర్గం పర్యటన కోసం హెలికాప్టర్లో ఎన్టిపిసి రామగుండం హెలిప్యాడ్‌కు చేరుకున్న మంత్రులు తన్నీరు హరీష్ రావు, ఇంద్రకరణ్ రెడ్డిలకు ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరీ, రామగుండం మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్ పూలబొకేలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఇక్కడి నుండి కాన్వాయ్ ద్వారా చెన్నూరుకు బయలుదేరి వెళ్లారు. అదేవిధంగా ఎన్టీపీసీ పిటిఎస్ జ్యోతి భవన్‌లో పాలకుర్తి జడ్పిటిసి కందుల సంధ్యారాణి పోచం దంపతులు మంత్రులు హరీష్ రావు, ఇంద్రకరణ్ రెడ్డిలకు స్వాగతం పలికారు.

చీఫ్ విప్‌కు ఘన స్వాగతం



నవతెలంగాణ-గోదావరిఖని : శాసనమండలి చీఫ్ విప్‌గా ఎన్నికైన అనంతరం తొలిసారిగా రామగుండంకు వచ్చిన తానిపర్తి భాను ప్రసాద్ రావుకు జడ్పిటిసి కందుల సంధ్యారాణి పోచం దంపతులు బి.పవర్ హౌజ్ గడ్డ వద్ద బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. రామగుండంలో జరిగిన పలు కార్యక్రమాలలో వారితో పాటుగా పాల్గొన్నారు. వారితోపాటు పడాల స్వామి గౌడ్, ఉమర్, హరీష్, బబ్లూ, శ్రీకాంత్, రాకేష్ తదితరులున్నారు.

ఐఎఫ్‌టీయూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - గోదావరిఖని: ఐఎఫ్‌టీయూ జిల్లా 8వ మహాసభల వాల్ పోస్టర్‌ను ఎన్టీపీసీ పిటిఎస్ కంజవెన్స్ కార్మికుల సెక్షన్ వద్ద పెద్దపల్లి జిల్లా కాంట్రాక్ట్ కార్మికుల సంఘం బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రాంచి కార్యదర్శి బుచ్చన్న మాట్లాడుతూ ఈ నెల 18, 19 తేదీలలో రెండు రోజులపాటు ఎన్టీపీసీ టివి గార్డెన్స్ వద్ద ఈ మహాసభలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహాసభలను రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, డి.రమేష్, డి.సత్యం, యం.మొండయ్య, నర్సయ్య, పి.భాగ్యమ్మ, రాజేశ్వరి, లక్ష్మి, ప్రమీల, పోషమ్మ సంధ్య, మంగ, రాధ, విజయలక్ష్మి తదితరులున్నారు.

శాత్రాజ్‌పల్లిని ముత్తారం మండలంలోనే కొనసాగించాలి

కలెక్టర్‌కు మాజీ జడ్పిటిసి, గ్రామస్తుల వినతి



నవతెలంగాణ-ముత్తారం: మండలంలోని శాత్రాజ్ పల్లి గ్రామాన్ని ఎట్టి పరిస్థితుల్లో భూపాలపల్లి జిల్లాలో కలపవద్దని, మండలంలోనే కొనసాగించాలని బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణకు ఆ గ్రామస్తులతో మాజీ జడ్పిటిసి నాగినేని జగన్మోహన్ రావు బుధవారం వినతి పత్రాన్ని సమర్పించారు. గత వారం రోజుల క్రితం ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మానేరు అవతలో ఉన్న శాత్రాజ్‌పల్లి గ్రామాన్ని భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలో కలిపేందుకు రెవెన్యూ అధికారులు సర్వే కోసం గ్రామానికి వచ్చి సర్వే చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారని తెలిఆరు. సర్వే దేనికోసం అని గ్రామస్తులు అడగగా గ్రామంను ముత్తారం మండలంలో మానేరు నది అవతల ఉన్నదని, మీ సౌకర్యం కోసమే భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలో కలిపేందుకు ప్రభుత్వ భూమితో పాటు గ్రామాన్ని సర్వే చేస్తున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారని, దీంతో సర్వే అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు అప్పటినుంచి ఆందోళన చేపడుతున్నారని తెలిపారు. ముత్తారం మండలంలోనే శాత్రాజుపల్లిని ఉంచాలని ఈ సందర్భంగా వినతి ద్వారా కలెక్టర్‌ను కోరారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

పారదర్శకంగా డబుల్ బెడ్ రూం ఇండ్లకేటాయింపు

పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ వి.లక్ష్మీ నారాయణ

నవతెలంగాణ -పెద్దపల్లి : జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ లాటరీ పద్ధతి ద్వారా పూర్తి పారదర్శకంగా చేసినట్లు అదనపు కలెక్టర్ వి. లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక అమర్ చంద్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక డ్రా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి. లక్ష్మీనారాయణ పాల్గొని లబ్ధిదారుల సమక్షంలో కేటగిరీ వారీగా డ్రా తీశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పరిధిలో చందపల్లి, కూనారాం రోడ్డులో నిర్మించిన 484 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేసి అర్హత మేరకు అర్హుల పేర్లతో కూడిన జాబితాను తయారు చేసి మార్చి 4 నుండి 13 వరకు అభ్యంతరాలను స్వీకరించి పూర్తి పారదర్శకంగా ఫైనల్ జాబితాను తయారు చేసినట్లు తెలిపారు. పెద్దపల్లి పరిధిలోని చందపల్లీ, కూనారం రోడ్డులో నిర్మించిన 484 ఇళ్లకు గానుమొత్తం 2079 దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి 1050 మంది అర్హులను ఎంపిక చేశామన్నారు. మిగిలిన 1029 దరఖాస్తులను తిరస్కరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఉన్న సందేహాలను అదనపు కలెక్టర్ నివృత్తి చేస్తూ, ఎంపిక చేసిన జాబితాను ప్రదర్శిస్తామన్నారు. ఇందులో అనర్హులు ఎవరైనా ఉన్నట్లు గుర్తించినట్టైతే అభ్యంతరాలు తెలుపాలని సూచించారు. అనంతరం లబ్ధిదారుల సమక్షంలో అదనపు కలెక్టర్ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు ఓపెన్ క్యాటగిరి లకు సంబంధించి లాటరీ పద్ధతి ద్వారా లబ్దిదారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకట మాధవ రావు, తహసీల్దార్ వెంకట లక్ష్మీ, వార్డ్ కౌన్సిలర్ లు, ఇతర ప్రజాప్రతినిధులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

కాన్సిరాం స్ఫూర్తితో బహుజన రాజ్యం సాధిద్దాం

బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జ్ దాసరి ఉష

నవతెలంగాణ- పెద్దపల్లి : బహుజన సమాజ్ పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్షిరామ్ స్ఫూర్తితో బహుజన రాజ్యం సాధిద్దామని బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష పిలుపునిచ్చారు. కాన్షీనామ్ జయంతి సందర్భంగా బుధవారం పెద్దపల్లి పట్టణంలో ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అయ్యప్ప టెంపుల్, కమాన్ చౌరస్తా మీదుగా ర్యాలీతో జండా చౌరస్తాలోని కాన్షీరాం విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి కాన్సిరాం విగ్రహానికి గజమాల వేసి కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు., ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు గొట్టే రాజు , నియోజకవర్గ ఇన్చార్జ్ దాసరి ఉష హాజరై ఉష మాట్లాడుతూ సమాజంలో హక్కులకు, గుర్తింపునకు, జీవన ప్రమాణాలకు దూరంగా ఉన్న జాతులకు ఎస్సీ, ఎస్టీ ,బీసీ మైనార్టీ వర్గాలకు న్యాయం జరగాలంటే అధికారం వల్లనే సాధ్యమని చెప్పిన అంబేద్కర్ సూత్రాన్ని పాటిస్తూ మహనీయుల స్ఫూర్తితో బహుజన రాజ్యాధికారం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహామనిషి కాన్షిరామ్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో బహుజన రాజ్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హనుమయ్య, జిల్లా ఇంచార్జ్ బాల కళ్యాణ్ పంజా, మొలుమూరి చంద్రశేఖర్, జిల్లా జోనల్ కన్వీనర్ కుమ్మరి సవిత, జిల్లా మహిళా కన్వీనర్ కూరెళ్ల సప్న గౌడ్ ,జిల్లా ఉపాధ్యక్షులు తోట వెంకటేష్ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరికిల్ల రాజనర్సయ్య, కోశాధికారి గడ్డం శేషాద్రి, జిల్లా కార్యదర్శి వరికిల్ల మల్లేశం,జిల్లా కార్యవర్గ సభ్యులు కంపల్లి బాబు, అసెంబ్లీ అధ్యక్షులు బొంకురి దుర్గయ్య, మంథని అసెంబ్లీ ఇంచార్జ్ జనగామ రవికుమార్,ఉపాధ్యక్షులు నార్ల గోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సతురి అనిల్, కోశాధికారి ఎండి రియాజ్, అసెంబ్లీ మహిళా కన్వీనర్ రామిళ్ళ శారద, పెద్దపెల్లి మండల అధ్యక్షులు రాజబాబు సుల్తానాబాద్ మండల అధ్యక్షులు బోయిన్ రంజిత్ సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షులు తోట మధు పాల్గొన్నారు.

నెలాఖరులోగా మన ఊరు-మనబడి' పనులు పూర్తవ్వాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



నవతెలంగాణ - కొనరావుపేట : 'మన ఊరు - మనబడి' కింద మొదటి విడత చేపట్టిన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి హెచ్చరించారు. బుధవారం మండలంలోని ధర్మారం, సుద్దాల గ్రామాల్లో జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతంలోగా మొదటి విడతలో మన ఊరు మనబడి కార్యక్రమం కింద బడుల్లో చేపట్టిన ఎలక్ట్రిసిటీ, తాగునీటి వసతి, ఇతర రిపేర్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద చేసే పనుల్లో మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు ప్రహరీ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. మొదటి విడతలో పనులు పూర్తి అయిన పాఠశాలలకు పేయింటింగ్ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. సుద్దాల గ్రామంలో మిషన్ భగీరథ తాగునీరు స్కూల్‌లతోపాటు ఇండ్లకు రావడం లేదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. చిన్నపాటి మరమ్మతులు చేపడితే స్కూళ్లతోపాటు ఇండ్లకు మిషన్ భగీరథ తాగునీరు అందుతుందన్నారు. స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ నెలాఖరులోగా మిషన్ భగీరథ కింద కనెక్షన్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సంబంధిత ఇంజనీర్‌లను ఆదేశించారు.కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలి జిల్లా కలెక్టర్ మండలంలోని కనగర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఈ గ్రామంలో 724 మందికి పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారులు జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. తొమ్మిది రోజులు కనగర్తి గ్రామంలో క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు. ఆయన వెంట మండల ప్రజా పరిషత్ చైర్ పర్సన్ చంద్రయ్య, జిల్లా విద్యాధికారి రమేష్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీరాములు, ఎంపీడీవో రామకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



పరీక్షా కేంద్రం వద్ద కలెక్టర్

నవతెలంగాణ - సిరిసిల్ల : జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతం వాతావరణంలో ప్రారంభమయ్యాయి. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని సెస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు. కళాశాలలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. నిఘా నేత్రాల ఏర్పాటును, పనితీరును పరిశీలించారు. పరీక్ష జరుగుతున్న తీరు, విద్యార్థుల హాజరు వివరాలు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ జి వనజ కుమారి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. పరీక్షా కేంద్రంలో 198 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 183 మంది హాజరు కాగా, 15 మంది గైర్హాజరు అయ్యారని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ పరీక్షా కేంద్రంలోని రూంలు పరిశీలించి పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలో కల్పించిన ఫర్నిచర్, తాగునీరు, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పెద్దపల్లి జిల్లాలో 5,743 మంది హాజరు

నవతెలంగాణ - పెద్దపల్లి : జిల్లాలో ఇంటర్ పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా జరిగిందని, బుధవారం మొదటి రోజున ఇంటర్ మొదటి సంవత్సరం రెండవ భాష పేపర్ -1 పరీక్ష జరగగా 5743మంది పరీక్షకు హాజరుకాగా, 308 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన నేడొక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 25ఇంటర్ పరీక్షా కేంద్రాలలో జనరల్, వొకేషనల్ కలిపి 6051 మంది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాయాల్సి ఉండగా, 5743 మంది విద్యార్థులు హాజరయ్యారని, జిల్లాలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, ప్రశాంతంగా పరీక్ష జరిగిందని, 308 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. జనరల్ అభ్యర్థులు 4791మందికి గాను 4574 మంది హాజరు కాగా, 217 మంది గైర్హాజరు అయ్యారని, అలాగే వొకేషనల్ 1260 మందికి గాను 1169మంది హాజరు కాగా 91 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని తెలిపారు. మొత్తంగా మొదటి రోజు 94.90 శాతం హాజరయ్యారని తెలిపారు.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతోనే ఇంటర్ పరీక్షా కేంద్రం

నవతెలంగాణ - రుద్రంగి :

వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు ప్రత్యేక చొరవతోనే రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మొదటి సారిగా ఇంటర్ పరీక్షా కేంద్రం మంజూరు అయిందని ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య అన్నారు. రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గతంలో ఇంటర్ పరీక్షలు రాసేందుకు చందుర్తి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి ఇబ్బందులు పడుతుండటంతో ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు ప్రత్యేక చొరవ తీసుకొని రుద్రంగిలో ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని 2020 జూన్‌లో ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ నవీన్ మిట్టల్‌కు వినతిపత్రం అందజేశారన్నారు. రుద్రంగిలో ఇంటర్ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడంపై ఎప్పటికప్పుడు అధికారులలో సమీక్షించారన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే నిధులతో రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం, కళాశాల చూట్టు ప్రహరీ గోడ నిర్మిస్తామని తెలిపారు. విద్యార్థుల సమస్యలను గుర్తించి రుద్రంగిలో ఇంటర్ పరీక్షాకేంద్రం మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే రమేష్ బాబుకు మండల ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో భద్రతా వారోత్సవాలు



నవతెలంగాణ - రామగిరి : సింగరేణిలో 13న ప్రారంభమైన భద్రత వారోత్సవాలు 21వ తేదీ వరకు కొనసాగనున్నాయి. దీనిలో భాగంగా సెంటినరీ కాలనీలోని సివిల్ డిస్ట్రిబ్యూషన్ వద్ద జీఎం ఎపిఎ కె వెంకటేశ్వర్లు ఆర్జి3, ఏపిఏ సివిల్ భద్రతా అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను, పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ సీతారామం,రక్షణ అధికారి సిహెచ్ వెంకట రమణ, ఎస్ఈ సివిల్ పద్మరాజు,డి వైపిఎం కె మారుతి లతో పాటు ఇతర అధికారులు,ఉద్యోగులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని: సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో భద్రతా వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షణ పట్ల అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రామగుండం రీజియన్ జీఎం సేఫ్టీ సాంబయ్య హాజరై రక్షణ పట్ల సివిల్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సింగరేణి వ్యాప్తంగ ఈ నెల 13 నుంచి 21 వరకు ఈ వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి బండి సత్యనారాయణ, డివైఎస్‌సి వసంత్ కుమార్ పాల్గొన్నారు.

విగ్రహాలు ధ్వంసం చేసినవారిని అరెస్టు చేయాలి



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలో రెండు రోజుల కిందట మహాత్మా గాంధీ, నందిశ్వర విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం విడ్డూరమన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి దేవయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజునాయక్, గంట బుచ్చగౌడ్, పందిర్ల శ్రీనివాస్, చెన్ని బాబు, రమేష్, రాజేందర్, నాగరాజు, ప్రశాంత్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు సీఎం కేసీఆర్ కృషి

జెడ్పీటీసీ గట్ల మినయ్య



నవతెలంగాణ - రుద్రంగి

తెలంగాణ రాష్ట్రంలో సంపూర్ణ అంధత్వ నివారణకు సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి కృషి చేస్తున్నారని జడ్పీటీసీ గట్ల మినయ్య అన్నారు. బుధవారం మానాల గ్రామపంచాయతీ కార్యాలయం, ఆవరణలో ఏర్పాటు చేసిన రెండవ విడత కంటి వెలుగు కేంద్రాన్ని వైస్ ఎంపీపీ పిసరి భూమయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగవత్ తిరుపతితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్యాక్స్ చెర్మెన్ ఏలేటి చిన్నారెడ్డి, బాధనవేని రాజారాం, తిక్క భూమన్న, నాయిని రాజేశం, లక్కకుల స్వామి, వైద్య సిబ్బంది పంచాయతీ కార్యదర్శి బాబు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే మహిళలు ఉన్నత స్థానాలకు ఎదుగవచ్చు

ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ రమేష్



నవతెలంగాణ - ముత్తారం: మహిళలు వంటింటికి పరిమితం కాకుండా చిన్నప్పటి నుంచి విద్యలో రాణిస్తే ఉన్నత స్థానాలకు ఎదుగవచ్చని ముత్తారం ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ రమేష్ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం వేడుకలు పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని మహిళా సమైక్య భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. రుణాలను సక్రమంగా చెల్లిస్తూ పొదుపు బాటలో నడుస్తున్న మహిళా సంఘం గ్రూప్ సభ్యులను, విఏవోలను, సీసీలను, ఏపిఎం పద్మను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ బ్యాంక్ సిబ్బందితోపాటు మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇండ్లు కేటాయించాలి

నవతెలంగాణ-గోదావరిఖని : అర్హత కలిగిన నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో రామగుండం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా జిల్లా కన్వీనర్ గుజ్జుల సత్య నారాయణ రెడ్డి, జిల్లా నాయకులు జూపాక శ్రీనివాస్, గుమ్మడి వెంకన్న, తోకల రమేష్, పెండ్యాల రమేష్ హాజరై మాట్లాడారు. మాట్లాడుతూ గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుండి డ్రా నిర్వహించి 160 మంది లబ్దిదారులను ఎంపిక చేసిందని, ఏ ఒక్కరికి కూడా ఇండ్లు కేటాయించలేదన్నారు. అర్హత పొందిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజల పక్షాన పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తీగుట్ల రాములు, వడ్డేపల్లి పోచం, క్రాంతి తదితరులున్నారు.

పరీక్షల పత్రాల లీకేజీకి ప్రభుత్వానిదే నైతిక బాధ్యత

నవతెలంగాణ - గోదావరిఖని : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్సైట్ యాప్ హ్యాకింగ్ కావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఉద్యోగాన్ని నియామక పరీక్షలు లీకేజీ మాస్ కాపీ జరుగుతుందని, దీనికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పివైఎల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేష్ డిమాండ్ చేశారు. అంతర్గాం ప్రజాపంథా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. గుమ్మడి వెంకన్న తీగుట్ల రాములు, కట్ట తేజేశ్వర్, ఓడ్డేపల్లి పోచయ్య, ఉప్పులేటి విజయ్ తదితరులున్నారు.

కొడుకు, కోడలుపై కేసు నమోదు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

వృద్ధాప్యంలో కొడుకు, కోడలు తిండి పెట్టకపోవడంతో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సల్లూరి బాలలక్ష్మి(70) బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ శేఖర్ వివరాల ప్రకారం.. బాలలక్ష్మికి ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. కొడుకు రవీందర్, కోడలు అంజవ్వలు కలిసి ప్రతిరోజు వేధిస్తున్నారని, బాగోగులు చూడడం లేదని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేసి ఆమె కొడుకు, కోడలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పోషించనివారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శేఖర్ హెచ్చరించారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

నవతెలంగాణ - మంథని : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐసిసి కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం మంథనిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీకి కారణమైన వ్యక్తులను గుర్తించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కుంభకోణంపై ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కారకులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ధర లేక పత్తిరైతుల అవస్థలు..

నల్ల పడుతున్న తెల్ల బంగారం
ఇండ్లలో నెలల తరబడి నిల్వ
ఖర్చుల భారంతో సతమతం


రైతు ఇంట్లో నిల్వ ఉన్న పత్తి

నవతెలంగాణ - చందుర్తి

సరైన ధర రాక పత్తి రైతులు అవస్థలు పడుతున్నారు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో పత్తిని కూలీలో తీయించారు. మొదటిసారి తీసిన పత్తి అధిక తేమ ఉండడంతో నవంబర్‌లో కొంతమేర విక్రయించారు. ఆ సమయంలో పత్తి క్వింటాల్‌కు రూ.8,500 ధర వచ్చింది. అదే తరహాలో ధర ఉంటదని రైతులు మిగిలిన పత్తిని ఇండ్లలోనే నిల్వచేశారు. చందుర్తి మండలంలోని 19గ్రామాల్లో 8వేల మంది వరకు రైతులు ఉన్నారు. ఇందులో 3,600 మంది రైతులు పత్తి సాగు చేశారు. ఒక్కొక్క రైతు మూడు నుండి పది ఎకరాల వరకు పత్తి సాగు చేశారు. మొదటి దశలో తీసిన తేమ పత్తిని రూ.8,500 వరకు దళారులకు అమ్ముకున్నారు. కేవలం ఎకరం క్వింటాలు పత్తిని విక్రయించారు. మండలం మొత్తంగా 15వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఒక్కొక్క ఎకరానికి ఎనిమిది నుండి పది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్టు సమాచారం. దీంతో సుమారు లక్షా 50వేల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. అంటే రైతులు ఎకరానికి రెండు క్వింటాళ్ల పత్తిని మొదట్లోనే విక్రయించారు. ఇలా 30వేల క్వింటాళ్ల వరకు గత సంవత్సరం నవంబర్ వరకు అమ్ముకున్నారు. మరోవైపు పత్తి తీసిన కూలీల ఖర్చు, యాసంగి సాగు పెట్టుబడి కోసం ఒక్కొక రైతు మరో ఐదు క్వింటాళ్ల వరకు అదనంగా విక్రయించారు. అంటే ఒక్క రైతు ఏడు క్వింటాళ్లను తన అవసరాలకు విక్రయించారు. అంటే మొత్తంగా లక్ష క్వింటాళ్ల వరకు విక్రయించగా మరో 50వేల క్వింటాళ్ల పత్తి ఇంకా రైతులు ఇంట్లోనే నిల్వ చేశారు. ఇంకా ధర పెరిగే అవకాశం ఉందని ఆశించంగా అనూహ్యంగా ధర రూ.7,200కు పడిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇక చేసేది లేక అలాగే ఇండ్లలో పత్తిని డంపు చేసి ఉంచారు. మరో వైపుగా ఎండల తీవ్రతతో పత్తి తేమ తగ్గి బరువు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి నిల్వతో దురద

ఇంట్లో పత్తిని నిల్వ చేయడంతో మరో వైపుగా పురుగు తయారై కుటుంబ సభ్యులకు కంతులు వచ్చి దురద లేస్తుంది. దుమ్ముతో శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. .

ధర పెరగడం లేదు.. : రాంరెడ్డి వెంకన్న, మర్రిగడ్డ

పత్తి ధర లేక పోవడంతో అమ్మడం లేదు. కూలీల అవసరాలకు ఎంతో కొంత అడ్డికి పావుసేరుగా అమ్ముకున్నం. ప్రభుత్వం పత్తికి మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలి.

బీజేపీకి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు

సీపీఐ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి వేణు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

నవతెలంగాణ - ఇల్లంతకుంట

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీని ఎదుర్కొనేందుకు వామపక్ష, ప్రజాతంత్ర లౌకికవాద శక్తులను ఏకం చేస్తూ ప్రజలను సంఘటిత పరిచే ఐక్య ఉద్యమాలను నిర్మించబోతున్నామని సీపీఐ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మండలంలోని తాళ్లపెల్లి గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేలాది మంది దళితులపై దాడులు కొనసాగుతున్నాయని అన్నారు. కోట్లాదిమందికి అన్నం పెడుతున్న ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించి చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ నెల 16న ఉదయం 11 గంటలకు సిపిఐ ఆఫీసులో నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర కమిటీ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఏప్రిల్ 14 నుంచి మే 15వరకు జరిగే కార్యక్రమాలను ప్రజలకు వివరించడానికి ఈ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రావణపల్లి మల్లేశం, నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జుట్టు లక్ష్మణ్, జుట్టు ఎల్లయ్య, జుట్టు జానీ, జుట్టు రాజేందర్, జుట్టు బాలయ్య, పందుల రాములు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పెద్దపల్లి కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ


ఇంటర్ పరీక్ష హాల్లో పరిశీలిస్తున్న కలెక్టర్ సంగీత సత్యనారాయణ

నవతెలంగాణ - జూలపల్లి

గ్రామీణ ఉపాధి హామీ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జూలపల్లి మండలంలో పర్యటించిన కలెక్టర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో జూలపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు సక్రమంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రంలో ఉన్న సీసీటీవీ కెమెరాల పనితీరు, విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కల్పించిన ఇతర వసతులు, ఫర్నీచర్ అంశాలను కలెక్టర్ పర్యవేక్షించారు.

అనంతరం జూలపల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ ఉపాధి హామీ పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి సదరు బిల్లులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పనులు పెండింగ్‌లో ఉండకుండా త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో మెటీరియల్ కాస్ట్‌కు సంబంధించిన బిల్లులు చెల్లింపు జరిగేలా ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. ఆసరా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేసి సిద్ధంగా ఉండాలని, వెబ్‌సైట్ ఓపెన్ కాగానే లబ్దిదారుల వివరాలు నమోదు చేసి నూతన పెన్షన్లు మంజూరు త్వరగా అయ్యే విధంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జయశ్రీ, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నా ప్రతి అడుగు అట్టడుగు వర్గాల కోసమే

పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్



నవతెలంగాణ - మంథని

అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసమే ప్రతి అడుగు వేస్తున్నామని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. మంథని మున్సిపల్ పరిధిలో లింగం శంకర్ నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంక్)ను ఆయన మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ లింగం శంకర్‌కు ఎస్సీ కోటా నుంచి పెట్రోల్ బంక్ మంజూరు కాగా స్థలం కోసం తొమ్మిది నెలల పాటు తిరిగారని ఆయన గుర్తు చేశారు. ఆయన ఇబ్బందులను తెలుసుకుని ఎస్సీలకు ఉన్న హక్కులను పూర్తి స్థాయిలో అమలుచేసే విధంగా ఇక్కడ భూమి కొనుగోలు చేసి పెట్రోల్‌బంక్ ఏర్పాటుకు సహకారం అందించామన్నారు. ఎవరు ఎన్ని చేసినా చివరకు ఎస్సీలను అక్కున చేర్చుకునేదే బీసీననే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ సాయం చేస్తున్నామని, ఎంతో మందికి బ్యాంకుల్లో షూరిటీ ఉన్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి : నాబార్డ్ డీడీఎం అనంత్


సర్టిఫికెట్లు అందజేస్తున్న నాబార్డు డీడీఎం అనంత్

నవతెలంగాణ - మంథని

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని నాబార్డ్ డీడీఎం అనంత్ అన్నారు. బుధవారం మంథని ఏపీవో స్వయం సహాయక బృందం కార్యాలయంలో స్వయం ఉపాధి పొందిన మహిళలకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మగ్గంవర్క్‌లో శిక్షణ పొందిన మహిళలు ఇతరులను చైతన్య పరుస్తూ ముందుకు సాగాలన్నారు. అలాగే కోళ్ల పెంపకం, బిస్కెట్లు తయారీ వంటి నాబార్డ్ ఉపాధి పథకాలను ఉపయోగించుకోవాలని సూచించారు. మహిళలందరూ సమిష్టిగా చేరి జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొందాలన్నారు. పచ్చళ్లు, బేకరీ లాంటి చిన్న తరహా పరిశ్రమలను స్థాపించే వారికి చేయూతనిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ లక్ష్మణ్, యూనియన్ బ్యాంక్ మేనేజర్, డీపీఎం రవి, ఏపీఎం పద్మ, ఎన్జీవో విఆర్ఆర్‌డిఎస్ రజిత, రవి, ఇంజినీర్ యజ్ఞంభట్ల లక్ష్మీరాజం పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ - ముస్తాబాద్

మండలంలోని కొండాపూర్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ శరత్‌రావు, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, జెడ్పీటీసీ నరసయ్య, గ్రామ సర్పంచ్ లక్ష్మి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, నాయకులు విజయరామారావు, సురేందర్‌రావు, సర్వర్ పాషా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు..



నవతెలంగాణ - ముస్తాబాద్

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో పూర్తిగా ఎండిపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వరి పంటకు సక్రమంగా నీరు అందకపోవడంతో మండలంలోని నామాపూర్, చిప్పలపల్లి, ముస్తాబాద్‌తో పాటు పలు గ్రామాలలో కొంతమంది రైతుల వరి పంట పూర్తిగా ఎండిపోతుంది. కరెంటు సరైన సమయంలో రాక, కాలువలు లేక పంటలు ఎండిపోయాయని రైతులు వాపోయారు. ఎండిపోయిన వరి పంటకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్ కోరారు.

మేలు చేసిన మిమ్మల్ని ఏనాడు మర్చిపోలేము

మంథని మండల రైతులు
పుట్ట దంపతులకు సన్మానం



నవతెలంగాణ - మంథని : తమ కష్టం తెలుసుకుని రైతుబిడ్డగా జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ చేసిన మేలును ఏనాడు మర్చిపోమని మంథని పట్టణం ఖానాపూర్ గ్రామ రైతులు అన్నారు. మంథని పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం (బండ్ల చెరువు) నుంచి ఖానాపూర్ గ్రామం వరకు డీఎంఎఫ్‌టీ ద్వారా రూ.1.50 కోట్ల నిధులు మంజూరీ చేయించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజను మండలంలోని రైతులు కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. రైతులు, రైతు కూలీలకు మేలు జరిగేలా రహదారి నిర్మాణం చేయించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

18న మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 2022-23 సంవత్సరానికి రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 18న మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ చిరంజీవి బుధవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఇంటర్వ్యూలకు తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

'విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి'

నవతెలంగాణ - వీర్నపల్లి : విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలం కేజీబీవీ పాఠశాలలో బుధవారం వారు సందర్శించారు. పురుగుల, మెరిగెలా అన్నం, కుళ్లిపోయిన కూరగాయలు విద్యార్థులకు పెడుతున్నారని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ సొంత నియోజకవర్గంలో ఇలాంటి దుస్థితి ఉంటే రాష్ట్రంలో పరిస్థితి ఏంటని అన్నారు. వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కొప్పుల నవీన్‌రెడ్డి, శివసాయి, నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-మంథని : కాంగ్రెస్ పార్టీతోనే పేదలు, మైనార్టీలకు న్యాయం జరుగుతుందని ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం మంథని పట్టణంలో మాజీ ఎంపీటీసీ, మాజీ ఎంపీటీసీ పర్వతాలు యాదవ్ కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మంథని మండల ఉపాధ్యక్షుడిగా ఆగే రమేష్‌ను నియమించారు. కార్యక్రమంలో మంథని మండల అధ్యక్షుడు సేగ్గం రాజేష్, నాయకులు తొట్ల తిరుపతి యాదవ్, ఇనుముల సతీష్, శశిభూషణ్ కాచే, మద్దెల రాజయ్య, మంతెన సత్యం, అజీమ్‌ఖాన్, మంథని సురేష్ పాల్గొన్నారు.

శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో బుధవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పాల్గొన్నారు. ఆయన వెంట ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎడ్ల సందీప్, పందిర్ల పరశురామ్‌గౌడ్, ఉదయ్ ఉన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



నవతెలంగాణ - వీర్నపల్లి : వీర్నపల్లి మండలం భూక్యతండా గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సర్పంచ్ భారతి, ఎంపిటిసి అరుణ్ కుమార్ మాట్లాడారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు కళ, ఉపసర్పంచ్ రామావత్ తిరుపతి, నాయకుడు గుగులోత్ శ్రీరామ్ నాయక్, వార్డు సభ్యులు లాకౌత్ శ్రీనివాస్, భూక్య పద్మ, పీరియ, గుగులోతు రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై ఆన్‌లైన్ ద్వారా శిక్షణా కార్యక్రమం

నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ : ఎల్అండ్‌టీ ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్ స్విచ్‌గేర్ ట్రెనింగ్ సెంటర్ పుణే వారి ద్వారా నిర్వహించిన విద్యుత్ భద్రతపై ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం బుధవారం సింగరేణి ఆర్జీ-2లోని జీఎం కాన్ఫరెన్స్ హాల్లో ప్రారంభమైంది. ఈ శిక్షణలో విద్యుత్ వినియోగంలో అజాగ్రత్త వల్ల జరుగు ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. సమావేశంలో డీజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, ఈఈ వర్క్‌షాప్ రాంరెడ్డి, ఎస్ఈ పవర్ సిస్టం ఓసిపి-3 నర్సింహులు, డివైఎస్ఈ జలపతి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



నవతెలంగాణ - మంథని : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మంథనిలోని ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాలికల కళాశాలలో 227 మందికి 28 మంది, బాలుర కళాశాలలో 186 మందికి 20 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నవతెలంగాణ - చదుర్తి

మండలంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభయయ్యాయి. మొత్తం విద్యార్థులు 117 ఉండగా 114 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని డిఓ మోహన్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ ఉంటుందని ఆయన చెప్పారు.

జేఎన్టీయూలో క్రీడా దుస్తులు ఆవిష్కరణ

నవతెలంగాణ - రామగిరి : జేఎన్టీయూ మంథని ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం క్రీడా ఏకరూప దుస్తులను ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్ ఆవిష్కరించారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా కళాశాల తరపున వివిధ క్రీడల్లో పాల్గొనడానికి వెళ్లే క్రీడాకారులు ఏకరూప దుస్తులు ధరించే విధంగా కిట్లు కొనుగోలు చేశామని ప్రిన్సిపాల్ తెలిపారు. క్రీడలకు ప్రాధాన్యతను ఇస్తున్నామని, క్రీడల్లో రాణించి విద్యార్థులు కళాశాలకు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఈఈఈ విభాగ అధిపతి దుర్గారావు, ఆఫీస్ సూపరింటెంట్ రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్ పింగిలి కృష్ణారెడ్డి, హాస్టల్ ఇన్‌చార్జి సుమన్, ఆయా క్రీడల కెప్టెన్లు పాల్గొన్నారు.

పొత్కపల్లిలో ఘనంగా పోచమ్మ బోనాలు



నవతెలంగాణ - ఓదెల : ఓదెల మండలంలోని పొత్కపల్లి గ్రామంలో ముదిరాజ్ కులస్తులు బుధవారం పోచమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిట్టల అంజయ్య, ఉపాధ్యక్షుడు బండారి రాము, చొప్పరి సంపత్, అక్కల సుధాకర్, రెడ్డి రాజమల్లు, పిట్టల సత్తయ్య, పిట్టల సధయ్య, పల్లె కుమార్, సిల్వరి రాజేందర్, బండారి శ్రావణ్, పల్లె మహేందర్, బండారి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.


కాన్షిరామ్‌కు ఘన నివాళి


వీర్నపల్లి మండలం కేంద్రంలో..

నవతెలంగాణ - ముసాబాద్

మండల కేంద్రంలో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షిరాం జయంతిని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు నవీన్, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - రుద్రంగి


రుద్రంగి మండలం కేంద్రంలో..

రుద్రంగి మండల కేంద్రంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు కట్కురి శంకర్ ఆధ్వర్యంలో కాన్షిరాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దేశవేని భూమేశ్, కోశాధికారి సుంచు అనిల్, కాదాసు మహేందర్, ఏనుగందుల సతీశ్, దేశవేని గంగాధర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - వీర్నపల్లి

వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో బీఎస్పీ ఆధ్వర్యంలో కాన్షిరాం జయంతిని నిర్వహించి కేక్ కట్‌చేశారు. బీఎస్పీ సిరిసిల్ల నియోజకవర్గ కార్యదర్శి ఇసంపల్లి కొమురయ్య, మండల ప్రధాన కార్యదర్శి గజ్జెల ప్రశాంత్, గర్జన సెక్టార్ అధ్యక్షుడు గుంటుకు తిరుపతి, నగరపు కృష్ణ, గజ్జెల దిలీప్, ఎడపెల్లి రవీందర్, గజ్జెల మల్లయ్య, కొయ్యేటి కనకయ్య, గుంటుకు పోచయ్య, ప్రభాకర్, నర్సయ్య, రాజయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ - పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కాన్షిరామ్ విగ్రహానికి తెలంగాణ ప్రజాసంఘాల జె.ఏ.సి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్ని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయనవెంట కదారి కొమురేష్, పల్లె సదానందం, కుక్క అశోక్ ఉన్నారు.

జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ చొరువతో అభివృద్ధి

మంథని ఎంపీపీ కొండ శంకర్

నవతెలంగాణ - మంథని

పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ చొరువతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మంథని ఎంపీపీ కొండ శంకర్ అన్నారు. బుధవారం మంథని మండలంలోని ధర్మారం గ్రామంలో మంథని నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించిన సందర్భంలో జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, సీఎం కేసీఆర్ చిత్రపటాలకు ఎంపీపీ, బీఆర్ఎస్ డివిజన్ స్థాయి నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ చైర్మన్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏగోలపు శంకర్‌గౌడ్, మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, సీనియర్ నాయకుడు తగరం శంకర్‌లాల్, స్థానిక సర్పంచ్ రవి, ఎంపీటీసీ తంబారపు సుజాతతిరుపతి, నాయకులు రాజయ్య, అంబీర్ బాపు, లింగయ్య, నరేష్, రాగినేని కుమార్ పాల్గొన్నారు.

డైరెక్టర్ సతీమణికి ఘన సన్మానం



నవతెలంగాణ - రామగిరి

సింగరేణి ఆర్జీ-3 ఏపీఏ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను సిఎస్ సిఓఏ క్లబ్‌లో నిర్వహించారు. అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించి ఇటీవలే డైరెక్టర్ ఆపరేషన్స్‌గా నియమితులైన ఎన్‌వికె.శ్రీనివాస్ సతీమణి కళ్యాణిశ్రీనివాస్‌ను లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షురాలు శ్రీదేవివెంకటేశ్వరరావు, జీఎం ఏపీఏ సతీమణి విజయవెంకటేశ్వర్లుతోపాటు ఇతర సభ్యులు శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం పలువురు మాట్లాడుతూ 2019 నుండి ఇప్పటివరకు లేడీస్ క్లబ్‌కు వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్జీ-1,2 లేడీస్ క్లబ్ అధ్యక్షురాల్లు కె.పద్మనారాయణ, ఏ.సవితమనోహర్, జీఎం సేఫ్టీ సతీమణి ఎస్.జయసాంబయ్య, రెస్క్యూ జీఎం సతీమణి పద్మవెంకటేశ్వర్లుతోపాటు లేడీస్ క్లబ్ సభ్యులు సుజాత, హరిణి, శ్రీలత, లావణ్య, నిఖిత, కోమలి పాల్గొన్నారు.

నిరుపేద యువతి పెండ్లికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం చేస్తున్న గుండారపు కృష్ణారెడ్డి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

నిరుపేద యువతి పెండ్లికి ఎల్లారెడ్డిపేట సింగిల్ విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, లహరి దంపతులు ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. మండల కేంద్రంలోని కేసీఆర్ నగర్‌కు (డబుల్ బెడ్‌రూం) చెందిన నిరుపేద ముష్కం ఆంజాగౌడ్ - రేణుక దంపతుల కూతురు ప్రియాంక గౌడ్ పెండ్లికి 5116 రూపాయల నగదును ఇంటికి వెళ్లి అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, రజక సంఘం మండల అధ్యక్షుడు కంచర్ల నర్సింలు, రెడ్డి సంఘం ప్రతినిధి బంధారపు బాల్‌రెడ్డి, గౌడ సంఘం ప్రతినిధి గంట దేవగౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సుంకి భాస్కర్, జూబేర్ పాల్గొన్నారు.

ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ - జూలపల్లి

జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కంకణాల భారతిజ్యోతిబాస్ ప్రారంభించారు. గ్రామస్తులకు వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు తీగల అశోక్‌గౌడ్, భాగ్యమహేష్, శాంతన్‌రెడ్డి, యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-2 సివిల్ విభాగంలో భద్రతా వారోత్సవాలు



నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ

సింగరేణి ఆర్జీ-2 ఏరియా సివిల్ ఇంజనీర్ విభాగం ఆవరణలో బుధవారం భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులతో కలిసి భద్రతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విధులు నిర్వహించే సమయంలో పాటించాల్సిన భద్రతా నియమాల పత్రాన్ని ఆవిష్కరించి ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం ఎస్.సాంబయ్య, ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, డీజీఎం సివిల్ ధనుంజయ, సీనియర్ సెక్యూరిటీ అధికారి పివి.రమణ, ఈఈ సివిల్ ప్రతాపగిరి రాజు, జేఈ సివిల్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎలక్ట్రిషన్ కమిటీకి సన్మానం



నవతెలంగాణ - జూలపల్లి : జూలపల్లి మండల కేంద్రంలో ఎలక్ట్రిషన్ యూనియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ.హఫీజ్, ఉపాధ్యక్షుడిగా ముమ్మాడి రవి, ప్రధాన కార్యదర్శిగా అబ్బోజు తిరుపతి, కోశాధికారిగా వెంగళ వెంకటేశం, ప్రచార కార్యదర్శిగా మాల్లరపు శంకరయ్య, సలహాదారు కొట్టే సంజీవ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు మామిడిపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సంఘాల, బీసీ సంఘాల నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మానుమల్ల శ్రీనివాస్, కోరపు సంపత్, దాడి కుమార్, రేచావేని లింగయ్య, మహంకాళి కిట్టు, వైద్య సంపత్, మొగురం నరేష్, కేకర్ల రాజు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్‌పై సరైన బాణం సాంస్కృతికోద్యమమే

ఆ దిశగా అడుగులు వేస్తున్న ప్రజానాట్యమండలి

- బీజేపీపై పోరుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు
- ప్రజల్లో చైతన్యం నింపుతున్న వీధినాటకోత్సవాలు
- సీపీఐ(ఎం) జనచైతన్య యాత్రలకు మద్దతు





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కళ ప్రజల కోసం అనే నినాదంతో పురుడుపోసుకున్న ప్రజానాట్యమండలి తెలుగునాట ప్రజా సాంస్కృతికోద్యమ సారధిగా పనిచేస్తున్నది. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో దేశ ప్రగతిని తిరోగమనం వైపు తీసుకెళ్తున్న మోడీ పాలనపై ప్రజలను చైతన్యపరిచేందుకు కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నది. మనువాద భావజాలంతో ప్రజలను అణచిఉంచుతున్న ఆర్ఎస్ఎస్ తీరును, దాని ఆసరాతో రాజకీయ లబ్ది పొందుతున్న బీజేపీ నిజస్వరూపాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించేందుకు శాయశక్తులా కృషిచేస్తున్నది. సమాజ మార్పు కోసం సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాన్ని తీసుకురావడానికి తనవంతు పాత్ర పోషిస్తున్నది. ఆర్ఎస్ఎస్ భావజాలంపై పోరు చేస్తున్న పార్టీలకు, ప్రజాసంఘాలకు అండగా నిలుస్తున్నది. ఈ క్రమంలోనే సీపీఐ(ఎం) తలపెట్టిన జనచైతన్య యాత్రలకు సంఘీభావంగా కార్యాచరణకు పూనుకుంటున్నది.

జనచైతన్య యాత్రకు మద్దతుగా క్యాసెట్

కవులు, రచయితలు, గాయకులను పీఎన్ఎమ్ ఒక్కతాటిపైకి తీసుకొచ్చి వారు సృష్టించిన ప్రజలను చైతన్యపరిచే సాహిత్యాన్ని జనబాహుళ్యంలోకి తీసుకెళ్తున్నది. ప్రత్యేకంగా 10 పాటలతో ఓ ఆడియో క్యాసెట్‌ను రూపొందిస్తున్నది. అదే సమయంలో జనచైతన్య యాత్ర లక్ష్యాలను, ప్రజల సమస్యలను బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను తెలియజేసే కళారూపాలను తయారుచేస్తున్నది. ఇందుకోసం ఇప్పటికే మూడు ప్రాంతాల్లో శిక్షణాశిబిరాలను ప్రారంభించింది. సామాన్యుల ఇబ్బందులకు కారణకులెవరు? వివరించేలా ప్రత్యేక నాటికను పీఎన్ఎమ్ ప్రదర్శించనున్నది.

యాత్రకు సంఘీభావంగా వేలాదిగా కళాకారులు

యాత్రకు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజానాట్యమండలి బృందాలు గ్రామాల్లో సిద్ధమవుతున్నాయి. వీరితోపాటు జానపద కళారంగంలో వందలాది కళాబృందాలను, వేలాది కళాకారులను యాత్ర కోసం కదిలించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.


ఇందుకోసం అన్ని జిల్లాల్లో ప్రజానాట్యమండలి కమిటీలు కృషి చేస్తున్నాయి. ప్రజా, కళారంగంలో భావసారూప్యం కలిగిన పలు సంస్థలను, ప్రసిద్ధ సినీ, నాటక రంగ ప్రముఖులను కూడా ఈ యాత్రలో భాగస్వాముల్ని చేయడానికి ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకత్వం సంప్రదింపులు జరుపుతున్నది. ఇప్పటికే అనేక సంస్థలు కలిసి వచ్చేందుకు తమ సంసిద్ధతను తెలియజేస్తున్నాయని నాయకత్వం తెలియజేసింది.

మూడు టీమ్‌లు..60 మంది కళాకారులు



జన చైతన్య యాత్రలతో పాటు ప్రజానాట్యమండలికి చెందిన మూడు బృందాలు కలిసి సాగనున్నాయి. ఒక్కో బృందంలో 20 మంది సభ్యులు ఉండనున్నారు. డప్పు, నృత్యం, పాటలు పాడటం, నాటికలను ప్రదర్శించడం ఇలా విభిన్న ప్రతిభాపాటవాలను ప్రదర్శించే కళాకారులు ఈ బృందాల్లో ఉండనున్నారు. ఆ బృందాలు యాత్ర కొనసాగే ప్రాంతాలకు ముందే చేరుకుని తమ ప్రదర్శనల ద్వారా ప్రజలను ఉత్తేజ, చైతన్యపర్చనున్నాయి.

జనచైతన్య యాత్రలకు కళాకారుల సంపూర్ణ మద్దతు



సీపీఐ(ఎం) పార్టీ తలపెట్టిన జనచైతన్య యాత్రలకు ప్రజానాట్యమండలి సంపూర్ణ మద్దతు ఉంటుంది. యాత్ర సాగే ప్రాంతాల్లో కళాకారులంతా నేరుగా పాల్గొని మద్దతు తెలుపనున్నారు. రాజ్యాంగం స్థానంలో మనుధర్మశాస్త్రాన్ని తీసుకురావడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు, అది అమలైతే ప్రజలు బానిసలుగా ఏవిధంగా అణచివేయబడతారనే అంశంపై ప్రజలను నిరంతరం చైతన్య పరిచడంలో పీఎన్ఎమ్ ముందు వరుసలో ఉంటుంది. ప్రజలకు మేలు చేసే ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేసేందుకు బీజేపీపై ఎక్కుపెట్టడానికి సరైన బాణం సాంస్కృతికోద్యమే.

ప్రజానాట్యమండలి
రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ్మ

నవచిత్రం

స్వచ్ఛమైన ప్రేమకథ



లావణ్య, చైతన్యరావు

'పెళ్లి చూపులు, డియర్ కామ్రేడ్, దొరసాని' వంటి వైవిధ్యమైన సినిమాలతో అభిరుచిని చాటుకున్న బిగ్ బెన్ సినిమాస్ బ్యానర్‌లో వస్తున్న 6వ చిత్రం 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. ఇచ్చట అందమైన ఫోటోలు తీయబడును అనేది ఉపశీర్షిక. చైతన్యరావు హీరోగా, లావణ్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రొడ్యూసర్ సురేష్ బాబు ఆవిష్కరించి, ఈ చిత్రం మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

దర్శకుడు చెందు ముద్దు మాట్లాడుతూ,'ఈ చిత్రం 1980స్ బ్యాక్‌డ్రాప్‌లో గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ. దీంతో పాటు కొన్ని ట్విస్ట్‌లు, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయి' అని తెలిపారు.

'ఇది ఓ కాన్సెప్ట్ బేస్డ్ సినిమా. అందరూ కొత్తవాళ్లే. ఈ సినిమాకు ప్రధాన బలం కథ. 'ఓ పిట్టకథ' చిత్రంతో మెప్పించిన చెందు ముద్దు ఈ కథను బాగా రాసుకున్నారు. ఫన్‌తో పాటు క్రైమ్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ కూడా బాగా కుదిరాయి. స్క్రీన్‌ప్లే చాలా బావుంటుంది. సినిమాటోగ్రఫీ, మ్యూజిక్, ఎడిటింగ్ అన్నీ అద్భుతంగా కుదిరాయి. త్వరలోనే సినిమాని విడుదల చేస్తాం' అని నిర్మాత యష్ రంగినేని అన్నారు.

మరిన్ని ఘన విజయాలు




హీరో ఆనంద్ దేవరకొండతో 'బేబీ' చిత్ర యూనిట్

విజయవంతమైన చిత్రాలతో ప్రతిభావంతమైన నటుడుగా పేరు తెచ్చుకున్నారు ఆనంద్ దేవరకొండ. విజయ్ దేవరకొండ తమ్ముడుగా ఎంట్రీ ఇచ్చినా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్నారు. 'దొరసాని, మిడిల్ క్లాస్ మెలోడీస్, పుష్పక విమానం' వంటి సక్సెస్ ఫుల్ మూవీస్‌తో సత్తా చాటుకున్నాడు. ప్రస్తుతం ఆయన నటించిన 'బేబీ, గంగం గణేశా' చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో 'బేబీ' చిత్రానికి కలర్ ఫోటోతో నేషనల్ అవార్డ్ అందుకున్న సాయి రాజేశ్ దర్శకుడు. ఎస్కేఎన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్‌తో 'బేబీ' సినిమా మోస్ట్ ప్రామిసింగ్ అనిపించుకుంటోంది. ఈ వేసవిలోనే ఈ చిత్రం విడుదల కాబోతోంది.

ఇక ఆనంద్ నటించిన మరో వైవిధ్యమైన వినోదాత్మక చిత్రం 'గంగం గణేశా'. త్వరలోనే ఈ మూవీ ప్రమోషన్స్ స్టార్ట్ కాబోతున్నాయి. బుధవారం ఆనంద్ బర్త్ డే సందర్భంగా ఈ రెండు చిత్రాల నుంచి స్పెషల్ పోస్టర్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. వీటితో పాటు మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను త్వరలోనే ప్రకటించబోతున్నారు ఆనంద్ దేవరకొండ. తన బర్త్‌డేను అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో ఆనంద్ దేవరకొండ మరిన్ని పెద్ద విజయాలు సాధించాలని అభిమానులు ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

నలుగురిలో ఉంటే.. చిలిపిగ పోతుంటే..



నాగశౌర్య, మాళవిక నాయర్

నాగశౌర్య, శ్రీనివాస్ అవసరాల కలయికలో వస్తున్న మూడవ చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, దాసరి ప్రొడక్షన్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. మాళవిక నాయర్ హీరోయిన్. ఈనెల 17న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్రం నుంచి వివేక్ సాగర్ సంగీతం సమకూర్చిన 'కఫీఫీ' పాట విడుదలైంది. ఇప్పటిదాకా కళ్యాణిమాలిక్ స్వరపర్చిన పాటలు విడుదలై హాయిగా సాగే మెలోడీలు అయితే.. ఈ పెప్పీ నెంబర్ మాత్రం అందరిలో ఉత్సాహాన్ని నింపేలా ఉంది. 'నలుగురిలో ఉంటే.. చనువుకి నో నో చెప్పేదే కఫీఫీ" అంటూ పాట సందర్భానికి తగ్గట్టుగా కిట్టు విస్సాప్రగడ అందించిన సాహిత్యం అందంగా, అర్థవంతంగా ఉంది.

సమ్మర్‌లో సిసలైన వినోదం



రమేష్, కిరణ్ అబ్బవరం

మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో కిరణ్ అబ్బవరం హీరోగా రూపొందుతున్న చిత్రం 'మీటర్'. నూతన దర్శకుడు రమేష్ కడూరి దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది. మేకర్స్ మొదటి సింగిల్ 'చమ్మక్ చమ్మక్ పోరీని' విడుదల చేయడం ద్వారా మ్యూజికల్ ప్రమోషన్‌ను ప్రారంభించారు. హైదరాబాద్‌లోని సంధ్య 70 ఎమ్ఎమ్‌లో భారీ జనసందోహం సమక్షంలో ఈ పాటను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ,' ఈ పాట షూటింగ్ జరిగిన సెట్ చూసి అసలు ఇది మన సాంగేనా ఇంతపెద్ద సెట్‌లో షూట్ చేయబోతున్నామా అనిపించింది. యూనిట్ అంతా ఇదే ఫీలయ్యాం. దీనికి కారణం నిర్మాత చెర్రీ. నన్ను నమ్మి ఇంత పెద్ద సెట్ వేసిన ఆయనకు కృతజ్ఞతలు. సాయి కార్తిక్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఈ పాటే కాదు ఇందులో పాటలన్నీ బావుంటాయి. భాను మాస్టర్ చాలా చక్కగా కొరియోగ్రఫీ చేశారు. మంచి మాస్ మూమెంట్స్ కంపోజ్ చేశారు. పరీక్షలన్నీ చక్కగా రాయండి. ఏప్రిల్ 7న మీ కోసం మంచి ఎంటర్‌టైన్ మెంట్ ప్లాన్ చేశాం. సినిమాలో ఎంటర్‌టైన్‌మెంట్ మీటర్ ఎక్కడా తగ్గదు. సమ్మర్‌లో మీటర్ సాలిడ్ ఎంటర్‌టైన్‌మెంట్' అని తెలిపారు. 'సాయి కార్తిక్ చాలా మంచి సాంగ్ ఇచ్చారు. జేవీ అద్భుతమైన సెట్ చేశారు. ఈ పాట కోసం యాభై లక్షలు అనుకున్న సెట్ కోటి రూపాయిలు అయ్యింది (నవ్వుతూ). పాట అద్భుతంగా వచ్చింది. రమేష్ చాలా అద్భుతంగా తీశారు. తను చాలా పెద్ద దర్శకుడు అవుతాడు' అని నిర్మాత చెర్రీ చెప్పారు.

మంచి కాన్సెప్ట్ బేస్ట్ సినిమా



చిత్రా శుక్లా, ఆదర్శ

నిజ ఘటనలు ఆధారంగా రూపొందిన ఇన్‌టెన్స్ ఎమోషనల్ డ్రామా 'గీత సాక్షిగా'. ఆదర్శ్, చిత్రా శుక్లా హీరో, హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రాన్ని ఈనెల 22న తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేస్తున్నారు. లేటెస్ట్‌గా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ జరిగింది. 'నాంది' సినిమా దర్శకుడు విజయ్ కనకమేడల, నిర్మాత సతీష్ వేగేశ్న ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో ఆదర్శ్ మాట్లాడుతూ, 'నాకు వండర్‌ఫుల్ అవకాశాన్ని నాకు ఇచ్చిన మా నిర్మాత చేతన్‌కి థ్యాంక్స్. డైరెక్టర్ ఆంథోని డేడికేషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. దానికి తగ్గట్టు మంచి కథ దొరికింది.. మూవీ చేశారు' అని చెప్పారు.

'మహిళా సమస్యలపై తెరకెక్కించిన చిత్రం. నటిగా న్యాయం చేశాను' అని హీరోయిన్ చిత్ర శుక్ల అన్నారు.

నిర్మాత చేతన్ రాజ్ మాట్లాడుతూ, 'మన దేశంలో మహిళలను అమ్మగా పూజిస్తాం. అలాంటి వారిపై దురాగతాలు జరుగుతున్నాయి. ఆంథోని సినిమాను చక్కగా తెరకెక్కించాడు' అని తెలిపారు.

'అమ్మాయిలపై దురాగతాలు జరిగినప్పుడు పోలీస్ డిపార్ట్‌మెంట్, కోర్టులు ఎలా రియాక్ట్ అవుతున్నాయనే దాన్ని రీసెర్చ్ చేశాను. నేను చదివిన చాలా ఘటనల్లో నుంచి ఓ పాయింట్ తీసుకుని ఈ సినిమా చేశాను. ఇది రెగ్యులర్ మూవీ కాదు. మంచి కాన్సెప్ట్ బేస్డ్ మూవీ. మహిళా సమస్యలపై బాగా ఫోకస్ చేసిన చిత్రమిది. ఇలాంటి సినిమా తీసే అవకాశం ఇచ్చిన మా నిర్మాత చేతన్ రాజ్‌కి థ్యాంక్స్' అని దర్శకుడు ఆంథోని మట్టిపల్లి చెప్పారు.

ఈ చెంగారెడ్డి మామూలోడు కాదట..



జోజు జార్జ్

పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్త నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న చిత్ర నిర్మాణ కార్యక్రమాలు ముగింపు దశకు చేరుకున్నాయి. వైష్ణవ్ తేజ్ కెరీర్‌లో నాలుగో సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ద్వారా శ్రీకాంత్.ఎన్.రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని నిర్మాతలు ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ చిత్ర సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ప్రతినాయకుడి పాత్రను పరిచయం చేస్తూ తాజాగా చిత్ర యూనిట్ ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రముఖ మలయాళ నటుడు జోజు జార్జ్ ఈ చిత్రంలో చెంగా రెడ్డి అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. 'ఇరాట్ట, జోసెఫ్, నయత్తు, తురముఖం, మధురం' వంటి ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించారు. ఇప్పుడు ఆయన ఈ చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. ఇది పూర్తి స్థాయి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అని దర్శక,నిర్మాతలు తెలిపారు.

కంట తడి పెట్టించే లిల్లీ



దిల్‌రాజుతో 'లిల్లీ' చిత్ర బృందం

గోపురం స్టూడియోస్ పతాకంపై నేహా ముఖ్యపాత్రలో వేదాంత్ వర్మ, ప్రణీతారెడ్డి బాలనటులుగా నటించిన చిత్రం 'లిల్లీ'. రాజ్‌వీర్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. శివమ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో కె.బాబురెడ్డి, జి.సతీష్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో గ్రాండ్‌గా లాంచ్ చేశారు.

ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత దిల్ రాజు ఈ చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'చిన్న పిల్లలు సినిమాలు తియ్యాలని ఎంకరేజ్ చేస్తున్న శివ కృష్ణ అన్నకి ధన్యవాదాలు. నాకు 'లిటిల్ సోల్జర్స్, అంజలి' సినిమాలు చాలా ఇష్టం. మంచి కాన్సెప్ట్‌తో చిల్డ్రన్స్ మీద సినిమాలు చేస్తే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. ఈ ట్రైలర్ చూస్తుంటే పిల్లలందరూ చాలా బాగా చేశారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ సినిమా బిగ్ హిట్ అవ్వాలని ఆశిస్తున్నా' అని తెలిపారు.

'దర్శకుడు శివమ్ చిన్న పిల్లలపై చెప్పిన కథ నచ్చడంతో ఈ సినిమా తీశాం. శివకృష్ణ చాలా మంచి సపోర్ట్ చేశారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న మా సినిమాను అందరూ ఆదరించండి' అని నిర్మాతలు కె.బాబురెడ్డి, జి.సతీష్ కుమార్ అన్నారు. దర్శకుడు శివమ్ మాట్లాడుతూ, 'మా 'లిల్లీ' సినిమా చూసిన ప్రతి ఒక్కరూ కూడా కచ్చితంగా కంట తడి పెట్టకుండా బయటికి పోరు.కాబట్టి ప్రతి పేరెంట్స్ కూడా తమ పిల్లలకు మా సినిమా చూపించాలని కోరుతున్నాం' అని అన్నారు.

విల్లా 369లో ఏం జరిగింది?



'విల్లా 369' చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

విగన్ క్రియేషన్స్ సమర్పణలో విజయ్, శీతల్ బట్ హీరో, హీరోయిన్లుగా తెరకెక్కుతున్న సినిమా 'విల్లా 369'.

సురేష్ ప్రభు దర్శకత్వంలో విద్య గణేష్ నిర్మాతగా, డా.రాకేష్ సహ నిర్మాతగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'దర్శకుడు సురేష్ ప్రభు మంచి సబ్జెక్ట్‌తో ఈ సినిమా నిర్మాతలకు మంచి విజయం అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని చెప్పారు. నిర్మాత విద్య గణేష్ మాట్లాడుతూ,'ఈ చిత్రానికి దర్శకుడు మంచి నటీ నటులను సెలెక్ట్ చేసుకున్నాడు. డి. ఓ. పి ర్యాడీ రఫీ కెమెరా పనితనం, సంగీత దర్శకుడు మహావీర్ అద్భుతమైన మ్యూజిక్ సినిమాకి హైలెట్స్ అవుతాయి. ఈ సినిమాను త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం' అని అన్నారు.

'ఇలాంటి మంచి కథను చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమా అనుకున్న విధంగా చాలా బాగా వచ్చింది' అని చిత్ర దర్శకుడు సురేష్ ప్రభు అన్నారు. రవి వర్మ, జ్యోతి, చిత్రం శ్రీను, శివారెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ : చిత్రం శ్రీను, లక్ష్మణ్ బాబు.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు



వేణు ఎల్దండి

దిల్ రాజు సారథ్యంలో శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హర్షిత్, హన్షిత నిర్మించిన సినిమా 'బలగం'. ప్రియదర్శి, కావ్యా కళ్యాణ్ రామ్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ మూవీని వేణు ఎల్దండి తెరకెక్కించారు.

ఈనెల 3న విడుదలైన చిత్రం ప్రేక్షకుల విశేష ఆదరాభిమానాలను పొందుతుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సక్సెస్ గురించి దర్శకుడు వేణు ఎల్దండి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'నేను 20 ఏళ్లుగా నటిస్తున్నాను. మంచి కమర్షియల్ సక్సెస్ రాలేదు. ఎప్పుడొస్తుందో తెలియదు. అందుకే రాయటం మొదలు పెట్టాను. కొన్ని సినిమాలకు రాశాను. అయితే కథలు రాసే విషయంలో రొటీన్‌కి భిన్నంగా వెళ్లాలనిపించింది. తెలంగాణ కల్చర్‌లో చేదు నోరు అనేది ఉంది. మా నాన్న చనిపోయినప్పుడు మా ఫ్యామిలీ మెంబర్స్ అందరూ వచ్చారు. అక్కడ ఏడుపులు, తాగడాలు, తినడాలు అన్నీ చూస్తే నాకు కొత్తగా కనిపించింది. అవన్నీ నా మైండ్‌లో నాటుకు పోయాయి. వీటిని బేస్ చేసుకుని రాసిన కథని విని శివరాం మాట్లాడుతూ ఇది చాలా పెద్ద కథ. పెద్ద వ్యక్తి చేతిలో ఉంటే మరో లెవల్‌కు రీచ్ అవుతుందన్నారు. ఆయన దిల్ రాజు దగ్గరకు తీసుకొచ్చారు. ఆయనకు కూడా కథ నచ్చడంతో ఈరోజు సినిమా ఇలా మీ ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. సినిమా రిలీజైన తర్వాత మెగాస్టార్ చిరంజీవి నుంచి వచ్చిన అప్రిషియేషన్స్ మరచిపోలేని ఎక్స్‌పీరియెన్స్. ఇకపై నేను చేయబోతున్న సినిమాల్లో వినోదం ఉంటుంది. ఇప్పటికే దిల్ రాజుకి రెడీ ఓలైన్ చెప్పాను. ఇది కాస్త పెద్ద స్పాన్‌లోనే ఉంటుంది' అని చెప్పారు.

సెట్ అంటే ఎవరూ నమ్మలేదు



అవినాష్ కొల్లా

నాని నటించిన పాన్ ఇండియా చిత్రం 'దసరా'. శ్రీకాంత్ ఒదెల దర్శకుడు. కీర్తి సురేష్ కథా నాయికగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 30న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఏకకాలంలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో దీనికి ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేసిన అవినాష్ కొల్లా మీడియాతో మాట్లాడుతూ, 'నానితో 'కృష్ణగాడి వీర ప్రేమగాథ, జర్సీ, శ్యామ్ సింగారాయ్ సినిమాలు చేశాను. కానీ 'దసరా' కథా నేపథ్యం పూర్తిగా భిన్నమైనది. తెలంగాణలోకి ఒక ఊరికి సబంధించిన కల్చర్, అలవాట్లు, కట్టుబాట్లు ఉంటాయి. ఆ ఊరికి కోల్ మైన్ దగ్గరగా ఉండటం వలన పెద్దపెద్ద వాహనాలు ఆ ఊరి నుంచే వెళ్తాయి. దాని కారణంగా సహజంగానే రస్టిక్ టోన్ ఉంటుంది. దీని కోసం 22 ఎకరాల్లో అడవి లాంటి ఒక ఖాళీ ప్రదేశం తీసుకొని భారీ విలేజ్ సెట్ వేశాం. ఐదు వందల మంది నివసించే గ్రామాన్ని నేచురల్‌గా క్రియేట్ చేశాం. 98 శాతం షూటింగ్ సెట్‌లోనే జరిగింది. సెట్‌లో ప్రతి రోజు మూడు వందల మంది ఉండేవారు. ఫస్ట్ షెడ్యుల్ అయ్యేవరకూ అది సెట్ అని ఆ మూడు వందల మందికి తెలీదు. సెట్ మొత్తం రెడీ అయ్యాకా కరెంట్ బోర్డ్ వాళ్ళు వచ్చి బోర్డ్ లేకుండా కరెంట్ ఎలా వాడేస్తున్నారు? అని ప్రశ్నించారు. మాకు కరెంట్ అక్కర్లేదు.. జనరేటర్‌తో నడిపిస్తాం. ఇది సెట్ అని చెబితే ఎంతకీ నమ్మలేదు (నవ్వుతూ). దర్శకుడు శ్రీకాంత్‌ది తెలంగాణ నేపథ్యం. తన ఊరు గురించే కథ రాసుకున్నాడు. మంచి క్లారిటీ ఉన్న దర్శకుడు. నిర్మాత ఎక్కడా రాజీ పడలేదు. ప్రస్తుతం రామ్ చరణ్, నాని 30, 'ఏజెంట్' సినిమాలు చేస్తున్నాను' అని తెలిపారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.